
'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 187

గురువారం 23-3-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





**సిరీస్ సమర్పయామి..**

మూడో వన్డేలో భారత్ ఓటమి.. 2-1తో సిరీస్ గెల్చుకున్న ఆసీస్ - 12లో



**టాప్-10 కుబేరుల్లో అంబానీ**

'హురున్' సంపన్నుల జాబితాలో భారత్ నుంచి ముకేశ్ అంబానీకి చోటు - 13లో



**అప్రమత్తత ముఖ్యం**

గత 2 వారాలుగా కరోనా, ఇన్‌ఫ్లుయెంజా కేసులు పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని ప్రధాని మోదీ సూచించారు.

వివరాలు 6లో ▸



**బాణసంచా పేలి 9 మంది మృతి**

తమిళనాడులోని కాంచీపురం సమీపంలోని బాణసంచా పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి తొమ్మిది మంది మరణించారు.

వివరాలు 6లో ▸



**విదేశీ నిధులపై ఆరా**

ఖలిస్తాన్ నాయకుడు అమృత్‌పాల్ సింగ్‌కు అందుతున్న విదేశీ నిధులపై ఆయన భార్య, తల్లిదండ్రులను పోలీసులు విచారించారు.

వివరాలు 6లో ▸



**ఇద్దరు మిత్రులు సాధించిందేమిటి?**

ప్రపంచ దేశాలపై అమెరికా పెత్తనం ఇక చెల్లదని చెప్పడమే జిన్‌పింగ్, పుతిన్ భేటీ ఉద్దేశమని విశ్లేషకులు చెబుతున్నారు.

వివరాలు 6లో ▸

# చిన్నవైనా.. మిన్నగానే

## నూతన పారిశ్రామిక పాలసీలో ఎంఎస్‌ఎంఈలకు పెద్దపీట

## కొత్త పారిశ్రామిక పార్కుల్లో 33 శాతం కేటాయింపు

- ఎస్సీ పారిశ్రామికవేత్తలకు 16.2 శాతం, ఎస్టీలకు 6 శాతం తప్పనిసరి
- ప్రైవేట్ రంగంలో పార్కుల అభివృద్ధికి ప్రోత్సాహం
- కనీసం 25 ఎకరాల్లో లేదా 50,000 చ.అడుగుల విస్తీర్ణంలో రెడీ టూ బిల్ట్ ఫ్యాక్టరీల అభివృద్ధి
- ఎంఎస్‌ఎంఈల ఆర్థిక పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేలా ఆన్‌లైన్ వ్యవస్థ
- కష్టాల్లో ఉన్నవాటికి చేయూతనిచ్చేందుకు ప్రత్యేకంగా కార్పస్ ఫండ్
- రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో గత మూడున్నరేళ్లలో కొత్తగా 1.56 లక్షల యూనిట్ల ఏర్పాటు
- రూ.20,537.28 కోట్ల పెట్టుబడుల రాక.. 10.04 లక్షల మందికి ఉపాధి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అత్యధిక సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించే విధంగా 2023 – 27 నూతన పారిశ్రామిక విధానంలో పలు ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా కోవిడ్ సమయంలో రీస్టార్ట్ ప్యాకేజీ, వైఎస్సార్ నవోదయం లాంటి పథకాల ద్వారా ఎంఎస్‌ఎంఈ రంగాన్ని ఆదుకున్న రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లలో మరింత అండగా నిలిచేలా పాలసీలో పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. కొత్తగా ఏర్పాటయ్యే ఎంఎస్‌ఎంఈలతో పాటు ఇప్పటికే ఏర్పాటైన యూనిట్లకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించే విధంగా పలు ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఎలాంటి కాలయాపన లేకుండా తక్షణం ఉత్పత్తి ప్రారంభించే విధంగా ప్లగ్ అండ్ ప్లే విధానంలో మౌలిక వసతులను కల్పించనున్నారు. ఏపీఐఐసీ అభివృద్ధి చేసే నూతన పారిశ్రామిక పార్కుల్లో 33 శాతం భూమిని ఎంఎస్‌ఎంఈలకు కేటాయించనున్నారు. ఇందులో కూడా తక్షణం కార్యకలాపాలు ప్రారంభించే విధంగా ప్లగ్ అండ్ ప్లే, స్టాండర్డ్ డిజైన్ ఫ్యాక్టరీ స్పేస్‌లను ఈ రంగ యూనిట్ల కోసం ఏర్పాటు చేయనున్నారు. భూ కేటాయింపుల్లో 16.2 శాతం ఎస్సీ పారిశ్రామిక వేత్తలకు, 6 శాతం ఎస్టీ పారిశ్రామికవేత్తలకు పారిశ్రామిక పార్కుల్లో

మిగతా 2వ పేజీలో ▶

ఉగాది వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతి



# ఏడాదంతా.. వసంత 'శోభ'

## ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నివాసంలో ఉగాది వేడుకలు

- తెలుగుదనం ఉట్టిపడేలా కొత్త సంవత్సరం సంబరాలు.. తిరుమల ఆనంద నిలయం తరహాలో వేదిక
- పల్లె సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రాంగణం
- సతీసమేతంగా పూజలు నిర్వహించిన సీఎం.. తెలుగు లోగిళ్లు సిరిసంపదలు, ఆయురారోగ్యాలతో కళకళలాడాలని ఆకాంక్షించిన ముఖ్యమంత్రి జగన్
- ఉగాది పచ్చడి స్వీకరించి పంచాంగ శ్రవణం, సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించిన సీఎం జగన్ దంపతులు
- పరిపాలన బాగుంటుంది.. సమన్యాయంతో ముందుకు వెళ్తారన్న పంచాంగ శ్రవణకర్త సుబ్బరాయ సోమయాజులు

- వివరాలు 2లో

## న్యూస్‌రీల్

### ఘనంగా పద్మ అవార్డుల ప్రదానోత్సవం



పద్మ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా జరిగింది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 106 మందికి జనవరి 25న కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులను ప్రకటించింది. తొలి విడతలో భాగంగా బుధవారం పలువురికి రాష్ట్రపతి ముర్ము అవార్డులు అందజేశారు.

వివరాలు 3 ▸

### రూ.7.48 కోట్ల బంగారం స్వాధీనం



కస్టమ్స్ అధికారులు బుధవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న రూ.7.48 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి.. న్యాయస్థానంలో హాజరు పరిచారు.

వివరాలు 14 ▸

### మళ్లీ భారత హైకమిషన్ వద్ద ఉద్రిక్తత




లండన్‌లోని భారత హైకమిషన్ వద్ద మళ్లీ వేర్పాటువాద మూక ఖలిస్తాన్ అనుకూల, భారత వ్యతిరేక నినాదాలు చేసింది. నీళ్ల సీసాలు, కొన్ని వస్తువులను హైకమిషన్ భవంతిపైకి విసిరారు. మరోవైపు భారత్‌లోని బ్రిటిష్ హైకమిషన్ ముందున్న బారికేడ్లను పోలీసులే తీసివేశారు. బ్రిటన్ వైఖరికి ఇది బదులని భావిస్తున్నారు.

వివరాలు 6 ▸

# నేడు ఎమ్మెల్యేల కోటా.. 'ఎమ్మెల్సీ' పోలింగ్

**సాయంత్రం 5 గంటలకు కౌంటింగ్ ప్రారంభం**

- సంఖ్యాబలం మేరకు ఏడు స్థానాలకు వైఎస్సార్‌సీపీ పోటీ
- బలం లేకపోయినా ఒక స్థానానికి పోటీ చేస్తున్న టీడీపీ




సాక్షి, అమరావతి: ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. వెలగపూడిలోని తాత్కాలిక శాసనసభ ప్రాంగణంలో పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శాసనసభలో మొత్తం సభ్యుల సంఖ్య 175. ఇందులో వైఎస్సార్‌సీపీకి 151 మంది సభ్యులు ఉండగా.. టీడీపీకి అధికారికంగా 23 మంది, జనసేనకు ఒకరు ఉన్నారు. అయితే కొన్నాళ్లుగా నలుగురు సభ్యులు టీడీపీకి దూరంగా ఉంటున్నారు. దీంతో టీడీపీకి 19 మంది సభ్యుల బలం మాత్రమే ఉంది. అలాగే జనసేనకు ఉన్న ఒక సభ్యుడు కూడా ఆ పార్టీకి దూరమయ్యారు. ఒక్కో ఎమ్మెల్సీ గెలుపొందడానికి 22 మంది సభ్యుల ఓట్లు అవసరం. వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన ఆధిక్యత ఉన్న నేపథ్యంలో ఏడు స్థానాలకు అభ్యర్థులను బరిలో దించింది. ఈ క్రమంలో వాస్తవంగా చూస్తే.. ఒక్క స్థానం గెలవడానికి కూడా టీడీపీకి బలం లేదు. అయినా సరే అభ్యర్థిని బరిలోకి దింపడం చర్చనీయాంశంగా మారింది. వైఎస్సార్‌సీపీలో పనితీరు ఆధారంగా కొంతమంది ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో టికెట్లు దక్కే అవకాశం లేదని అంచనా. ఈ నేపథ్యంలో అలాంటి వారి మద్దతు కోసం టీడీపీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ఆసక్తిని రేపుతున్నాయి. అసెంబ్లీలోని కమిటీ హాల్ నంబర్ -1లో తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే పోలింగ్ సాయంత్రం నాలుగు గంటలకు ముగుస్తుంది. అనంతరం ఐదు గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది. తదుపరి ఫలితాలు ప్రకటిస్తారు.











..ఈ పని ఎప్పుడో మనం చేయాల్సిందనుకుంట సార్!!

### 78.94 లక్షల మంది మహిళలకు రూ.6,419 కోట్లు

- 25న మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ
- దెందులూరులో లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం జగన్
- 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సవాలు
- ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో లబ్ధిదారులతో ముఖాముఖి సమావేశాలు
- ఇప్పటికే రెండు విడతల్లో చెల్లించిన మొత్తం రూ.12,758.28 కోట్లు

14లో

### ఏపీలోనే ఆశా వర్కర్లకు ఎక్కువ వేతనాలు

- ఆంధ్రప్రదేశ్‌లో నెలకు రూ.10 వేలు చొప్పున చెల్లింపు
- తెలంగాణలో రూ.7500, కేరళలో రూ.6 వేలు వేతనం
- కేంద్ర ప్రభుత్వం వెల్లడి

3లో

### కళాశాలల్లో ఇక 'కళా గురువులు'

- ఉన్నత విద్యా సంస్థల్లో త్వరలో స్థానిక కళాకారులకు చోటు
- ఉన్నత విద్య, కళల మధ్య బలమైన బంధానికి యూజీసీ ఆదేశాలు
- కళాకారుల ద్వారా సహ-పాఠ్య కార్యకలాపాలు
- ప్రస్తుత విద్యా వ్యవస్థలో యాంత్రిక పద్ధతి నివారణకు నిర్ణయం
- కళాకారుల సేవలు అవసరమయ్యే విద్యా సంస్థలు వారిని ఎంప్యానెల్ చేయాలి
- హస్తకళలు, సంగీతం, నృత్యం, థియేటర్, జానపదాలు, తోలుబొమ్మ ప్రదర్శనలు తదితర కళాకారులకు చోటు
- ముసాయిదా ప్రతిపాదనలు విడుదల చేసిన యూజీసీ

3లో





*రూ.10/- విలువ గల 70 గ్రాముల బిస్క్ ఫామ్ రిచ్ మారీ ప్యాక్‌పై 20% అదనం
[70 గ్రాములు + 14 గ్రాములు ( 20% అదనం) = 84 గ్రాములు]
This offer is valid till stocks last and applicable in select states only. Non Promotional stocks are also available.
For all Trade & Distribution Enquiry, please contact : 9845402443 / 7204919253


సీఎం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన తిరుమలలోని ఆనంద నిలయం తరహాలో ఆలయ నమూనా


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు


సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సంప్రదాయ నృత్యాలను ప్రదర్శిస్తున్న కళాకారులు

# ఏడాదంతా.. వసంత 'శోభ'

## ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నివాసంలో ఉగాది వేడుకలు



కళాకారులను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతి

**సాక్షి, అమరావతి:** శోభకృత్ నామ సంవత్సరంలో తెలుగు వారందరికీ మంచి జరగాలని, తెలుగు లోగిళ్లు సిరి సంపదలు, ఆయురారోగ్యాలతో కళకళలాడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం గోశాలలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు సంప్రదాయం, ఆచారాలు ఉట్టి పడేలా సంబరాలను నిర్వహించారు. తిరుమలలోని ఆనంద నిలయం తరహాలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నమూనాతో ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మండపంలోని గోడలకు ఏర్పాటు చేసిన దశావతారాల బొమ్మలు ఆకట్టుకున్నాయి.

### సీఎం దంపతుల పూజలు

సంప్రదాయ పంచెకట్టులో సతీ సమేతంగా ఉగాది వేడుకలకు హాజరైన ముఖ్యమంత్రి జగన్ దంపతులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, సాంస్కృతిక, పర్యాటకశాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, దేవదాయశాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్ తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సతీమణి వైఎస్ భారతికి నుదుటన కుంకుమ బొట్టును సీఎం జగన్ దిద్దగా ఆమె కూడా బొట్టు పెట్టారు. అనంతరం ఉగాది వేడుకల ప్రాంగణంలోని శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో సీఎం దంపతులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. టీటీడీ, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం వేదపండితులు సీఎం దంపతులకు వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందించారు.


ఉగాది పచ్చడి తీసుకుంటున్న సీఎం జగన్ దంపతులు

### పచ్చడి స్వీకరించి.. పంచాంగ శ్రవణం

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సీఎం జగన్ పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాంగకర్త కప్పగంతు సుబ్బరాయ సోమయాజులు రూపొందించిన పంచాంగాన్ని సీఎం ఆవిష్కరించారు. పంచాంగ శ్రవణం అనంతరం సీఎం జగన్ దంపతులు ఉగాది పచ్చడిని స్వీకరించారు. ఉగాది వేడుకల ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. వ్యవసాయ పంచాంగం 2023–24, సాంస్కృతికశాఖ రూపొందించిన క్యాలెండర్‌ను సీఎం ఆవిష్కరించారు. అనంతరం వేద పండితులు, కళాకారులను సత్కరించారు. రాష్ట్రంలో ప్రతి అక్కకు, చెల్లెమ్మకు, ప్రతి సోదరుడికి, స్నేహితుడికి, అవ్వాతాతలకూ నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని, దేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని మనసారా ఆకాంక్షిస్తూ సీఎం జగన్ అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి రోజా, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పాడి పంటలతో కళకళ

- ఈ ఏడాదంతా రాష్ట్ర ప్రజలకు మంచి ఫలితాలు
- పంచాంగ శ్రవణంలో సుబ్బరాయ సోమయాజులు

శోభకృత్‌లోకి అడుగుపెట్టాం. ఈ ఏడాది నవనాయకులు, గ్రహాలు యోగ్య స్థానాల్లో సంచరిస్తున్నాయి. శని సంచారం బాగుండటం వల్ల శ్రామికులు, కర్షకులకు లాభదాయకంగా ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రజల మధ్య స్నేహం విలసిల్లి ముందుకు నడుస్తారు. నవ నాయకుల ఆధిపత్యంలో ఎనిమిదింటికి శుభగ్రహాల ఆధిపత్యం ఉండటం ఈ ఏడాది అత్యంత విశేషమైన అంశం. ఈ మధ్య కాలంలో ఇన్ని మంచి గ్రహాలకు ఆధిపత్యం లభించడం ఇదే ప్రథమం. పాపగ్రహాల్లో ఒక్క శని మాత్రమే ధాన్యాధిపతిగా ఉన్నందున ఈ ఏడాది అందరికీ చక్కటి ఫలితాలు లభిస్తాయి. రాష్ట్ర ప్రజలకు మంచి చేకూరుతుందని శోభకృత్‌లో గ్రహ సంచారం స్పష్టం చేస్తోంది. పూర్వ పద్ధతిని అనుసరించి పాడ్యమి తిథి ప్రవేశించిన సమయం ప్రకారం చూసినా చాలా మంచి ఫలితాలు వస్తాయి. వ్యవసాయదారులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వ విధానాలు, వర్షపాతం రైతులకు అనుకూలంగా ఉంటాయి. విద్యతో విదేశాలకు వెళ్లేవారికి అనుకూలం. అక్టోబర్ తర్వాత నుంచి విశేషమైన ఫలితాలు లభిస్తాయని గ్రహ సంచారం చెపుతోంది. గురు, రాహువులు కొద్దిగా చికాకులు కల్పించినా మొత్తం మీద అనుకూలంగా ఉంటుంది.

**సమన్యాయంతో ముందుకు..**

పాలకుడి గ్రహస్థితి ప్రకారం చూసినా సీఎం జాతకాన్ని బట్టి గురు, శని సంచారం బాగుండటం వల్ల విజయవంతమైన పథకాలను చేపట్టి ముందుకు వెళ్తారు. ఈ ఏడాదంతా రాష్ట్ర ప్రజలకు మంచి ఫలితాలు లభించడానికి అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. గురువు బలంగా ఉండటం వల్ల సంప్రదాయ వృత్తుల్లో ఉన్నవారికి భవిష్యత్తుపై ఆశ పెరుగుతుంది. కుజ సంచారం వల్ల పరిశ్రమలు, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల అభివృద్ధి బాగుంటుంది. అంటువ్యాధులు ప్రబలే అవకాశాలున్నా గురు సంచారం వల్ల ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. ఈ ఏడాది శుభకార్యాలు ఎక్కువగా జరుగుతాయి.

## గుడ్ మార్నింగ్..

### ఇదొక్క అందమైన మార్నింగ్!

ఈ శుభోదయపు పలకరింపుతోనే సరిగ్గా పదిహేనేళ్ల క్రితం.. రంగుల హరివిల్లులా.. 'సాక్షి' దిన పత్రిక ఆవిర్భవించింది. 'సత్యమేవ జయతే..' అంటూ నిఖార్సైన జర్నలిజానికి శంఖం పూరించింది. నాటి నుంచీ అంచెలంచెలుగా ఎదుగుతూ విలువలకు కట్టుబడిన పాత్రికేయ ధర్మాన్ని నిబద్ధతతో కొనసాగిస్తూ వస్తోంది. ఈ మహాయజ్ఞం ఇప్పుడు పదహారవ యేటలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో 'సాక్షి' తన పాఠకులకు చిన్న క్విజ్ పెట్టి, కానుకలను ఇవ్వదలచింది. వివరాల కోసం ఇప్పుడే sakshi.com ఓపెన్ చేయండి, జవాబు చెప్పండి.. బహుమతి గెలుచుకోండి అన్న లింకును క్లిక్ చేయండి.

| ఈరోజు ప్రశ్న | సాక్షి ఎడిటర్ వర్ధెల్లి మురళి సండే కాలమ్ పేరు? | ఎ) ఘనతంత్రం | బి) జనతంత్రం |
|---|---|---|---|
| | | సి) పంచతంత్రం | డి) ప్రజాతంత్రం |

## రైతులకు మేలు జరగాలి: సీఎం జగన్

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర ప్రజలందరికీ సీఎం వైఎస్ జగన్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో అన్నీ శుభాలు జరగాలని అభిలషించారు.'రైతులకు మేలు జరగాలి, అక్కచెల్లెమ్మలు ఆనందంగా ఉండాలి. సకల వృత్తుల వారు సంతోషంగా ఉండాలి. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాను' అని బుధవారం ఆయన ట్వీట్ చేశారు.

## క్యాలెండర్, పంచాంగాన్ని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి జగన్


శిల్పారామం సొసైటీ రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

**సాక్షి, అమరావతి/తాడేపల్లి గూడెం:** ఉగాదిని పురస్కరించుకుని శిల్పారామం సొసైటీ రూపొందించిన ప్రత్యేక క్యాలెండర్‌ను, పశ్చిమ గోదావరి జిల్లాలోని వెంకట్రామన్నగూడెంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ ప్రచురించిన ఉద్యాన పంచాంగాన్ని సీఎం వైఎస్ జగన్ బుధవారం ఆవిష్కరించారు. ప్రతి ఏటా ఉగాది సందర్భంగా శిల్పారామం క్యాలెండర్‌ను, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ పంచాంగాన్ని విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రి రోజా, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌భార్గవ, శిల్పారామాల సీఈవో శ్యామ్‌సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఉగాది వేడుకలు



వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఉగాది సందర్భంగా జరిగిన పూజలో పాల్గొన్న నేతలు

**సాక్షి,అమరావతి:** శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ ప్రత్యేక పూజల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకుడు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి కార్యకర్తలకు, నేతలకు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నవరత్నాల ప్రోగ్రాం వైస్ చైర్మన్ నారాయణమూర్తి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు స్పెషాలిటీ వైద్య పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

**సాక్షి, అమరావతి:** ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) ఆస్పత్రుల్లో 5 స్పెషాలిటీల్లో 180 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (సీఏఎస్ఎస్) పోస్టుల భర్తీకి ప్రభుత్వం గురువారం వాక్–ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనుంది. విజయవాడలోని పాత జీజీహెచ్ ప్రాంగణంలో ఉన్న డీఎంఈ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో 14 స్పెషాలిటీల్లో 445 పోస్టుల భర్తీకి 23 నుంచి 27వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. తొలి రోజు జనరల్ మెడిసిన్ 94, జనరల్ సర్జరీ 70, డెర్మటాలజీ 8, మైక్రోబయాలజీ 2, ఫోరెన్సిక్ మెడిసిన్ 6 పోస్టుల భర్తీ చేపడతారు. శాశ్వత, కాంట్రాక్ట్ విధానాల్లో వైద్యుల ఎంపిక ఉంటుంది. పూర్తి వివరాలకు 6301138782 నంబర్‌ను సంప్రదించవచ్చు.

తెలంగాణ

## భద్రాద్రిలో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

**భద్రాచలం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో వసంత పక్ష ప్రయుక్త తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు బుధవారం వైభవంగా అంకురార్పణ చేశారు. శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేక మహోత్సవాలకు ఏకకాలంలో మృత్సంగ్రహణం చేసి, వేడుకలకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఉదయం చిత్రకూట మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, ఆ తర్వాత ప్రత్యేకంగా నిర్మించిన యాగశాలల్లో ఉత్సవ మూర్తులను ప్రవేశపెట్టి పూజలు చేశారు. వాస్తు హోమం, పర్యగ్నికరణం జరిపి పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక విశిష్టతను వేద పండితులు వివరించారు. 15 రోజుల పాటు సంక్షేమ రామాయణ హవనం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం బేడా మండపంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు.

# చిన్నవైనా.. మిన్నగానే

▶ మొదటి పేజీ తరువాయి

రిజర్వేషన్లు కల్పించింది.

**ప్రైవేట్ రంగంలో పార్కుల అభివృద్ధి**

ప్రైవేట్ రంగంలో ఎంఎస్ఎంఈ పార్కులు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలను ప్రకటించింది. కనీసం 25 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు లేదా కనీసం 50,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో డిజైన్ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను నిర్మించే సంస్థలకు ఈ ప్రోత్సాహకాలు ఇవ్వనుంది. వీటి నిర్మాణ వ్యయంలో 25 శాతం లేదా గరిష్టంగా రూ.కోటిని ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణం కోసం సేకరించిన భూమికి సంబంధించి 100 శాతం స్టాంప్ డ్యూటీ మినహాయింపు, భూ వినియోగ మార్పిడికి సంబంధించి 100 శాతం నాలా చార్జీలకు మినహాయింపు లభిస్తుంది. టర్మ్ రుణాల వడ్డీపై 3 శాతం వడ్డీ రాయితీ చెల్లింపు గరిష్టంగా మూడేళ్లపాటు కోటి రూపాయలు లభించనుంది. పార్కుల్లో ఎంఎస్ఎంఈ యూనిట్ల ఏర్పాటు ఆధారంగా ఈ రాయితీలు చెల్లించనున్నారు. పార్కుల్లో 50 శాతం ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటైతే 50 శాతం రాయితీలు, 100 శాతం పూర్తయిన తర్వాత మిగిలిన రాయితీలు చెల్లిస్తారు.

**పాతవాటికి చేయూత**

ఇప్పటికే ఏర్పాటైన ఎంఎస్ఎంల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ కష్టాల్లో ఉన్న సంస్థలకు చేయూతనందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక వ్యవస్థను తెస్తోంది. ఎంఎస్ఎంఈల ఆర్థిక పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జీఎస్టీ డేటాబేస్ ఆధారంగా ఎంఎస్ఎంఈల టర్నోవర్‌ను పర్యవేక్షిస్తూ ఒకవేళ తగ్గితే అందుకు కారణాలను అధికారులు పరిశీలిస్తారు. కోలుకునేందుకు సూచనలు చేయడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంపై చర్చిస్తారు. ఇందుకు ఎంఎస్ఎంఈల కోసం ప్రత్యేకంగా ఒక కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పోటీ వాతావరణాన్ని తట్టుకుని వ్యయాలను తగ్గించుకోవడం, అప్‌గ్రేడేషన్ దిశగా ప్రోత్సహించేలా పలు ప్రోత్సాహకాలను ప్రకటించారు. టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ వ్యయంలో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది.

**ఇలా ఆదుకున్నారు..**

ఎంఎస్ఎంఈ రంగానికి తోడ్పాటునిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ యూనిట్ల సంఖ్య 1.10 లక్షలు కాగా, గత మూడున్నరేళ్లలో కొత్తగా 1.56 లక్షల యూనిట్లు ఏర్పాటు కావడమే దీనికి నిదర్శనం. రాష్ట్రంలో ఒక్కో ఎంఎస్ఎంఈ యూనిట్ సగటున 10 మందికి ఉపాధి కల్పిస్తోంది. కొత్త యూనిట్ల ద్వారా సుమారు 10.04 లక్షల మందికి ఉపాధి లభించడమే కాకుండా రూ.20,537.28 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇవ్వకుండా గత సర్కారు బకాయి పెట్టిన రూ.962.05 కోట్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెల్లించడమే కాకుండా ఏ సంవత్సరం రాయితీలను అదే ఏడాది చెల్లిస్తోంది. రూ.1,715.16 కోట్ల రాయితీలను, రూ.1,144 కోట్ల విలువైన విద్యుత్ రాయితీ ప్రోత్సాహకాలను ఈ ప్రభుత్వం చెల్లించింది. అంతేకాకుండా వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం ద్వారా 2020–21లో ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రూ.235.74 కోట్లు, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.41.58 కోట్ల రాయితీలను విడుదల చేసింది. 2021–22లో ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రూ.111.78 కోట్లు, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.24.41 కోట్ల రాయితీలను విడుదల చేసింది.

### అద్భుతమైన పాలసీ: దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన పారిశ్రామిక విధానం ఎంఎస్ఎంఈ, స్టార్టప్, మౌలిక రంగ పరిశ్రమలకు అద్భుతమైన పాలసీ అని దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు మామిడి సుదర్శన్ ప్రశంసించారు. స్టార్టప్ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు, విశాఖలో స్టార్టప్ మిషన్ ఏర్పాటుకు ఇది ఎంతో దోహదం చేస్తుందన్నారు. పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, ప్యాకేజింగ్ పరిశ్రమలు, ట్రక్ పార్కింగ్ వ్యవస్థల ఏర్పాటుతో రాష్ట్రంలో లాజిస్టిక్ రంగం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అన్ని రంగాలను అభివృద్ధి చేసేలా పాలసీ ప్రకటించిన సీఎం జగన్‌కు దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.



### ఎంఎస్ఎంఈలు అంటే..

- **మైక్రో(సూక్ష్మ):** రూ.కోటి లోపు పెట్టుబడి విలువ, వార్షిక టర్నోవర్ రూ.5 కోట్ల లోపు ఉన్నవి.
- **స్మాల్ (చిన్న):** పెట్టుబడి విలువ రూ.10 కోట్ల లోపు ఉండి, వార్షిక టర్నోవర్ రూ.50 కోట్లు దాటనివి.
- **మీడియం:** పెట్టుబడి విలువ రూ.50 కోట్ల లోపు ఉండి, వార్షిక టర్నోవర్ రూ.250 కోట్లు దాటనివి.

### 2023 - 27లో సూక్ష్మ, చిన్న స్థాయి పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

| వివరం | ప్రోత్సాహకం |
|---|---|
| ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ | 15శాతం, గరిష్టంగా రూ.20 లక్షలు. మహిళలకు గరిష్టంగా రూ.30 లక్షలు |
| వడ్డీ సబ్సిడీ | 3 శాతం వడ్డీ రాయితీ 5 ఏళ్లకు గరిష్టంగా రూ.25 లక్షలు, బీసీ, మైనార్టీలకు గరిష్టంగా రూ.30 లక్షలు |
| ఎస్‌జీఎస్టీ చెల్లింపు | భూమి విలువ కాకుండా 5 ఏళ్లపాటు పూర్తిగా 100 శాతం ఎస్‌జీఎస్టీ తిరిగి చెల్లింపు |
| స్టాంపు డ్యూటీ | అన్ని వర్గాలకు 100 శాతం |
| భూ వినియోగమార్పిడి | 25 శాతం.. గరిష్టంగా రూ.10 లక్షలు |
| స్థిర విద్యుత్ చార్జీలు | 5 ఏళ్లపాటు యూనిట్‌కు రూపాయి తిరిగి చెల్లింపు |
| ఐపీ అక్విజేషన్ | 75 శాతం.. గరిష్టంగా రూ.10 లక్షలు |
| టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ | 50 శాతం.. గరిష్టంగా రూ.25 లక్షలు |
| క్వాలిటీ సర్టిఫికేషన్ | 100 శాతం.. గరిష్టంగా రూ.3 లక్షలు |
| సర్వీస్ సెక్టార్ | పరిశ్రమల సంబంధిత సేవా రంగంలో క్యాపిటల్ సబ్సిడీ 15శాతం.. గరిష్టంగా రూ.20 లక్షల వరకు |
| **మధ్య తరహా పరిశ్రమలకు..** | |
| ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ/ ఎస్‌జీఎస్టీ | ఎఫ్‌సీఐలో 15 శాతం.. గరిష్టంగా రూ.2.5 కోట్లు, 5 వార్షిక వాయిదాల్లో చెల్లింపు లేదా ఐదేళ్ల పాటు 50 శాతం నికర ఎస్‌జీఎస్టీ |
| ఐపీ అక్విజేషన్ | 75 శాతం.. పరిమితి గరిష్టంగా రూ.10 లక్షలు |
| టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ | 50 శాతం.. గరిష్టంగా రూ.25 లక్షలు |

## ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్

# శ్రీనాథ్‌రెడ్డి కన్నుమూత

- రేపు కోరగుంటపల్లిలో అంత్యక్రియలు
- ముఖ్యమంత్రి జగన్, ఇతర ప్రముఖుల సంతాపం



**సాక్షి, అమరావతి:** ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్, సీనియర్ జర్నలిస్టు దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి (67) కన్నుమూశారు. హైదరాబాద్‌లో ఉంటున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. హైదరాబాద్ అప్పా జంక్షన్ కాళీమాత టెంపుల్ సమీపంలో నివసిస్తున్న ఆయన బుధవారం రాత్రి 7.45 గంటలకు తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సుధారాణి, కుమార్తెలు దీపు, కీర్తి ఉన్నారు. శ్రీనాథ్‌రెడ్డి అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం ఆయన స్వగ్రామం వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం కోరగుంటపల్లిలో నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. పులివెందుల నియోజకవర్గం కోరగుంటపల్లిలో రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించిన ఆయన చెన్నై ట్రిప్లికేన్‌లోని హిందూ హైస్కూల్‌లో పదోతరగతి వరకు చదివారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఫిలాసఫీలో పీజీ చేశారు. 1978లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో చేరారు. కడప రిపోర్టర్‌గా దాదాపు 30 ఏళ్లు, తరువాత కొంతకాలం హైదరాబాద్‌లో పనిచేశారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపు సంస్థలు, బీబీసీ, సాక్షిలో ఉన్నత హోదాల్లో పనిచేశారు. ఉమ్మడి ఏపీలో ఏపీయూడబ్ల్యూజేలో కీలకనేతగా వ్యవహరించారు. ఉన్నతవిద్య చదివిన యువకులు ఎందరినో ఆయన జర్నలిస్టులుగా తీర్చిదిద్దారు. రెండు దశాబ్దాలపాటు కడపలో శ్రీనాథ్‌రెడ్డి కార్యాలయమే రాయలసీమ ఉద్యమానికి కేరాఫ్ అడ్రస్‌గా ఉండేదంటే అతిశయోక్తి కాదు. ఆయన సేవల్ని గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారం చేపట్టిన తొలినాళ్లల్లో ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమించారు. 2019 నుంచి దాదాపు మూడేళ్లు శ్రీనాథ్‌రెడ్డి ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన మృతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎం సలహాదారు (గ్రామ, వార్డు సచివాలయాలు, స్పందన) ఆర్.ధనుంజయరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ఏపీ ప్రెస్ అకాడమీ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు. దేవిరెడ్డి మృతి తీరనిలోటని వారు పేర్కొన్నారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

# ఏఎస్పీ సుప్రజకు అబ్దుల్‌కలాం పురస్కారం


నేపాల్ ప్రతినిధుల నుంచి అవార్డు అందుకుంటున్న ఏఎస్పీ సుప్రజ

**గుంటూరు (పట్నం బజార్):** ఓ చిన్నారికి జరిగిన అన్యాయంపై సంచలన తీర్పు వచ్చేలా విశేష కృషి చేసిన గుంటూరు అడిషనల్ ఎస్పీ కె.సుప్రజకు అవార్డు దక్కింది. ప్రతిష్టాత్మకమైన ఏపీజే అబ్దుల్‌కలాం 2022–23 ఇంటర్నేషనల్ అవార్డు ఆమెను వరించింది. సుప్రజ గుంటూరు ఈస్ట్ డీఎస్పీగా పనిచేస్తున్న సమయంలో నేపాల్‌కు చెందిన దంపతులు స్వెట్టర్లు విక్రయించేందుకు గుంటూరు వచ్చారు. ఆ దంపతులకు నాలుగేళ్ల చిన్నారి ఉండగా.. ఆ చిన్నారిపై ఓ వృద్ధుడు అఘాయిత్యానికి ఒడిగట్టాడు. విషయం తెలుసుకున్న సుప్రజ నిందితుడిపై చర్యలు తీసుకునేందుకు సమాయత్తమయ్యారు. అప్పటికే దంపతులిద్దరూ నేపాల్ వెళ్లిపోగా.. పోలీస్ సిబ్బందిని అక్కడకు పంపించి తిరిగి వారిని రప్పించారు. నిందితుడు జీవితకాలం జైలులో ఉండే శిక్ష పడేలా చార్జిషీట్ దాఖలు చేశారు. కాగా, మేడికొండూరు ఘటనలో బాలికను తీసుకెళ్లి వ్యభిచారం చేయించిన సుమారు వంద మందిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఈ రెండు కేసుల్లో పురోగతి సాధించిన ఏఎస్పీ సుప్రజను అభినందిస్తూ నేపాల్ ప్రభుత్వం ఏపీజే అబ్దుల్‌కలాం ఇంటర్నేషనల్ అవార్డుకు ఎంపిక చేసింది. అవార్డును నేపాల్ మాజీ ఉప రాష్ట్రపతి పరమానందజ, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు బుధవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకుని ఆమెకు అందజేశారు.

## క్లుప్తంగా...

### దేశం విడిచి వెళ్లేందుకు కోర్టు నుంచి ఎన్‌ఓసీ తప్పనిసరి

- అప్పుడే పాస్‌పోర్ట్ రెన్యూవల్
- తీర్పులో స్పష్టం చేసిన హైకోర్టు



సాక్షి అమరావతి: క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న వ్యక్తి దేశం విడిచి వెళ్లేందుకు సంబంధిత కోర్టు నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) సమర్పించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. దేశం విడిచి వెళ్లేందుకు అభ్యంతరం లేదని కోర్టు ఎన్‌ఓసీ ఇచ్చిన తరువాతే పాసుపోర్టు రెన్యూవల్ దరఖాస్తును పాస్‌పోర్ట్ అధికారులు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. నిరభ్యంతర పత్రం సమర్పించిన తరువాత క్రిమినల్ కేసు కారణంగా చూపి పాస్‌పోర్ట్ రెన్యూవల్‌ను తిరస్కరించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. క్రిమినల్ కేసులతో సంబంధం లేకుండా తమ పాస్‌పోర్ట్‌లను రెన్యూవల్ చేసేలా ఆదేశించాలంటూ కొంత మంది చేసిన అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. వారి పిటిషన్లను కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావినాథ్ తిల్హారి ఇటీవల తీర్పు వెలువరించారు.

### 'కోటప్పకొండ'కు ఐఎస్‌వో సర్టిఫికెట్



ఈవోకు సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి అంబటి, ఎమ్మెల్యే గోపిరెడ్డి తదితరులు

నరసరావుపేట: కోటప్పకొండ పుణ్యక్షేత్రంపై శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూపంగా వెలసిన శ్రీ త్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానానికి మెయింటెనెన్స్ ఆఫ్ గ్రీన్‌జోన్ వారి ఐఎస్‌ఓ 9001 సర్టిఫికెట్ అభించింది. ఈ మేరకు సర్టిఫికెట్‌ను పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన ఉగాది ఉత్సవాల్లో దేవస్థాన ఈవో వేమూరి గోపీకి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ప్రదానం చేశారు. కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, అడిషనల్ ఎస్పీ బిందుమాధవ్, ఐఎస్‌వో అధీకృత అధికారి శివయ్య పాల్గొన్నారు.

### ఉగాదికి, టీడీపీకి దగ్గర సంబంధం ఉంది: చంద్రబాబు



టీడీపీ కార్యాలయంలో ఉగాది పచ్చడి ఆరగిస్తున్న చంద్రబాబు

సాక్షి, అమరావతి: అధికార పార్టీ ఆశలు ఇకపై సాగవని పంచాంగంలో చెప్పారని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పంచాంగం ఒక డైరెక్షన్ ఇస్తుందని, సూచనప్రాయంగా సంకేతాలిస్తుందన్నారు. పంచాంగం ఎంతో శాస్త్రోక్తంగా రాస్తున్నారని, ఆస్ట్రాలజీ కూడా సైన్సేనని చెప్పారు. తెలుగు జాతి అనేక రంగాల్లో రాణిస్తోందని, నాలెడ్జ్ ఎకానమీలో తెలుగు వారి ప్రతిష్ట పెరిగిందన్నారు. ఉగాదికి, టీడీపీకి దగ్గర సంబంధం ఉందని తెలిపారు. నాలుగేళ్ల రాష్ట్రంలో కష్టాలే ఉన్నాయని, శోభకృత్ నామ సంవత్సరంలో శుభాలే జరుగుతాయని చెప్పారు. ఏపీ ప్రజలకు వెలుగు రావడం ఖాయమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు తిరుగుబాటు చేసి టీడీపీకి ఓట్లేశారని తెలిపారు. మహిళలకు రక్షణ ఉండాలన్నారు. వేద పండితులు పంచాంగ శ్రవణం వినిపిస్తూ ఈ సంవత్సరం సైకిల్ దూసుకెళ్తుందని చెప్పారు. ప్రజల్లో లోకేశ్ ఆదరణ పెరుగుతుందని, చంద్రుడు ఇంద్రుడై చక్రం తిప్పుతారని తెలిపారు.

### బీజేపీ, జనసేన విడిపోవాలని అనుకునే వారి కోరిక నెరవేరదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



సాక్షి, అమరావతి: 'బీజేపీ, జనసేన పార్టీల మధ్య ఉన్న పొత్తు చెడిపోవాలని.. విడిపోవాలని కొంత మంది కోరుకుంటున్నట్టు ఉన్నారు. వాళ్ల కోరిక నెరవేరదు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పారు. బుధవారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియా అడిగిన పలు ప్రశ్నలకు జవాబిచ్చారు. 'మాధవ్ వ్యాఖ్యలపై ఇంతకు మించి స్పందించను. ఒక చిన్న మాట పట్టుకొని ఏదేదో ఊహించేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మా అభ్యర్థులకు జనసేన నుంచి అందిన సహకారం ఎంత అనేది మీరే ఆలోచించుకోండి' అని సోము వీర్రాజు వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయి పోరాటాలకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కాగా, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేద పండితులు నారాయణ శర్మ పంచాంగ పఠనం చేశారు. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 15 మంది ప్రముఖులను సోము వీర్రాజు సన్మానించారు.

# అంతరిక్షంలోకి వెళ్లొద్దామా!



అంతరిక్షంలో పర్యటించాలనుకునే భారతీయుల కల నెరవేరే తరుణం రాబోతోంది. 2030 నాటికి స్పేస్ టూరిజం కాన్సెప్ట్‌ను పట్టాలెక్కించేలా భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకోసం ప్రైవేట్ స్పేస్ ఏజెన్సీలతో కలిసి పని చేసేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు.

**స్పేస్ టూరిజానికి రూపకల్పన చేస్తున్న ఇస్రో**

**టికెట్ ధర రూ.6 కోట్లు ఉండే అవకాశం**

**2030 నాటికి స్పేస్ టూరిజం ప్రాజెక్టు పట్టాలెక్కుతుందంటున్న ఇస్రో చైర్మన్**

సాక్షి, అమరావతి:

కొత్త ప్రదేశాలను వీక్షించాలనుకునే పర్యాటకులు ఇకపై అంతరిక్షంలోనూ పర్యటించవచ్చు. సమీప భవిష్యత్‌లోనే అంతరిక్ష పర్యాటకం అందుబాటులోకి రానుంది. ప్రపంచ వ్యాప్తంగా స్పేస్ టూరిజంపై ఆసక్తి పెరుగుతుండటంతో ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) సైతం దీనిపై దృష్టి సారించింది. 2030 నాటికి స్పేస్ టూరిజాన్ని పట్టాలెక్కిస్తామని.. అందుకు సంబంధించిన పని జరుగుతోందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ ఇటీవలే ప్రకటించారు. ఇందుకోసం సొంతంగా ఒక మాడ్యూల్ తయారు చేస్తున్నట్టు తెలిపారు. ఈ అంతరిక్ష పర్యాటక ప్రాజెక్టు చాలా సురక్షితంగా మళ్లీ ఉపయోగించుకునేలా రూపొందిస్తున్నారు. ఈ పర్యటనలో ఒక టికెట్ ధర రూ.6 కోట్లు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ స్పేస్ టూరిజం మార్కెట్‌కు అనుగుణంగా ఈ ధర ఉండనుంది. ఈ పర్యటన చేసినవాళ్లు తాము వ్యోమగాములమని చెప్పుకోవచ్చు.

### సబ్ ఆర్బిటలా.. ఆర్బిటలా!




అంతరిక్ష పర్యటన ఆర్బిటల్‌గా ఉంటుందా లేక సబ్ ఆర్బిటల్‌గా ఉంటుందా అనే దానిపై స్పష్టత లేదు. ధర రూ.6 కోట్లుగా అంచనా వేయడాన్ని బట్టి ఇది సబ్ ఆర్బిటల్ పర్యటనే అయి ఉండవచ్చని భావిస్తున్నారు. స్పేస్ క్రాఫ్ట్ ప్రయాణించే వేగాన్ని బట్టి ఆర్బిటల్ పర్యటనా.. సబ్ ఆర్బిటల్ పర్యటనా అనేది ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. ఆర్బిటల్ స్పేస్ క్రాఫ్ట్ ఆర్బిటల్ వెలాసిటీ (కక్ష్య వేగం)తో ప్రయాణిస్తుంది. సబ్ ఆర్బిటల్ రాకెట్ దాని కంటే తక్కువ వేగంతో ప్రయాణిస్తుంది. సబ్ ఆర్బిటల్ ట్రిప్ అయితే స్పేస్ క్రాఫ్ట్‌లో తిరిగి భూమ్మీదకు వచ్చేప్పుడు అంతరిక్షం అంచుల్లో కొద్ది నిమిషాలు తక్కువ గ్రావిటీ వాతావరణంలో (గాల్లో తేలియాడేలా) ఉన్న అనుభూతిని పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే బ్లూ ఆరిజిన్ కంపెనీ సబ్ ఆర్బిటల్ రాకెట్ టూర్‌ను విజయవంతంగా నిర్వహించింది. 2021లో బ్లూ ఆరిజిన్ అధినేత (అమెజాన్ వ్యవస్థాపకుడు) జెఫ్ బెజోస్ మరో ముగ్గురితో కలిసి అంతరిక్షంలో పర్యటించి వచ్చారు. సబ్ ఆర్బిటల్ రాకెట్లు ఆర్థికంగా అందుబాటులో ఉండటంతోపాటు వాటిని రెండోసారి కూడా వినియోగించే అవకాశం ఉంటుంది.

**ప్రైవేట్ స్పేస్ ఏజెన్సీలతో కలిసి పని చేసేందుకు ఇస్రో ప్రయత్నాలు**

**2001లోనే స్పేస్ టూరిజం ప్రాజెక్టు ప్రారంభించిన రష్యా**

**2021లో స్పేస్ టూర్ చేసిన అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్**

### అంతరిక్ష పర్యాటకానికి ఎంతో క్రేజ్

అంతరిక పర్యాటకానికి ఎంతో క్రేజ్ ఉంది. అందుకే అంతర్జాతీయంగా వర్జిన్ గెలాక్టిక్, స్పేస్ ఎక్స్, బ్లూ ఆరిజిన్, ఆరిజిన్ స్పాన్, బోయింగ్, స్పేస్ అడ్వెంచర్స్, జీరో టు ఇన్ఫినిటీ వంటి ప్రైవేట్ స్పేస్ టూరిజం కంపెనీలు వాణిజ్యపరంగా స్పేస్ ఫ్లైట్స్‌ను నడిపించేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నాయి. రష్యన్ స్పేస్ ఏజెన్సీ నిలిపివేసిన స్పేస్ టూరిజం కాన్సెప్ట్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆ ప్రయత్నంలో జెఫ్ బెజోస్ విజయం సాధించారు కూడా. వర్జిన్ గెలాక్టిక్ తన స్పేస్ ఫ్లైట్ వీఎస్ఎస్ యూనిటీని 2018లో పరీక్షించడం మొదలుపెట్టింది. ఇప్పటికే ఈ కంపెనీ స్పేస్ టూరిస్టుల వెయిటింగ్ లిస్ట్ చాలా ఉంది. వాళ్లంతా డిపాజిట్లు కూడా కట్టి పర్యటన కోసం ఎదురుచూస్తున్నారు. రాబోయే కాలంలో ఈ కంపెనీలు అంతరిక్ష పర్యాటకులను ఒకరోజు అంతరిక్షంలోకి తీసుకెళ్లి తీసుకువచ్చే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. వాటి సరసన మన ఇస్రో స్పేస్ రాకెట్లు కూడా ఉండే అవకాశం ఉంది.

### పర్యాటక మాడ్యూల్ కోసం ప్రయత్నాలు

సబ్ ఆర్బిటల్ స్పేస్ టూరిజం మిషన్ సాధ్యాసాధ్యాలపై ఇస్రో అధ్యయనం చేస్తోందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆటామిక్ ఎనర్జీ అండ్ స్పేస్ మంత్రి జితేంద్రప్రసాద్ రాజ్యసభలో ఇటీవల వెల్లడించారు. అంతరిక్ష పర్యాటక మాడ్యూల్‌ను తయారు చేసేందుకు నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఐఎన్–స్పేస్) ద్వారా ఇస్రో ప్రైవేట్ సంస్థలతో కలిసి పనిచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

### తొలి అంతరిక్ష పర్యాటకుడు టిటో

అంతరిక్ష పర్యాటకం చాలాకాలం క్రితమే మొదలైంది. ఆర్బిటల్ స్పేస్ టూరిజాన్ని రష్యన్ స్పేస్ ఏజెన్సీ గతంలోనే ప్రారంభించింది. 2001లో అమెరికన్ మిలియనీర్ డెన్నిస్ టిటో రష్యన్ స్పేస్ ఏజెన్సీకి 20 మిలియన్ డాలర్లు చెల్లించి స్పేస్ టూరిస్ట్‌గా అంతరిక్షంలో 8 రోజులు గడిపి వచ్చారు. ప్రపంచంలో తొలి స్పేస్ టూరిస్ట్ ఆయనే. కానీ.. 2010లో రష్యన్ స్పేస్ ఏజెన్సీ స్పేస్ టూరిజం కార్యకలాపాలను నిలిపివేయడంతో అంతరిక్ష పర్యాటకం ఆగిపోయింది.



# ఏపీలోనే ఆశా వర్కర్లకు ఎక్కువ వేతనాలు

సాక్షి,అమరావతి: దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లోనే ఆశా వర్కర్లకు అత్యధిక ఆర్థిక ప్రోత్సాహకాలు అందుతున్నాయి. ఏపీ ఇస్తున్నట్లుగా ఇతర ఏ రాష్ట్రాల్లోనూ ఆశా వర్కర్లకు నెలకు రూ. పది వేల ఆర్థిక ప్రోత్సాహకం ఇవ్వడం లేదని ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వివిధ రాష్ట్రాల్లో ఆశా వర్కర్లకు అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహక మొత్తాలను ఆ మంత్రిత్వ శాఖ వివరించింది. ఆంధ్రప్రదేశ్ తరువాత తెలంగాణలో నెలకు రూ. 7,500లు ప్రోత్సాహకం అందుతోందని, ఆ తరువాత కేరళ, సిక్కిం రాష్ట్రాల్లో రూ.6 వేలు చొప్పున ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తున్నారని కేంద్రం పేర్కొంది. కమ్యూనిటీ హెల్త్ వలంటీర్లుగా భావించే ఆశా వర్కర్లకు నెలకు రూ. 2 వేలు చొప్పున కేంద్రం ప్రోత్సాహకంగా ఇస్తోందని,



అలాగే జాతీయ స్థాయి ఆరోగ్య కార్యకలాపాలు పనితీరు ఆధారంగా కూడా కేంద్రం ప్రోత్సాహకాలు అందిస్తుందని ఆ మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆయా రాష్ట్రాల ప్రణాళికలు అమలు ఆధారంగా ద్రవ్య ప్రోత్సాహకాలు అందించే సౌలభ్యం కల్పించినట్లు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. గతంలో ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం కేంద్రం ఇచ్చే రూ. 2 వేలకు అదనంగా మరో రూ. 2 వేలు కలిపి నెలకు రూ. 4 వేలు ఇచ్చేది. అది కూడా ఆరు నెలలైనా ఇవ్వని పరిస్థితులు ఉండేవి. వైఎస్ జగన్ పాదయాత్ర చేసిన సందర్భంలో ఆశా వర్కర్ల వినతులను పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత 2019, ఆగస్టు 17న ఆశా వర్కర్ల వేతనాలను నెలకు రూ. 10,000లకు పెంచుతూ జీవో ఎంఎస్ నం.87 జారీ చేయించారు. దీంతో రాష్ట్రంలోని 43,767 మంది ఆశా వర్కర్లు లబ్ధి పొందుతున్నారు.

**వివిధ రాష్ట్రాల్లో ఆశా వర్కర్లకు నెలకు అందిస్తున్న ద్రవ్య ప్రోత్సాహకాలు ఇలా..**

| రాష్ట్రం పేరు | నెలకు ద్రవ్య ప్రోత్సాహకం (రూపాయల్లో) |
|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 10,000 |
| తెలంగాణ | 7,500 |
| కేరళ | 6,000 |
| సిక్కిం | 6,000 |
| కర్ణాటక | 5,000 |
| పశ్చిమబెంగాల్ | 4,500 |
| హరియాణ | 4,000 |
| రాజస్థాన్ | 3,564 |
| మహారాష్ట్ర | 3,500 |
| ఢిల్లీ | 3,000 |
| హిమాచల్‌ప్రదేశ్ | 2,750 |
| పంజాబ్ | 2,500 |
| మేఘాలయ | 2,000 |

# కళాశాలల్లో ఇక 'కళా గురువులు'

**ఉన్నత విద్యాసంస్థల్లో త్వరలో స్థానిక కళాకారులకు చోటు**

సాక్షి, అమరావతి: దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో ప్రస్తుతం ఉన్న యాంత్రిక పద్ధతిని నివారించడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నడుం బిగించింది. ప్రస్తుత విద్య ఒత్తిడితో కూడుకుని యాంత్రికంగా మారుతుండటంతో విద్యార్థులకు విద్యపై ఆసక్తి సన్నగిల్లుతోంది. దీన్ని మార్చి విద్యార్థులు ఇష్టంతో విద్య నేర్చుకునేలా యూజీసీ చర్యలు చేపట్టింది. చదువులను ఆహ్లాదకరంగా మార్చడానికి వివిధ కళారూపాలను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వివిధ కళల్లో లబ్ధప్రతిష్టులైన వారిని కళాశాలల్లో కళా గురువులుగా నియమించనుంది. వీరి ద్వారా హస్తకళలు, సంగీతం, నృత్యం, జానపదాలు, థియేటర్, తోలుబొమ్మ ప్రదర్శనలు, ఫొటోగ్రఫీ, కాలిగ్రఫీ, యోగా, పెయింటింగ్, ఇంద్రజాలం (మ్యాజిక్) వంటి వాటిని సహ పాఠ్య కార్యక్రమాలుగా ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు యూజీసీ తాజాగా ముసాయిదా ప్రతిపాదనలు విడుదల చేసింది. సృజనాత్మకతను పెంపొందించే ఈ సంప్రదాయ కళారూపాలు ఆరోగ్యకరమైన సమాజాన్ని రూపొందించేందుకు దోహదపడతాయని యూజీసీ భావిస్తోంది. దీనివల్ల విద్యార్థుల్లో కళాత్మక ఆలోచనలకు, సృజనాత్మకతకు అవకాశం ఉంటుందని, చదువుల్లోనూ వారు మరింత ఉత్సాహంగా ఉంటారని అభిప్రాయపడుతోంది. అదే సమయంలో మరుగునపడిపోతున్న కళారూపాలకు మళ్లీ కొత్త జీవం పోసినట్లు అవుతుందని తలపోస్తోంది.

**ఏకకాలంలో రెండు ప్రయోజనాలు..**

మన దేశం గొప్ప కళా, సాంస్కృతిక వారసత్వాన్ని కలిగి ఉంది. ప్రాచీన కాలం నుంచి అనేక అద్భుతమైన కళారూపాలు ఉన్నాయి. వీటిని కళాకారులు సంరక్షించుకుంటూ వస్తున్నారు. అయితే వీటికి విద్యా వ్యవస్థతో సంబంధం లేకుండా పోవడంతో కొత్త తరానికి ఈ కళల గురించి అవగాహన లేదు. ముఖ్యంగా ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు, కళలకు మధ్య చాలా అంతరం ఏర్పడింది. దీన్ని తగ్గించడానికి ఈ కళాగురువుల విధానానికి యూజీసీ శ్రీకారం చుట్టింది. దీనివల్ల ఈ కళా రూపాలను సంరక్షించుకునే వీలు కలుగుతుంది. అదే సమయంలో ఒత్తిడితో యాంత్రికంగా మారిపోయిన విద్యా విధానం నుంచి విద్యార్థులు బయటపడటానికి.. ఆహ్లాదకరంగా విద్య నేర్చుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో కళాశాలల్లో విద్య, బోధన, పరిశోధన ఇతర విద్యా కార్యకలాపాల్లో నైపుణ్యం కలిగిన కళా గురువులను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించనున్నారు. ఉన్నత విద్యా విధానంతో హస్త కళలు, నృత్య రూపకాలు, సంగీతం, లలిత కళలు మొదలైనవాటిని అనుసంధానం చేస్తారు. తద్వారా విద్యార్థుల అభ్యసన ప్రక్రియను మెరుగుపరచనున్నారు.

**మూడు విభాగాల్లో కళా గురువులు..**

ఆయా కళల్లో స్థానిక కళాకారులను గుర్తించి ఎంప్యానెల్ చేయడానికి ఆయా విద్యాసంస్థలు కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కమిటీ.. కాంపిటెంట్ అథారిటీకి సిఫార్సులను అందించాలి. కళా గురువులను మూడు విభాగాల్లో ఎంపిక చేయనున్నారు. పరమేష్టి గురువు, పరమ గురువు, గురువు అనే విభాగాల్లో వీరిని నియమించనున్నారు. పరమేష్టి గురువుగా నియమితులు కావాలంటే పద్మ అవార్డు లేదా జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక అవార్డు పొంది ఉండాలి. కనీసం 20 ఏళ్ల అనుభవం ఉండాలి. పరమ గురువుకు కనీసం ఒక జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రభుత్వ గుర్తింపు పొందిన అవార్డు, లేదా తత్సమాన అవార్డు తప్పనిసరి. అనుభవం 10 ఏళ్ల కంటే తక్కువ ఉండకూడదు. ఇక గురువుకు.. పరమేష్టి, పరమ గురువుల కేటగిరీల్లో లేని మాస్టర్లుగా పేరు తెచ్చుకున్న కళాకారులను ఎంపిక చేయొచ్చు. అనుభవం 5 ఏళ్లకన్నా తక్కువ ఉండరాదు. అయితే అంతర్జాతీయ, జాతీయ, ప్రభుత్వ గుర్తింపు పొందిన కచేరీల్లో పాల్గొని ఉండాలి. ఎంప్యానెల్ అయిన కళా గురువులకు కార్యకలాపాలను నిర్వహించడానికి తగిన వేదికను ఏర్పాటు చేస్తారు. అవసరమైన ఇతర సహాయంతో పాటు సౌకర్యాలు అందిస్తారు. ప్రయాణ ఖర్చులు, వసతి, నిబంధనల ప్రకారం గౌరవ వేతనం ఇస్తారు.



### కళారూపాల జాబితా ఇలా..

**హస్త కళలు:** కుండలు, వెదురు ఆకృతులు, చెక్క పని, టెర్రాకోట, మధుబని, పిచ్వాహి, చరఖా నేయడం, మొఘల్ ఉడ్ ఆర్ట్, స్టోన్, కాంస్యం పని, మీనాకారి పని, నేత, అద్దకం, బ్లాక్ ప్రింటింగ్, మినియేచర్ పెయింటింగ్, ఉడ్ కార్వింగ్, ప్రింటెడ్ టెక్స్‌టైల్స్, నేచురల్–ఆర్గానిక్ డైస్ ప్రిపరేషన్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, కార్పెట్ నేత, కాలిగ్రఫీ, దద్దాన్ గోయ్ తదితరాలు.

**శాస్త్రీయ సంగీతం:** హిందుస్థానీ గాత్రం, హిందుస్థానీ వాద్యం, కర్ణాటక గాత్రం, కర్నాటిక్ ఇన్‌స్ట్రుమెంటల్, గుర్బానీ, సుఫియానా సెమీ క్లాసికల్, లైట్, మోడ్రన్ మ్యూజిక్, తుమరి/ దాద్రా/కజ్రీ, గజల్, గీత్, భజన్, సూఫీ తదితరాలు.

**సోపాన సంగీతం:** ఖవాలీ, భక్తి– భజన, రామాయణం, శ్రీమద్భాగవత్ పఠనం తదితరాలు, రవీంద్ర సంగీతం, ఫ్యూజన్/జుగల్‌బందీ/తల్వాద్య, ఆర్కెస్ట్రా/కోరల్, రాక్, బ్యాండ్/జాజ్, కోయిర్ గానం తదితరాలు.

**డ్యాన్స్:** సంప్రదాయ నృత్య రూపకాలైన కథక్, ఒడిస్సీ, భరతనాట్యం, కూచిపూడి, కథాకళి, మణిపూరి, మోహినీయాట్టం, ఛౌ, సత్త్రియ, యక్షగానం, పాండ్వానీ తదితరాలు.

**జానపద నృత్యం:** భాంగ్రా/గిద్దా, గర్బా, రౌఫ్, ఘూమర్, బిహు, లావణి, విలాసిని నాట్యం, ధిమ్సా, బగురుంబా, అలీ ఐ లిగాంగ్, కోలాటం, నాట్యం, అజి లాము, రొప్పి, ఫోనింగ్, కజారి, ఝుమారి, దండారి, గెండి, పంతి, కర్మ, దమ్‌కాచ్, మాండో, తల్గారి, సువారి, దసరవదన్, కుంబీ, ఫుగాడి, రాస్, భావాయి, తిప్పానీ, గుగ్గ, ఖోరియా, కులు నాటి, నామ్‌గెన్, హికత్, ఛమ్, దుమ్హాల్, కుడ్, భండ్ జషన్, ఫాగువా, కృష్ణ పారిజాత, నాగమండల, భూత ఆరాధన, కైకొట్టికలి, తుంబి తుల్లాల్, కర్మ, గౌర్ మారియా, కక్సర్, అహిరి, పాఫ్రీ, ధంగారి గజ, ఖంబ థోయిబి, పుంగ్ చోలోమ్, నోంగ్‌క్రెమ్, చెరావ్, ఖుల్లం, చంగ్లో–సువాలువా, ఘుమురా, రుక్ మార్, గోటిపువా, ఝుమర్, కుచ్చిఘోడి, కల్బేలియా, భావాయి, సపేరా నృత్యం, సింఘీ చామ్, ఖుకూరి, తలచి, కరగాట్టం, మయిల్‌అట్టం, కుమ్మి, కావడి, గరియా, హోజాగిరి, రాస్లీల, చర్కుల, బరదానాటి, చాపెలి, లాంగ్వీర్, గంభీర, కలికాపటడి, డోమ్ని, కలరిపట్టు, ఒట్టం తుల్లాలెట్ తదితరాలు.

**వృత్తిపరమైన కళారూపాలు:** పెయింటింగ్, ప్రింట్ మేకింగ్, టెక్స్‌టైల్, డ్రాయింగ్, స్కల్ప్చర్, సిరామిక్, కాలిగ్రఫీ, ఫొటోగ్రఫీ, జానపద థియేటర్, నౌతంకి, యోగా, ఇసుక కళ, మెహందీ, ఫ్లోర్ ఆర్ట్ (రంగోలి/మందన/కోలమెట్టీ), కథకులు, మ్యాజిక్ షో, పప్పెట్ షో, కామిక్ ఆర్ట్ తదితరాలు.

### ఘనంగా పద్మ అవార్డుల ప్రదానోత్సవం

- పద్మశ్రీ అందుకున్న పలువురు తెలుగు ప్రముఖులు
- పురస్కారాలు అందజేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి పద్మశ్రీ అవార్డులు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ ప్రకాశ్‌చంద్రసూద్, కోట సచ్చిదానందశాస్త్రి, డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్, చింతలపాటి వెంకటపతిరాజు

సాక్షి, న్యూఢిల్లీ, నందిగామ: పద్మ అవార్డుల ప్రదానోత్సవం రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా జరిగింది. వివిధ రంగాల్లో విశిష్టసేవలందించిన 106 మందికి జనవరి 25న కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులు ప్రకటించిన విషయం విదితమే. బుధవారం తొలివిడత ప్రదానోత్సవ కార్యక్రమంలో భాగంగా పలువురికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డులు అందజేశారు. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్.ఎం. కృష్ణకు పద్మవిభూషణ్ అందజేశారు. కుమార మంగళం బిర్లా (ట్రేడ్ ఇండస్ట్రీ), సుమన్ కల్యాణ్‌పూర్ (ఆర్ట్), కపిల్ కపూర్ (లిటరేచర్, ఎడ్యుకేషన్), ధ్యాన గురువు కమలేష్ డి పటేల్ (ఆధ్యాత్మికం) పద్మభూషణ్ అందుకున్నారు. పద్మశ్రీ విభాగంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన డాక్టర్ మోదడుగు విజయగుప్త(సైన్స్, ఇంజనీరింగ్, తెలంగాణ) పుసుపులేటి హనుమంతరావు(చికిత్స పీడియాట్రిక్స్, తెలంగాణ), బండి రామకృష్ణారెడ్డి (లిటరేచర్, ఎడ్యుకేషన్–తెలంగాణ), సంకురాత్రి చంద్రశేఖర్ (సమాజసేవ, ఆంధ్రప్రదేశ్), చింతలపాటి వెంకటపతిరాజు (కళ, ఆంధ్రప్రదేశ్), కోట సచ్చిదానంద శాస్త్రి (కళ, హరికథ– ఆంధ్రప్రదేశ్), ప్రొఫెసర్ ప్రకాశ్‌చంద్ర సూద్ (సాహిత్యం– ఆంధ్రప్రదేశ్) పద్మశ్రీ అందుకున్నారు.

### వక్ఫ్ బోర్డులో ముస్లిం సంస్థల నమోదు తప్పనిసరి

వక్ఫ్ బోర్డు ప్రత్యేక అధికారి షేక్ షిరీన్‌బేగం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డు పరిధిలోకి వచ్చే అన్ని ముస్లిం సంస్థలను తప్పనిసరిగా నోటిఫై/రిజిస్టర్ చేసుకోవాలని వక్ఫ్ బోర్డు ప్రత్యేక అధికారి షేక్ షిరీన్‌బేగం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మసీదు, దర్గా, ఈద్గా, పీర్లచావిడి, పీర్ల పంజాలు, అషూర్ ఖానాలు, ముసాఫిర్ ఖానాలు, తకియా, ముస్లిం శ్మశాన వాటికలు, ఛిల్లాలు, జెండా చెట్టు వంటి సంస్థలు వక్ఫ్ బోర్డు పరిధిలోకి వస్తాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టం–1995ను దేశ వ్యాప్తంగా అమలు చేస్తోందని తెలిపారు. ఇందులో నమోదు కాని సంస్థలను రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. ఒక సంస్థ ఒకసారి వక్ఫ్ అని నిర్ణయించిన తర్వాత చట్ట ప్రకారం శాశ్వతంగా వక్ఫ్‌గానే ఉంటుందని తెలిపారు. ముస్లిం సంస్థలు, ముసల్లీలు, ముతవల్లీలు, కమిటీ ప్రెసిడెంట్లు తమ ప్రాంతాల్లోని వక్ఫ్ సంస్థలను, వాటి అనుబంధ భూములు, ఆస్తులు వక్ఫ్‌బోర్డులో నమోదైనవా.. లేదా... అని గమనించాలని విజ్ఞప్తి చేశారు. నమోదు కాకుంటే ఏప్రిల్ 30లోపు దరఖాస్తు సమర్పించాలని, వివరాలకు జిల్లాల్లోని వక్ఫ్ ఇన్‌స్పెక్టర్లను సంప్రదించాలని కోరారు.

### వెండి రథంపై ఆది దంపతుల విహారం



వెండి రథంపై విహరిస్తున్న ఆదిదంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆది దంపతులు వెండి రథంపై బుధవారం నగర విహారం చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీగంగా పార్వతి(దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులను వెండి రథంపై ప్రతిష్టించిన ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ కనుల పండువగా నగరోత్సవం సాగింది. పండుగ రోజున స్వామివారు తమ ఇంటి ముంగిటకు రావడంతో భక్తులు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఉదయం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శోభకృత్ నామ సంవత్సర పంచాంగ శ్రవణం నిర్వహించారు.



ఈ మూడు అత్యుత్తమ విషయాలకు దూరంగా ఉండవద్దు:
మంచి ఆలోచన, మంచి మాట, మంచి పని.
– జరాతుష్ట్ర



సాక్షి
గురువారం, మార్చి, 23

# ఇకనైనా కళ్ళు తెరుస్తారా?

ప్రపంచానికి మరోసారి ప్రమాద హెచ్చరిక. పారిశ్రామికీకరణ మునుపటి స్థాయితో పోలిస్తే పుడమి తాపం ఇప్పటికే 1.1 డిగ్రీల సెంటీగ్రేడ్ పెరిగింది. ఈ లెక్కన గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను గణనీయంగా తగ్గించాలనీ, ఈ శతాబ్ది చివరకు భూతాపోన్నతి 1.5 డిగ్రీల లోపలే ఉండేలా చూసుకోవాలనీ చెప్పుకున్న ఊసులు, చేసుకున్న బాసలు తీరా రానున్న పదేళ్ళలోనే పూర్తిగా భగ్నం కానున్నాయి. 'ఆఖరి అవకాశంగా తెరిచి ఉన్న తలుపు సైతం మూసుకుపోతోంద'ని ప్రపంచ అగ్రశ్రేణి శాస్త్రవేత్తల బృందం 'ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్'(ఐపీసీసీ) చేసిన హెచ్చరిక మానవాళికి మేలుకొలుపు. ఇప్పటికైనా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను నియంత్రించడానికి ప్రభుత్వాలు తక్షణం బరిలోకి దిగితే, ఎంతో కొంత ప్రయోజనమని సోమవారం నాటి తాజా నివేదిక కర్తవ్యాన్ని బోధిస్తోంది. వాతావరణ కాలుష్యానికి ప్రధాన కారణమైన సంపన్న దేశాలు దీన్ని చెవికెక్కించుకోకుండా, వర్ధమాన, నిరుపేద దేశాలదే బాధ్యత అన్నట్టు ప్రవర్తిస్తుండడమే ఇప్పుడున్న చిక్కు. విషాదం ఏమిటంటే– పాపం ఎవరిదైనా, ఫలితం ప్రపంచమంతా అనుభవించాల్సిందే!

ఐపీసీసీ 1988లో ఏర్పాటైన నాటి నుంచి ఇది ఆరో నివేదిక. ఈ ఆరో అంచనా నివేదిక (ఏఆర్6)కు సంబంధించిన నాలుగో విడత వివరాలివి. ఇదే ఆఖరి విడత కూడా! మునుపటి మూడు ప్రధాన విభాగాల నివేదికలోని కీలక సమాచారాన్ని ఒకచోట గుదిగుచ్చి అందిస్తున్నారు గనకనే ఈ చివరి దాన్ని ఐపీసీసీ ఏఆర్6 'సంకలన నివేదిక' అన్నారు. 2021 ఆగస్ట్, 2022 ఫిబ్రవరి, ఏప్రిల్‌లలో వచ్చిన మొదటి మూడూ వాతావరణ సంక్షోభం, దాని పర్యవసానాలు, గ్రీన్‌హౌస్ వాయువులను తగ్గించే మార్గాల గురించి చెప్పాయి. తాజా 'సంకలన నివేదిక' ప్రధానంగా మునుపటి ప్రచురణల్లోని కీలక ఫలితాల పునశ్చరణ. భూతాపం 'మళ్ళీ తగ్గించలేని స్థాయికి' చేరుతోందనీ, మానవాళికి దుష్పరిణామాలు తప్పవనీ, కఠిన చర్యలతోనే ప్రమాదాన్ని నివారించగలమనీ ఇది హెచ్చరిస్తోంది.

అపార ధనబలం, సాంకేతిక సామర్థ్యం తమ సొంతమైన ధనిక దేశాలు కేవలం అప్పులు, ప్రైవేట్ రంగ పెట్టుబడులిచ్చి వాతావరణ పరిరక్షణ చర్యకు సహకరించామని చేతులు దులుపుకొంటే సరిపోదు. ఈ 2020 –30 మధ్య ఇప్పుడు చేస్తున్న దానికి కనీసం 6 రెట్లయినా వాతావరణంపై పెట్టుబడి పెడితే తప్ప, తాపోన్నతిని 1.5 డిగ్రీల లోపు నియంత్రించే లక్ష్యం సాధ్యం కాదట. అలాగే, 2020 నాటి స్థాయిలోనే మన వాతావరణ విధానాలు బలహీనంగా ఉంటే, ఈ శతాబ్ది చివరకు భూతాపం 3.2 డిగ్రీలు పెరుగుతుంది. ఒకసారి 1.5 డిగ్రీలు దాటి ఎంత పెరిగినా, ఆ వాతావరణ నష్టం పూడ్చలేనిది. మానవాళికి మహా విపత్తు తప్పదు. పెను ప్రభావం పడే దేశాల్లో భారత్ ఒకటని నివేదిక తేల్చింది. వడగాడ్పులు, కార్చిచ్చులు, ఆకస్మిక వరదలు, సముద్రమట్టాల పెరుగుదల, పంటల ఉత్పత్తి తగ్గుదల, 2050 నాటికి 40 శాతం జనాభాకు నీటి కొరత – ఇలా పలు ప్రమాదాలు భారత్‌కు పొంచివున్నాయి. అయితే, వాతావరణ మార్పుల నివారణ భారాన్ని అందరూ పంచుకోవాలనే 'వాతావరణ న్యాయ' సూత్రానికి ఈ నివేదిక జై కొట్టడం మన లాంటి దేశాలకు ఊరట.

మునుపు మూడు విడతల్లో ప్రచురించిన వేలకొద్దీ శాస్త్రీయ సమాచారాన్ని సంక్షిప్తంగా, ప్రపంచవ్యాప్తంగా విధాన నిర్ణేతలకు వారు చేపట్టాల్సిన చర్యలను సారాంశరూపంలో అందించడం తాజా సంకలన నివేదిక ప్రత్యేకత. నవంబర్ 20న దుబాయ్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆతిథ్యమివ్వనున్న ఐరాస తదుపరి వాతావరణ సదస్సు 'కాప్ 28'కు ఈ నివేదిక ఒక దిక్సూచి. 2015లో ప్యారిస్ వాతావరణ ఒప్పందం నాటి నుంచి నేటి వరకు గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడంలో వివిధ దేశాల పురోగతిని ఆ 'కాప్ 28'లో మదింపు చేస్తారు. ఇప్పటి దాకా చేస్తున్నవేవీ చాలట్లేదని తాజా నివేదిక సాక్షిగా తెలుస్తూనే ఉంది. వెరసి, వాయు ఉద్గారాలను తగ్గించే లక్ష్యంలో ప్రభుత్వా లన్నీ విఫలమయ్యాయి. నిజానికి, ఐపీసీసీ ఓ సమగ్ర నివేదిక ఇచ్చేందుకు 6 నుంచి 8 ఏళ్ళు పడుతోంది. అయినా గ్రీన్‌హౌస్ గ్యాస్‌లు పెరుగుతూనే ఉన్నాయి. నివేదికల పరిమాణం, సంక్షోభంపై చర్యల అత్యవసరం కూడా పెరుగుతూనే వచ్చాయి. ఇప్పటికైనా ప్రపంచ దేశాలు కఠిన చర్యలు చేపట్టకుంటే, ఆ తర్వాత ఏం చేసినా చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టే!

ఉద్గారాలను గణనీయంగా తగ్గించడం, పునరుత్పాదక ఇంధనంపైనా – ఇతర తక్కువ కర్బన సాంకేతికతల పైనా దృష్టి సారించి శిలాజ ఇంధనాల వినియోగం మానేయడం, అటవీ పెంపకం లాంటివి ప్రభుత్వాలు చేయాల్సిన పని. అలాగే, 'వాతావరణాన్ని బాగు చేసే' మార్గాల్ని అన్వేషించాలి. గాలిలో నుంచి కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చేసే 'డైరెక్ట్ ఎయిర్ క్యాప్చర్' టెక్నాలజీలను అభివృద్ధి చేయాలి. ఐరాస ప్రధాన కార్యదర్శి మాట విని, ధనిక దేశాలు 2040 నాటికి 'నెట్ జీరో'ను అందుకొనేలా తమ లక్ష్యాన్ని ముందుకు జరుపుకొంటే మంచిది.

ఈ దేశాలు తమ వాతావణ బాధ్యతను నిర్వర్తించేలా చూడడం ఇప్పుడు సవాలు. ధనిక ప్రపంచపు బాధ్యతారహిత, మొండి వైఖరికి మిగతా అందరూ మూల్యం చెల్లించాల్సి రావడం మహా దారుణం. ఐపీసీసీ తదుపరి నివేదిక 2030లో కానీ రాదు. కాబట్టి భూతాపోన్నతిని 1.5 డిగ్రీల లోపలే నియంత్రించేలా చర్యలు చేపట్టడా నికి ఈ ఏఆర్6 తుది ప్రమాద హెచ్చరిక. మేల్కొందామా? లేక కళ్ళు తెరిచి నిద్ర నటిద్దామా? ప్రస్తుతం ఛాయిస్ ప్రపంచ దేశాలదే! ఒకసారి పరిస్థితి చేయి దాటేశాక మాత్రం ఏం చేసినా ఫలితం శూన్యం.

# ఔషధ నియంత్రణపై రెండు నాలుకలు

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

**దేశీ మార్కెట్‌లో చాలా నకిలీ మందులు చలామణిలో ఉన్నాయన్న కేంద్ర ఆరోగ్య మంత్రి వ్యాఖ్యలు బయటికి పొక్కడం కలకలం రేపింది. మళ్లీ ఆయనే అధికారిక సమావేశాల్లో నాణ్యమైన ఔషధాలు తయారవుతున్నాయని నొక్కిచెప్పారు. ప్రజలందరికీ చౌకగా, చక్కగా పనిచేసే మందులు అందివ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమైతే అందుకు ఒక సమగ్రమైన పద్ధతిని అనుసరించాలి. ప్రస్తుతం మార్కెట్‌లో ఒకే రసాయనానికి సంబంధించి వందలాది బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో దాని ధర, సామర్థ్యాల్లో అంతరమూ కనిపిస్తోంది. అహేతుకమైన మిశ్రమాలున్న మందులూ దొరుకుతున్నాయి. జన ఔషధి కేంద్రాలు కొన్ని వేలు తెరచినంత మాత్రాన సమస్యకు పరిష్కారం లభించదు. వీటికి దన్నుగా నిలిచే సరఫరా వ్యవస్థ కూడా అత్యవసరం.**

ఉజ్బెకిస్తాన్ , గాంబియా... రెండు వేర్వేరు దేశాల్లో సుమారు 70 మంది పిల్లలు కల్తీ దగ్గుమందు కారణంగా మరణించారు. ఇటీవలి కాలంలో సంభవించిన ఈ దుర్ఘటనకు కారణమైన దగ్గు మందు సరఫరా అయ్యింది మన దేశం నుంచే. కొన్ని వారాల క్రితం నోయిడా పోలీసులు ఉజ్బెకిస్తాన్ మరణాలకు సంబంధించి ముగ్గురు ఫార్మా కంపెనీ ఉద్యోగులను అరెస్ట్ చేయగా... కొన్ని నెలల క్రితం గాంబియా ఘటనకు సంబంధించి దేశంలో పెద్ద దుమారమే చెలరేగింది. ఈ రెండు కేసుల్లోనూ దగ్గుమందులో విషపూరిత రసాయనాలు కలిసి ఉండటం గమనార్హం. గాంబియా ఘటనలను ముందుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచం దృష్టికి తెచ్చింది. భారత్ నుంచి ఎగుమతి అయిన దగ్గు ముందులో గుర్తించిన డైఎథిలీన్ గ్లైకోల్ (డీఈజీ) కారణంగా మూత్ర పిండాలు పనిచేయకుండా పోయి పిల్లలు మరణించినట్లు అమెరికాకు చెందిన 'సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్' కూడా ఈ వారమే ధ్రువీకరించింది.

ఈ ఘటనలకు కేంద్ర ఆరోగ్య శాఖ, సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ), రాష్ట్రాల డ్రగ్ కంట్రోలర్లు, ఫార్మాస్యూటికల్ డిపార్ట్‌మెంట్ల స్పందన అంతంత మాత్రమే. ప్రపంచ ఆరోగ్య సంస్థ, గాంబియా ప్రభుత్వం చేసిన ప్రకటనల్లో లోపాలపై దృష్టి పెట్టాయి కానీ... ఆయా సంస్థలు గుర్తించిన అంశాల జోలికి ఇవి పోలేదు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఒక కమిటీని ఏర్పాటు చేసి ప్రపంచ ఆరోగ్య సంస్థ సమాచారం ఇవ్వకపోవడాన్ని విమర్శించి ఊరకున్నాయి.

ఆరోగ్య శాఖ నెపం మొత్తాన్ని గాంబియాపై నెట్టేసింది. దిగుమతి చేసుకునేటప్పుడు పరీక్షించుకోవాల్సిన బాధ్యత ఆ దేశానిదేనని తేల్చేసింది. అంతటితో ఆగకుండా... ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక్కో కేసులో మరణానికీ, ఔషధానికీ ఉన్న సంబంధాన్ని వివరించలేదని వ్యాఖ్యానించింది. ఆ తరువాత తెలిసిందేమిటంటే... గాంబియా కొన్ని కేసుల్లో శవపరీక్షలు కూడా నిర్వహించి డీఈజీ అవశేషాలను గుర్తించిందని! అన్నింటి కంటే ముఖ్యంగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్ సుఖ్ మాండవియా ఈ ఘటనలన్నింటినీ భారత ఔషధ పరిశ్రమను దెబ్బతీసేందుకు జరుగుతున్న కుట్రగానే పరిగణించడం! గత నెల 24న వంద భాగస్వామ్య దేశాల భారత దౌత్యవేత్తలు పాల్గొన్న సమావేశంలోనూ మాండవియా దేశంలో నాణ్యమైన మందులు తయారవుతున్నాయని నొక్కి చెప్పడం ఇక్కడ ప్రస్తావించదగ్గ అంశం.

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రకటనల్లో ద్వంద్వ ప్రమాణాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 26న హైదరాబాద్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులతో జరిగిన ఓ రహస్య సమావేశంలో దేశంలో మందుల నియంత్రణ దుఃస్థితిని ఆయన నేరుగా అంగీకరించారు. ''దేశీ మార్కెట్‌లో చాలా నకిలీ మందులు చలామణిలో



ఉన్నాయి. కల్తీ మందులు ఎగుమతి అవుతున్నాయి కూడా. దీనివల్ల ఫార్మా రంగం విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి'' అని ఒప్పుకొన్నారు. ఈ దుఃస్థితికి అధికారులే కారణమని కూడా ఆయన కుండబద్దలు కొట్టారు. ''ఫార్మా రంగానిదే బాధ్యత. కానీ అంతకంటే ముందు ఇది మన బాధ్యత'' అని ఆయన అధికారులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

నియంత్రణ వ్యవస్థల గురించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ, ''ఇది చురుకుగా లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయమూ కొరవడుతోంది'' అని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి అంచనా ప్రకారం, ప్రస్తుత నియంత్రణ వ్యవస్థ కేంద్ర, రాష్ట్రాల సంస్థలు, ఫార్మాస్యూటికల్ విభాగాల పేరుతో ముక్కలు ముక్కలుగా ఉంది. మాండవియా ప్రసంగం యూట్యూబ్ ఛానల్‌లో ఎనిమిది నిమిషాల పాటు ప్రత్యక్ష ప్రసారమైంది. ఆ తరువాత ఆగిపోవడమే కాకుండా... అప్పటివరకూ రికార్డయిన వీడియోను కూడా ఛానల్ నుంచి తొలగించారు. అయితే వీడియో తొలగించినంత మాత్రాన విషయం బయటకు పొక్కకుండా ఉంటుందా? నిపుణులు ఎంతో కాలంగా చెబుతున్న విధంగానే నియంత్రణ సంస్థల నిర్లక్ష్యం కారణంగా నాణ్యత లేని, కల్తీ, నకిలీ మందులు భారతీయ మార్కెట్‌లో చలామణీ అవు తున్నట్లు అందరికీ అధికారికంగా తెలిసిపోయింది. ఇలాంటి మందులు విదేశాలకూ ఎగుమతి అవుతున్నట్లు... దుష్ఫలితాలూ వాటివల్లనే అన్న విషయమూ స్పష్టమైంది.

మంత్రి ప్రకటనను బట్టి చూస్తే దేశ ఫార్మా రంగం దుఃస్థితికి కారణాలు ఆయనకూ తెలుసన్నమాట. మరి ఇదే నిజమైతే ఆయన, కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ ఏం చేస్తున్నట్లు? గాంబియా, ఉజ్బెకిస్తాన్ ఘటనలపై వ్యతిరేక నివేదికలు వచ్చినప్పుడు బహిరంగంగా ఫార్మా రంగాన్ని, నియంత్రణ వ్యవస్థలకు మద్దతుగా మాట్లాడటం ఎందుకు? ఈ రెండు నాల్కల ధోరణిని వదిలిపెట్టాల్సిన తరుణం ఆసన్నమైంది. ఎందుకంటే ఇది ప్రజల జీవితాలతో కూడిన వ్యవహారం.

దేశ ఫార్మా రంగ నియంత్రణ సంస్థల్లోని అకృత్యాలు ఇప్పుడు కొత్తగా తెలిసినవి ఏమీ కాదు. 2012లోనే ఒక పార్లమెంటరీ కమిటీ సీడీఎస్‌సీఓ పనితీరుపై విచారణ జరిపి, కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ఉన్న అక్రమాలను బయటపెట్టింది. దురదృష్టవశాత్తూ అప్పటినుంచి ఇప్పటివరకూ జరిగిన మార్పు స్వల్పమే. పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫారసులు కాగితానికే పరిమితమైపోయాయి. ప్రభుత్వాలు కూడా ఈ రంగాన్ని సంస్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేయలేకపోయాయి. ఇంకోవైపు ఫార్మా పరిశ్రమ ఎదుగుదలకు నియంత్రణ వ్యవస్థలు ప్రతిబంధకంగా మారుతున్నాయన్న ఆరోపణలు పెరిగిపోతున్నాయి.

దేశ ఫార్మా మార్కెట్ సుమారు నాలుగు లక్షల కోట్ల రూపాయల విలువైందని ఇటీవలే ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ప్రకటించారు. ఈ మొత్తం పది లక్షల కోట్ల రూపాయలకు చేరవచ్చునని కూడా ఆయన అంచనా కట్టారు. ఇది కచ్చితంగా మంచి లక్ష్యం. కానీ భద్రత, సామర్థ్యం, మందుల ప్రమాణాలతో రాజీపడి సాధించడం ఎంతమాత్రమూ సరికాదు. స్థానిక మార్కెట్ అయినా, విదేశీ మార్కెట్ అయినా వీటిని పాటించడం అవసరం.

ప్రజలందరికీ చౌకగా, చక్కగా పనిచేసే మందులు అందివ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమైతే అందుకు ఒక సమగ్రమైన పద్ధతిని అనుసరించాలి. ప్రస్తుతం మార్కెట్‌లో ఒకే రసాయనానికి సంబంధించి వందలాది బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో దాని ధర, సామర్థ్యాల్లో అంతరమూ కనిపిస్తోంది. అహేతుకమైన మిశ్రమాలున్న మందులూ దొరుకుతున్నాయి. వేర్వేరు బ్రాండ్లు ఉండటంతో వైద్యులను ఆకర్షించేందుకు కంపెనీలు అనైతిక మార్కెటింగ్ కార్యకలాపాలకూ దిగుతున్నాయి. జన ఔషధి కేంద్రాలు కొన్ని వేలు తెరచినంతమాత్రాన సమస్యకు పరిష్కారం లభించదు. వీటికి దన్నుగా నిలిచే సరఫరా వ్యవస్థ కూడా అత్యవసరం. నిజానికి జన ఔషధి కేంద్రాల స్థాపన ఆలోచన మాజీ మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్‌ది. 2005లోనే ఆయన యూపీఏ కామన్ మినిమం ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ కేంద్రాల ఏర్పాటును ప్రస్తావించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఔషధ కంపెనీల నుంచి జెనెరిక్ మందులను ఈ కేంద్రాల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆయన సంకల్పించారు. ఈ ప్రభుత్వ రంగ ఫార్మా కంపెనీల్లో అత్యధికం ఇప్పుడు పనిచేయడం లేదు. లేదా అస్తవ్యస్త పరిస్థితుల్లో ఉన్నాయి. కాబట్టి, సమస్య పరిష్కారానికి బహుముఖ వ్యూహం అవసరం. దేశంలోని నియంత్రణ వ్యవస్థలను గాడిలో పెట్టడంతో మొదలుపెడితే సరైన దిశలో ముందడుగు వేసినట్లు అవుతుంది!

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

## సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

### కొత్త ప్రారంభాలకు స్వాగతం



అందరికీ ఉగాది శుభాకాంక్షలు! తీపి, పులుపు, కారం, చేదు వంటి విభిన్నమైన జీవిత అనుభవాలను మనకు గుర్తుచేసే అద్భుతమైన ఉగాది పచ్చడి రుచులను ఆస్వాదిస్తూ ఈ పండుగను జరుపుకొందాం. కొత్త ప్రారంభాలు మరియు సమృద్ధితో నిండిన సంవత్సరానికి శుభాకాంక్షలు!

– పినరయి విజయన్, కేరళ ముఖ్యమంత్రి

### నిరూపణ అక్కర్లేదు



పంజాబ్ ప్రజలు తమ ఇళ్ల మీద త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించాల్సిన అవసరం లేదు (దేశభక్తిని నిరూపించు కోవడానికి). ఎందుకంటే వాళ్ల పిల్లలు చాలా తరచుగా అదే త్రివర్ణ పతాకాల్లో చుట్టి వస్తారు (యుద్ధాల్లో మరణించి). వివేక్ అగ్నిహోత్రి లాంటి వాళ్లకు మాత్రమే మాతృభూమి పట్ల తమ విశ్వాసాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

– మన్‌దీప్ సింగ్ బజ్వా, కాలమిస్ట్

### అందరూ హ్యాపీస్!



రైట్ వింగ్ ఎలాగూ సంతోషంగానే ఉంది. ప్రపంచ సంతోష సూచీలో ఇండియా స్థానం(126) చూసిన తర్వాత వామపక్షీయులు కూడా సంతోషంగానే ఉన్నారు. అంటే, ఇప్పుడు మొత్తంగా 140 కోట్ల మంది భారతీయులు సంతోషంగా ఉన్నట్టు. కాబట్టి, ఇండియా స్థానాన్ని పునఃపరిశీలించి, మొదటి స్థానంలోకి తేవాలి.

– జాఫర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

### అనుసంధానం తప్పదు



ఈ రోజు ప్రపంచ జల దినోత్సవం (మార్చ్ 22). దేశంలో తలసరి నీటి లభ్యత (క్యూబిక్ మీటర్లలో): 1981- 2,895 ; 1991- 2,309 ; 2001- 1,816 ; 2011- 1,545 ; 2021- 1,486. కేవలం నలభై ఏళ్లలో నీటి లభ్యత సగానికి సగం తగ్గిపోయింది. మన వాననీటిలో అరవై శాతం సముద్రాల్లో కలుస్తోంది. అందుకే నదుల అనుసంధానం తప్పనిసరి అని నా అభిప్రాయం.

– ఆనంద్ రంగనాథన్, రచయిత

# నిజాయితీకి నిలువెత్తు రూపం

మూడు సంవత్సరాలకు ముందు 2020లో జరిగి ఉండవలసిన జస్టిస్ అల్లాడి కుప్పుస్వామి శత జయంతి వేడుకలు కోవిడ్ మూలంగా ఈ సంవత్సరానికి వాయిదాపడి, ఈ నెల 24 శుక్రవారంతో ముగియనున్నాయి. అల్లాడి కుప్పుస్వామి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1967లో న్యాయమూర్తిగా నియమితులై, 1980 నుండి 1982 వరకు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించారు. 'హిందూ లా'లో సర్ వి. భాష్యం అయ్యంగార్ స్వర్ణ పతకాన్ని అందుకున్న ఆయన 1942లో మద్రాస్ హైకోర్ట్‌లో న్యాయవాదిగా నమోదయ్యారు. మద్రాస్ నుండి ఆంధ్ర విభజన జరిగిన తరువాత... మొదట ఆంధ్ర హైకోర్ట్ గుంటూరులో, తరువాత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు హైదరాబాద్‌లో కొనసాగారు. జడ్జి స్థాయికి ఎదిగారు. అప్పట్లో వారి తండ్రి అల్లాడి కృష్ణస్వామి అనారోగ్య కారణాల వల్ల కుప్పుస్వామిని రాజ్యాంగ నిర్మాణ సభలకు అనుమతించారు. అలా ఆయనకు భారత రాజ్యాంగ నిర్మాణం రూపొందిన వైనాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అదృష్టం కలిగింది. అత్యంత నిజాయతీపరుడుగా, నిష్పాక్షికన్యాయమూర్తిగా ప్రశంసలందుకున్న ఆయనను ప్రభుత్వం పార్లమెంట్ ముందు ఎస్ఎస్‌పీ సభ్యులపై జరిగిన లాఠీ ఛార్జ్‌పై, సికింద్రాబాద్‌లో జరిగిన ఆవ్రో క్రాష్‌పై, పేరుభొట్ల పాలెం డీప్ కట్ కేసు (నాగార్జున సాగర్)పై వన్‌మాన్ కమిషన్‌గా నియమించింది. ఆయన ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడెమి ప్రారంభించడంలో ప్రధాన పాత్ర వహించారు.

పదవీ విరమణ తరువాత 'అసోసియేషన్ ఫర్ ద కేర్ ఆఫ్ ద ఏజ్డ్', 'సుర భారతి సమితి', 'హైదరాబాద్ లిటరరీ సొసైటీ' వంటి ప్రముఖ సేవా సంస్థల కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు. వారి తల్లిదండ్రుల పేరిట 'ది అల్లాడి మెమోరియల్ ట్రస్ట్', 'అల్లాడి వెంకటలక్ష్మమ్మ మెమోరియల్ ట్రస్ట్'లను సమాజానికి న్యాయ, వైద్య సేవలందించడం కోసం ప్రారంభించారు. కొన్నిసంవత్సరాల క్రితం ఈ రెండు సేవా సంస్థలు 'అల్లాడి మెమోరియల్ ట్రస్ట్' పేరుతో విద్యారంగాన్ని కూడా చేర్చుకొని ప్రధానంగా అట్టడుగు వర్గాల వారికి ఈ మూడు రంగాలలో సహాయ, సహకారాలను అందిస్తూ వచ్చాయి. జీవితంలో ఆటల ప్రాధాన్యాన్ని గుర్తించిన ఆయన టెన్నిస్, క్రికెట్, బ్రిడ్జ్‌లలో రాణించడమేకాక, యువకులను వాటిలో ప్రోత్సహించేవారు. తన భార్య లక్ష్మి తన కంటే గొప్పగా బ్రిడ్జ్ ఆడేవారని బహిరంగంగా ఎన్నోసార్లు అనేవారు. నిరంతర విద్యార్థిగా ఆయన 'మెయిన్స్ హిందూ లా', ఇండియన్ ఎవిడెన్స్ ఏక్ట్ 1872లను పునర్లిఖించారు. పిల్లలకోసం 'ద టేల్స్ ఫ్రమ్ ద క్లాసిక్స్'ను ఇంగ్లీష్‌లో ప్రచురించారు. సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా 'కాన్‌స్టిట్యూషన్, వాట్ ఇట్ మీన్స్ టు ద పీపుల్' అనే పుస్తకంలో అనేక వ్యాసాలను ప్రచురించారు. వారి తండ్రిని స్ఫూర్తిగా తీసుకొని... అందరూ అత్యంత పేదరికం నుంచి సర్వోన్నత స్థానానికి ఎదగగలరనే ధైర్యాన్నిచ్చే అల్లాడి కృష్ణస్వామి జీవిత చరిత్రను రాశారు. తన 92వ సంవత్సరంలో తుది శ్వాస విడిచారు.



జస్టిస్ అల్లాడి కుప్పుస్వామి

మార్చి 24న హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీలో ఆయన పేరున 'డెమోక్రసీ: డిసెంట్ అండ్ ద కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా' పేరుతో 'శత జయంతి ఉపన్యాసం' (సెంటినరీ లెక్చర్) ఉమ్మడి ఆంధ్రకు అడ్వకేట్ జనరల్‌గా సేవలందించిన సీవీ మోహన్ రెడ్డి ఇవ్వనున్నారు. ఏపీ హైకోర్ట్ జడ్జిగా సేవలందించిన జస్టిస్ గోడ రఘురాం అధ్యక్షత వహించే ఈ కార్యక్రమంలో పలువురు జడ్జీలు, పౌరులు పాల్గొంటారు.

– అల్లాడి కుప్పుస్వామి కుటుంబం
(రేపు అల్లాడి కుప్పుస్వామి శతజయంతి సభ)

# రాజకీయాల్లో కమిట్‌మెంట్ అంటే ఇదే

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

ఒకప్పుడు రాజకీయాల్లో నీతి ఉండేది. శాస్త్రీయమైన వాస్తవికతా ఉండేది. ఇప్పుడు చాలావరకు విలువలు, కమిట్‌మెంట్ మాయమై ఎలా గెలవడం అనే అంశం చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. గెలవడానికి ఎన్ని వాగ్దానాలైనా చేయడం, డబ్బులు మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చుచేయడం, గెలిచిన తర్వాత వాగ్దానాలను తుంగలో తొక్కడం... ఇవీ చాలా మంది రాజకీయ నాయకులు చేసే పనులు.

ఇలాంటి రాజకీయాలు నడుస్తున్న సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఓ వరంలా యువనాయకుడు జగన్ రాజకీయాల్లో... నీతినీ, శాస్త్రీయతనూ, విలువలను కాపాడటానికి రంగప్రవేశం చేశాడు. చేసిన వాగ్దానాలను పూర్తి చేయడమే కాకుండా కోట్లాది తెలుగు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పథక రచన చేసుకున్నాడు. అణగారిన జాతులుగా ఉన్న బహుజన కులాలతో పాటు అన్ని వర్గాలకు, వర్ణాలకు సంక్షేమ పథకాలు అందేలా పాలన సాగిస్తున్నాడు. తండ్రి రాజశేఖరరెడ్డి ఆదర్శాలను, ఆశయాలను జీర్ణించుకోవడమే కాకుండా... కాలానుగుణంగా అంతకంటే ముందుకెళ్ళి విప్లవాత్మకమైన మార్పులకు కారణమయ్యాడు.



సంక్షేమ పథకాలను అందకునేవారిని కూలీలుగా భావించే రాజకీయ పార్టీలు, నాయకులు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నారు. వీరి ప్రవర్తన బాధ్యతా రహితంగా ఉంది. ఇంగ్లిష్ మీడియం చదు వులు, రైతుభరోసా, మూడు రాజధానులు, పోలవరం ప్రాజెక్టును అవినీతికి తావులేకుండా నిర్మాణం చేయడానికి చేసిన మార్పులు విప్లవాత్మకమైనవే. ఇవి జగన్ మార్క్ అద్భుత రాజకీయ నిర్ణయాలు. వీటిని అడ్డుకుంటానికి తెలుగుదేశం లాంటి పార్టీలు ఎన్ని ప్రయత్నాలు చేసినా మొక్కవోని ధైర్య సాహసాలతో అడ్డంకుల నెదుర్కొంటూ ముందుకెళ్తున్న కమిట్‌మెంట్ రాజకీయాలకు ఉదాహరణ ప్రాయుడు జగన్.

ఈ దేశంలో ఆకాశంలో సగంగా చెప్పబడే స్త్రీ సమానత్వం గురించి మాట్లాడే వారే తప్ప పట్టించుకునేవారు లేరు. బహుజన సాధికారత, సామాజిక న్యాయం లాంటి అనేక సమస్యలతో పాటు స్త్రీ సాధికారత కూడా ఈ దేశంలో అందని మానిపండులాగే ఉంది. చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయిన తర్వాత కూడా ఆమోదం పొందకపోవడం శోచనీయం. అందుకే వైసీపీ పార్లమెంట్‌లో మహిళలకు చట్ట సభల్లో మూడవ వంతు స్థానాలను మహిళలకు కేటాయించాలని ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టింది. కానీ అది తిరస్కరణకు గురైంది.

మన దేశంలోని చట్టాలు సత్వర న్యాయానికి దూరం. బాధితుల జీవితకాలంలోనూ న్యాయం జరిగే పరిస్థితులు లేవు. చట్టంలోని లొసుగులను ఉపయోగించుకొని పురుషాహంకారులు నేరం చేసి తప్పించుకొనే స్థితిలో ఉన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నట్టే మహిళలకూ అండదండగా నిలిచాడు. తత్ఫలితమే 'దిశ' చట్టం. ఇది తెచ్చిన తర్వాత మహిళల్లో ఆత్మస్థయిర్యం పెరిగింది. నేరం జరిగిన కొన్ని రోజుల్లోపలే నేరస్థుడిని గుర్తించి శిక్ష పడేలా ఈ చట్టం ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇది మహిళల పాలిట రక్షణ కవచమైంది. మహిళల జోలికి పోవడానికి పురుషాహంకారులు వణికిపోయే పరిస్థితి వచ్చింది. చట్టం చేయడం మాత్రమే కాదు ఆ చట్టాన్ని అమలు చేయడంలోనూ జగన్ న్యాయబద్ధంగా, హేతుబద్ధంగా, కమిట్‌మెంట్‌తో వ్యవహరించడం వల్ల మహిళలపై అత్యాచారాలు చాలావరకు తగ్గాయి.

ఆంధ్ర మహిళల పాలిట అన్నగా, తమ్ముడిగా, కుమారుడిగా అనేక పథకాలను జగన్ ఇచ్చాడు. మొత్తం మీద వైసీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఈ పథకాల అమలులో ఏవైనా లోపాలుంటే నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలి కానీ, వీటిపై కూడా కువిమర్శలు చేయడం సబబేనా? ఈ సంక్షేమ పథకాలు జగన్ కమిట్‌మెంట్ రాజకీయాలకు ఉదాహరణ ప్రాయమైన వన్నవి కాదనలేని సత్యం.


వ్యాసకర్త ప్రముఖ సాహితీవేత్త
మొబైల్: 91829 18567

# రోజా – దైవాదేశం

విశ్వంలోని విశ్వాసులందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న విశిష్ట మాసం రమజాన్ ప్రారంభమైంది. ఒకవైపు ఎండలు ముదురుతున్నా, ముస్లింలు పరమ సంతోషంతో రమజాన్‌ను స్వాగతిస్తున్నారు. ఎందుకంటే ఇది శుభాలు వర్షించే వరాల వసంతం. ఈ పవిత్ర మాసంలో ఉపవాసాలు పాటించాలన్నది దైవాదేశం.

పవిత్ర ఖురాన్‌లో ఇలా ఉంది: 'విశ్వాసులారా! గత ప్రవక్తల అనుయాయులపై ఏవిధంగా ఉపవాసాలు విధిగా నిర్ణయించబడ్డాయో, అలాగే ఇప్పుడు మీపై కూడా ఉపవాసాలు విధిగా నిర్ణయించబడ్డాయి. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశముంది' (2–183). దైవం పట్ల భయభక్తులు ఉన్నప్పుడే మనిషి అన్నిరకాల చెడులనూ, దుర్మార్గాలనూ విసర్జించి మంచిని స్వీకరిస్తాడు.

ప్రతి మనిషీ ఈ ప్రపంచంలో తాను చేసుకున్న కర్మలకు పరలోకంలో విశ్వప్రభువు ముందు సమాధానం చెప్పుకోవలసి ఉంది. ఆప్రకారమే ప్రతిఫలమూ లభించనుంది. విశ్వాసి మదిలో నిరంతరం మెదిలే ఈ భావనే దైవభీతి. ఇలాంటి భయభక్తులు కలిగిన మనిషి సమస్త చెడులకూ, పాపాలకూ దూరంగా ఉంటూ పవిత్రమైన, పరిశుద్ధమైన జీవితం గడపడానికి ప్రయత్నిస్తాడు.



రుజుమార్గం

ఇక్కడ రమజాన్ ఉపవాసాల ఉద్దేశ్యం 'దైవ భీతి' అని చెప్పడం జరిగింది. అంటే రమజాన్ మాసంలో ఆచరించే ఉపవాసాలు మనిషిలో భయభక్తుల్ని జనింపజేసి, దాన్ని పటిష్ఠం చేసే శిక్షణ ఇస్తాయన్నమాట. దైవం విశ్వాసులకు ఉపవాసాలు పాటించాలని ఆజ్ఞాపించిన ఉద్దేశ్యంలో దైవభీతితోపాటు కృతజ్ఞత కూడా ఉంది. అంటే, దైవం రమజాన్ మాసంలో మానవుల జీవితాలను సమూలంగా సంస్కరించి, వారికి ఇహపర సౌభాగ్యాలు అనుగ్రహించే పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని అనుగ్రహించినందుకు కృతజ్ఞతలు సమర్పించుకుంటారు.

'దైవం మీకు రుజుమార్గం చూపినందుకు ఆయన ఔన్నత్యాన్ని కొనియాడడానికీ, ఆయనకు కృతజ్ఞులై ఉండడానికీ ఈ సౌలభ్యం ప్రసాదించాడు' (2–183). రమజాన్ ఉపవాసాలు పాటించడం ద్వారానే మనం దైవానికి కృతజ్ఞతలు చెల్లించుకోగలుగుతాం.

ఈ మాసంలో ఒకవిశ్వాసి శక్తి ఉండికూడా ఉపవాసాలు పాటించడం లేదంటే, అతడు దైవం చేసిన మేలును మరచిపోయి ఆయనకు కృతఘ్నుడై పోయాడనిఅర్థం. కనుక ఉపవాసాల ఉద్దేశ్యాన్నీ, పవిత్ర ఖురాన్ అవతరణ లక్ష్యాన్నీ అర్థంచేసుకొని, రమజాన్ మాసాన్ని సద్వినియోగం చేసుకుంటే దైవ ప్రసన్నతకు పాత్రులు కాగలుగుతాం. దైవం మొత్తం మానవులందరికీ సన్మార్గ పథం ప్రసాదించాలని కోరుకుందాం.

– మదీహా అర్జుమంద్
(పవిత్ర రమజాన్ మాస సందర్భంగా)

## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.విదియ రా.8.32 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** రేవతి సా.4.13 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.10.07 నుండి 10.55 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** ప.1.50 నుండి 3.24 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.06, **సూర్యాస్తమయం:** 6.07.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

# వేడుకగా ఉగాది ఆస్థానం

## శోభాయమానంగా ఫల, పుష్పాలంకరణ


ఉగాది ఆస్థానంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి

**తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది ఆస్థానం వేడుకగా జరిగింది. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేశారు. విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశించారు. శ్రీవారి ఉత్సవమూర్తులు బంగారు వాకిలిలో గరుడాళ్వారుకు అభిముఖంగా సర్వభూపాల వాహనంపై వేంచేపు చేశారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడు శ్రీ విష్వక్సేనుల వారిని వేంచేపు చేశారు. ఆ తరువాత శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపచేసి పంచాంగ శ్రవణం నిర్వహించారు. బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీవారి దర్శనానికి 12 గంటలు**

తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్టుమెంట్‌లు నిండి ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 57,559 మంది స్వామివారిని దర్శించుకుని హుండీలో రూ.4.26 కోట్లు వేశారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 12 గంటల్లో , ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 3 గంటల్లో దర్శనమవుతోంది.


ఆలయం వెలుపల ఏర్పాటు చేసిన గరుత్మంతుడి నమూనా

### ప్రత్యేక ఆకర్షణగా ఫల పుష్పాలంకరణ

ఉగాదిని పురస్కరించుకుని టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆలయం లోపల విభిన్న రకాల పండ్ల గుత్తులు, అపురూపమైన ఉత్తమజాతి పుష్పాలతో శ్రీవారి ఆలయాన్ని ఆకర్షణీయంగా అలంకరించారు. శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభం చెంత ఎండు కొబ్బరితో దశావతారాలు, కొబ్బరిపూలతో చేసిన శ్రీలంక ఆర్ట్ అలంకరణలు, పుచ్చకాయలతో ఆకర్షణీయంగా చెక్కిన శ్రీపద్మావతి శ్రీనివాసుల కల్యాణఘట్టం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయం వెలుపల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారిని తీసుకెళుతున్న గరుత్మంతుడు అనే ఘట్టాన్ని రూపొందించారు. గొల్ల మండపం పక్కన ఉగాది లక్ష్మీదేవితో శ్రీమహావిష్ణువు, ఉద్యానవనంలో ఆడుకుంటున్న బాలల రూపంలో ఉన్న శ్రీరాముడు హనుమంతుడు, ఉగాది రోజున మామిడి వనంలో కాయలు కోస్తున్న శ్రీకృష్ణుడు, పౌరాణిక ఘట్టాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. టీటీడీ గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 150 మంది పుష్పాలంకరణ కళాకారులు 3 రోజుల పాటు శ్రమించి ఆకర్షణీయమైన ఫల, పుష్ప ఆకృతులను రూపొందించారు.


శ్రీవారి ఆలయంలో ఫల పుష్పాలంకరణ

## క్లుప్తంగా...

### దుర్గమ్మ సన్నిధిలో ప్రముఖులు

**ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ):** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను బుధవారం ఉప ముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి, మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనాన్ని, ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

### కాణిపాకంలో ఘనంగా ఉగాది వేడుకలు


ఉత్సవమూర్తులకు కర్పూర హారతులు ఇస్తున్న అర్చకులు

**యాదమరి (చిత్తూరు జిల్లా):** కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా ఉగాది వేడుకలను నిర్వహించారు. ఉదయం ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ పూజాది కార్యక్రమాలకు అడపగుండ్ల పల్లెకు చెందిన దివంగత మహదేవనాయుడు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. కల్యాణ వేదికలో సుగంధ పుష్పాలతో అలంకరించిన పందిరిలో సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామిని కొలువుదీర్చి ఆలయ అర్చక వేదపండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. పంచాంగ శ్రవణం కార్యక్రమంలో కొలువు తీరిన సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామికి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. పట్టు వస్త్రాలను అలంకరించి ఆలయ అర్చక వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

### దీర్ఘాయువు ఆయుర్వేద ఆస్పత్రి ప్రారంభం


స్పీకర్ తమ్మినేని సీతారాంకు మంగళ శాసనాలు అందజేస్తున్న చిన్నజీయర్‌స్వామి

**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దిగువున దీర్ఘాయువు ఆయుర్వేద ఆస్పత్రిని ఏపీ శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు, ఏపీ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు దంపతులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు విద్య, వైద్య రంగాలలో చిన్నజీయర్ స్వామి అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం వీరికి చిన్నజీయర్ స్వామి మంగళ శాసనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు పాల్గొన్నారు.

### ఘనంగా అప్పన్న పెళ్లిరాట మహోత్సవం



**సింహాచలం:** ఉగాదిని పురస్కరించుకుని సింహగిరిపై బుధవారం సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి పెళ్లిరాట మహోత్సవం ఘనంగా జరిగింది. వచ్చే నెల 2న చైత్రశుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని జరిగే స్వామివారి వార్షిక కల్యాణోత్సవం సందర్భంగా పెళ్లిరాట మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ ఉత్తర ద్వారం వద్ద, రాజగోపురం వద్ద, వార్షిక కల్యాణం జరిగే నృసింహ కల్యాణమండపంలో పెళ్లిరాట వేశారు.

## పాలకుల జాతకాలతో ఇబ్బందులు తొలగుతాయి

- శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- విశాఖ శ్రీ శారదా పీఠంలో ఘనంగా ఉగాది వేడుకలు

Would you like to Subscribe to SAKSHI?
Please give a missed call to
8678906509
We will get back to you


మాట్లాడుతున్న స్వరూపానందేంద్ర

**సింహాచలం:** విశాఖ శ్రీ శారదా పీఠంలో బుధవారం ఉగాది వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పీఠం ముద్రించిన శోభకృత్ నామ సంవత్సర గంటల పంచాంగాన్ని పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆవిష్కరించారు. రాజశ్యామల అమ్మవారికి నివేదించిన ఉగాది పచ్చడిని భక్తులకు అందజేశారు. జ్యోతి ప్రజ్వలనతో ఉగాది ఆస్థానం ప్రారంభమైంది. పీఠం ఆస్థాన సిద్ధాంతి తెన్నేటి శ్రీనివాస శర్మ పంచాంగ శ్రవణం చేశారు. స్వరూపానందేంద్ర మాట్లాడుతూ మూడేళ్లుగా దేశాన్ని కాలసర్పదోషం వెంటాడిందని, ఈ ఏడాది చతుర్ గ్రహ కూటమితో కొత్త ఏడాది ప్రారంభమవుతోందని దీని ప్రభావంతో దేశానికి అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రధాని, తెలుగు రాష్ట్రాల సీఎంల జాతకాలు అనుకూలంగా ఉన్నందున కొంతమేర ఇబ్బందులు తొలగుతాయన్నారు. ఏపీని వరదలు ముంచెత్తుతాయని, సీఎం జాతకం దృష్ట్యా ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో హింసాత్మక ఘటనలు అధికమై, మరణాలు సంభవిస్తాయన్నారు. అన్ని రాష్ట్రాల్లో వాహన ప్రమాదాలు అధికంగా జరుగుతాయని తెలిపారు. ఎండల తీవ్రత కారణంగా వడదెబ్బలు చూడాల్సి వస్తుందన్నారు. జూలై నుంచి సెప్టెంబర్ వరకు ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడతాయన్నారు.

## బీన్స్ గింజపై ఆస్కార్ 'నాటు నాటు'


బీన్స్ గింజపై 'నాటు నాటు' సూక్ష్మ చిత్రం


ఎ.శివనాగేశ్వరరావు

**తెనాలి:** లాస్ ఏంజిలిస్‌లో ఇటీవల జరిగిన 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఆస్కార్‌ను అందుకున్న ఆర్ఆర్ఆర్ సినిమాలోని 'నాటు నాటు..ఊర నాటు' పాటను ప్రవాస భారతీయ చిత్రకారుడు బీన్స్ గింజపై చిత్రీకరించారు. దర్శక ప్రముఖుడు రాజమౌళి తీసిన ఈ సినిమాలో 'నాటు నాటు' పాటను జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్‌పై చిత్రీకరించారు. ఆస్కార్ అవార్డును సంగీత దర్శకుడు కీరవాణి, గీత రచయిత చంద్రబోస్ అందుకున్నారు. కువైట్‌లోని షాహీల్ అల్ వతానీ ఇండియన్ ప్రైవేట్ స్కూలులో చిత్రకళ విభాగం అధిపతి ఎ.శివనాగేశ్వరరావు వైట్ బీన్స్ గింజపై సూక్ష్మంగా చిత్రీకరించారు. రామ్‌చరణ్, ఎన్టీఆర్ డ్యాన్స్ మూమెంట్‌ను, మధ్యలో ఆస్కార్ అవార్డును తీర్చిదిద్దారు. చిత్రకారుడనైన తాను, ఈ సూక్ష్మచిత్రంతో ఆర్ఆర్ఆర్ బృందానికి శుభాకాంక్షలు చెబుతున్నట్టు శివనాగేశ్వరరావు 'సాక్షి'కి ఫోనులో వెల్లడించారు. శివనాగేశ్వరరావు స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి.

## దర్గాలో పంచాంగ శ్రవణం

- జగద్గురు ఖాదర్‌లింగ స్వామి సన్నిధిలో ఉగాది వేడుకలు


దర్గాలో పంచాంగ పుస్తకాలకు పూజలు చేస్తున్న భద్రినాథ్‌స్వామి

**కౌతాళం (కర్నూలు):** హిందూ ముస్లింల సమైక్యతకు నిదర్శనం కౌతాళంలో వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా. ఇక్కడ ఉగాది రోజున పంచాంగ శ్రవణం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఉగాది దేశంలోని హిందువులకు మాత్రమే పవిత్రదినం అయితే.. కౌతాళంలో ముస్లింలకు కూడా ఓ వేడుక. ఉగాది రోజున ప్రతి ఒక్కరూ తమ జాతక ఫలాలు తెలుసుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. మతసామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో స్థానిక బ్రాహ్మణులు దర్గాలో ప్రత్యేక పూజలు చేసి పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. 356 ఏళ్లుగా ఇదే ఇక్కడి ఆనవాయితీ. బుధవారం గ్రామ పురోహితులు భద్రినాథ్ స్వామి దర్గాలో పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణం ప్రారంభించారు. దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా హుసేని చిష్తీ, భక్తులు, కౌతాళం హిందూ, ముస్లిం సోదరులు ఈ పఠనాన్ని శ్రద్ధగా విన్నారు. ఖాదర్‌లింగస్వామి(మకరరాశి) ప్రాధాన్యతను తెలియజేసి అనంతరం ఏయే రాశులలో ఎవరి జాతకఫలాలు ఎలా ఉన్నాయో వివరించారు. అనంతరం స్వాముల వారు గ్రామంలోని ప్రముఖుల ఇళ్లకు వెళ్లి రాశిఫలాలను వివరించారు. దర్గా పీఠాధిపతి ఖాదర్ బాషా చిష్తీ, గుల్షన్ కమిటీ అధ్యక్షుడు మున్నపాషా, గ్రామ ప్రముఖులు, ఖాదర్‌లింగ స్వామి శిష్యులు పాల్గొన్నారు.

## ఆర్-5 జోన్‌లో పేదలకు ఇళ్లస్థలాలు హర్షణీయం

- 906వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బహుజన నేతలు

**తాడికొండ:** ఏపీ సీఆర్డీఏ పరిధిలోని ఆర్-5 జోన్‌లో నిరుపేదలకు ఇళ్లస్థలాలు కేటాయించడం హర్షణీయమని, ఇది రాజధాని ప్రాంతంలో పెత్తందారుల ఆధిపత్యంపై విజయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయ పాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 906వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. సీఆర్డీఏ పరిధిలో 5 శాతం భూమిని పేదలకు కేటాయించవచ్చని గత ప్రభుత్వం నిబంధనలు పెట్టిందని, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు 54 వేల పట్టాలిచ్చేందుకు ముందుకొస్తే బాబు అడ్డుకుని కోర్టుల్లో స్టేలు తీసుకొచ్చాడని మండిపడ్డారు. కులవాదుల కోసం నిత్యం అబద్ధపు రాతలు రాస్తున్న రామోజీరావు, రాధాకృష్ణ పేదలకు కేవలం 54 వేల మందికి ఉచితంగా ఇళ్ల స్థలాలిస్తుంటే బురదజల్లేలా తప్పుడు కథనాలు ప్రచురించడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు.పేదలకు ఇళ్ల స్థలాలు అప్పగించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ దీక్షా శిబిరంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా మల్లన్న రథోత్సవం

**శ్రీశైలం టెంపుల్:** శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం మల్లన్న రథోత్సవం కనుల పండువగా జరిగింది. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులు చేయించి ఊరేగింపుగా రథశాల వద్దకు తీసుకువచ్చి రథంపై అధిష్ఠించి రథాంగపూజ, హోమం, సాత్విక బలి చేపట్టారు. అర్చకులు ఉత్సవమూర్తులకు ప్రత్యేక హారతులిచ్చారు. రథానికి ప్రత్యేక హారతి ఇచ్చి రథోత్సవాన్ని ప్రారంభించారు. గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు రథోత్సవం సాగింది. అమ్మవారి ఉత్సవమూర్తిని రమావాణీ సేవిత రాజరాజేశ్వరీ అలంకారంలో అలంకరించారు. గురువారం పూర్ణాహుతిని నిర్వహించనున్నారు.

**ఈ ఏడాది పారిశ్రామిక వృద్ధి: బుట్టే వీరభద్ర దైవజ్ఞ**

ఈ సంవత్సరం దేశం పారిశ్రామిక రంగంలో వృద్ధి చెందుతుందని శ్రీశైల దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ పంచాంగ శ్రవణంలో తెలిపారు. ఉగాదిని పురస్కరించుకుని శ్రీశైలం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో బుధవారం పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. శోభకృత్ నామ సంవత్సర విశేషాలను వివరిస్తూ ఈ ఏడాది దేశమంతటా వర్షపాతం నమోదు సగటు కంటే ఎక్కువగా ఉంటుందన్నారు. వరి, గోధుమలు, చెరకు, తృణధాన్యములు, మిర్చి మొదలైన వాటికి మంచి ధరలు ఉంటాయన్నారు.

## వ్యవసాయ రంగం అభివృద్ధికి సమష్టిగా కృషిచేద్దాం

- ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి
- ఉత్తమ రైతులు, ఉపాధ్యాయులకు ఉగాది పురస్కారాలు


ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పొందిన అధికారులతో వీసీ డాక్టర్ ఎ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

**గుంటూరు రూరల్:** రైతన్నను రాజును చేసి వ్యవసాయరంగం అభివృద్ధికి సమష్టిగా కృషిచేద్దామని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లాలోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉన్న విశ్వవిద్యాలయంలో బుధవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. పలువురికి ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. అంతకుముందు వీసీ తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఉగాది వేడుకల్లో విశ్వవిద్యాలయం వార్షిక ప్రచురణ, వ్యవసాయ పంచాంగం 2023-24ను ముఖ్యమంత్రి దంపతుల చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. అనంతరం వర్సిటీలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు.

### ఉత్తమ రైతు పురస్కారాలు..

వ్యవసాయంలో నూతన ఆలోచనలు, ఆవిష్కరణలకుగాను పలువురికి 2023-24 సంవత్సరానికిగాను ఉత్తమరైతు పురస్కారంతోపాటు రూ.5 వేల నగదు బహుమతిని, జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం నక్కలపేటకు చెందిన పి.నరశింహారావు, అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం బంగారుపెట్టికి చెందిన ఎస్.రఘునాథ్, గుంటూరు జిల్లా కాకుమాను మండలం గార్లపాడుకు చెందిన జి.నాగబాబు, కడపజిల్లా చాపాడు మండలం వెదురూరు రాజుపాలేనికి చెందిన ఎల్.సదాశివారెడ్డి, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లికి చెందిన డి.మద్దయ్యకు ఉత్తమరైతు పురస్కారాలు ప్రదానం చేశారు.

### ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు..

విశ్వవిద్యాలయం పరిధిలో పలువురికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేశారు. తిరుపతి వ్యవసాయ కళాశాలకు చెందిన డాక్టర్ జి.కృష్ణారెడ్డి, గుంటూరు లాంఫాంకు చెందిన డాక్టర్ డి.సుబ్రమణ్యం, డాక్టర్ పి.కిషోర్‌వర్మ, బనవాసి కృషివిజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుజాతమ్మ, వర్సిటీ టెక్నికల్ ఆఫీసర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.బిందుమాధవి, వర్సిటీ ఏవో కార్యాలయం పరిశోధన సంచాలకులు, టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ జి.వి.సునీల్ కుమార్, మారుటేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానానికి చెందిన డాక్టర్ ఎం.శ్రీనివాస్‌కు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం చేశారు.

## దేవుని కడపలో ముస్లింల ప్రార్థనలు

- వెల్లివిరిసిన మతసామరస్యం


స్వామి వారి దర్శనానికి వెళుతున్న ముస్లిం భక్తులు

**కడప కల్చరల్:** వైఎస్సార్ జిల్లా మరోమారు తన ప్రత్యేకతను చాటుకుంది. ఉగాది సందర్భంగా ముస్లింలు కడప నగరం దేవుని కడపలోని శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకోవడం అనాదిగా వస్తోన్న సంప్రదాయం. బుధవారం ఉగాది సందర్భంగా పెద్ద సంఖ్యలో ముస్లింలు ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తిరుమలకు తొలిగడపగా భావించే కడప రాయుని ఆలయంలో అమ్మవారిని తమ ఆడబిడ్డ బీబీ నాంచారిగా భావిస్తూ అమ్మవారితోపాటు స్వామికి ముస్లింలు భత్యం, నూనె, దక్షిణ సమర్పించారు. ముస్లిం భక్తులు ఒద్దికగా క్యూలో నిలబడి హిందూ భక్తులతోపాటు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కొబ్బరికాయలు, ఇతర పూజా ద్రవ్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు, వేదాశీర్వాదం స్వీకరించి అవి ఎందుకు ఇస్తారో తెలుసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సేద తీరి శిల్ప సంపదను తిలకించారు. క్షేత్ర మహిమ, ఆలయ విశేషాలు తదితరాల గురించి తెలుసుకున్నారు. తమ పెద్దల కాలం నుంచి ఉగాది సందర్భంగా ఇక్కడి స్వామిని దర్శించుకోవడం సంప్రదాయంగా వస్తోందని, వారి వారసత్వంగా తాము దాన్ని పాటిస్తున్నామని వారు తెలిపారు.

## మంగళగిరిలో భూకబ్జా

- నకిలీ దస్తావేజులతో స్థలం అమ్మేసిన టీడీపీ నేతలు, రియల్ వ్యాపారులు
- రూ.4.50 కోట్లకు టీడీపీ నేత అనుచరుడికి అగ్రిమెంట్.. రిజిస్ట్రేషన్‌కు ఏర్పాట్లు
- ఈ స్థలం ముందే కొన్నానంటూ వచ్చిన మరో వ్యక్తి
- పోలీసుల్ని ఆశ్రయించిన స్థలం యజమాని విజయవాడకు చెందిన గిరీశ్


జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న వివాదాస్పద స్థలం

**మంగళగిరి:** గుంటూరు జిల్లా మంగళగిరి వద్ద జాతీయ రహదారి వెంట ఖాళీగా ఉన్న భూములపై కబ్జాదారులు పంజా విసురుతున్నారు. నకిలీ పత్రాలు తయారుచేసి ఆ భూముల్ని అమ్మేస్తున్నారు. తాజాగా నకిలీ పత్రాలతో భూమి అమ్ముతున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై భూమి యజమాని పోలీసుల్ని ఆశ్రయించారు. నగరంలో జాతీయరహదారి వెంబడి ఉన్న శ్రీకృష్ణచైతన్య వృద్ధాశ్రమానికి దగ్గరలో 123/1 సర్వే నంబరులో 67 సెంట్ల భూమి కొన్నేళ్లుగా ఖాళీగా ఉంది. సుమారు రూ.15 కోట్ల విలువైన ఈ భూమిపై మంగళగిరికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, టీడీపీ నాయకుల కన్ను పడింది. నగరానికి చెందిన చంద్రమౌళి పేరు మీద నకిలీ దస్తావేజులు సృష్టించి అమ్మకానికి పెట్టారు. రూ.4.50 కోట్లకు కొనుగోలు చేసిన టీడీపీ నాయకుడు విశాఖపట్నానికి చెందిన తన అనుచరుడు కోటేశ్వరరావు పేరిట అగ్రిమెంట్ రాయించారు. అగ్రిమెంట్ అయిన వెంటనే భూమిని చదును చేసి మట్టి తోలసాగారు. దీంతో మంగళగిరికి చెందిన సాంబశివరావు ఆ భూమిని తాను కొనుగోలు చేశానని, తనకు అగ్రిమెంట్ ఉందని బయటకొచ్చారు. మొత్తం రూ.2.50 కోట్లు ఇస్తానని, భూమి ఖాళీ చేయాలని కోటేశ్వరరావుతో బేరాలాడసాగారు. ఈ విషయం తెలియడంతో ఆ భూమి అసలు యజమాని విజయవాడ వన్ టౌన్‌కు చెందిన గిరీశ్ మంగళవారం రాత్రి ఆ భూమి వద్దకు చేరుకున్నారు. ఈ భూమి మీదేననే ఆధారాలు తీసుకురావాలని కోటేశ్వరరావు అనడంతో గిరీశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువర్గాలు ఆధారాలు తీసుకురావాలని పోలీసులు సూచించారు. తాను గురువారం రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నానని, తహసీల్దారుతోను, రిజిస్ట్రార్‌తోను మాట్లాడానని కోటేశ్వరరావు చెప్పారు. ఈ విషయమై తహసీల్దారును, రిజిస్ట్రార్‌ను అడగగా.. తమను రిజిస్ట్రేషన్ కోసం సంప్రదించలేదని తెలిపారు. దస్తావేజులు, లింకు దస్తావేజులు, రెవెన్యూ రికార్డులు పరిశీలించి, పోలీసులు విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సీఐ అంకమ్మరావును అడగగా.. స్థల వివాదంపై ఫిర్యాదు అందిందని తెలిపారు. తాను సెలవులో ఉన్నానని, విధులకు వచ్చిన తరువాత విచారించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



అడంగల్‌లో ఎవరు పేరులేని వైనం

## ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి

- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా

**భవానీపురం (విజయవాడ పశ్చిమ):** శోభకృత్ నామ సంవత్సరంలో రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ఆకాంక్షించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం విజయవాడ భవానీ ద్వీపంలో ఉగాది ఉత్సవాల్ని నిర్వహించారు. విష్ణుభట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి బృందం వేద పఠనం చేసి ఆశీర్వచనం పలకగా.. లంకా శివానందశర్మ పంచాంగ శ్రవణం చేశారు. చైతన్య బ్రదర్స్, హరిత సిస్టర్స్ బృంద గానం, చెన్నైకు చెందిన రాజేశ్వరి సాయినాథ్, వైష్ణవి సాయినాథ్ బృందం ప్రదర్శించిన గంగ-అంతరంగ గంగ నృత్య రూపకం అలరించాయి.

**ప్రతిపక్షాలకు అవమానాలే దక్కుతాయి**

ఈ సందర్భంగా మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మంత్రిగా పని చేయటం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. పేద ప్రజలకు అనేక విధాలుగా మేలు చేస్తున్న సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సమృద్ధిగా ఆదాయాన్ని సమకూర్చుకుంటుందని ఆకాంక్షించారు.

## క్లుప్తంగా

### అప్పటిదాకా పోటీచేయను

శ్రీనగర్: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కార్ తొలగించిన ఆర్టికల్ 370ను పునరుద్ధరించే దాకా తాను శాసనసభ సమరంలో అడుగుపెట్టబోనని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) చీఫ్ మెహబూబా ముఫ్తీ స్పష్టంచేశారు. జమ్మూకశ్మీర్ మాజీ సీఎం అయిన మెహబూబా బుధవారం పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. ' రద్దయిన ఆర్టికల్‌ను పునరుద్ధరించే వరకు జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దిగను. ఇది సరైన నిర్ణయం కాదని నాకూ తెలుసు. కానీ ఇది భావోద్వేగంతో తీసుకున్న కఠిన నిర్ణయం. ఎన్నికైన ప్రభుత్వం ఉంటే తమ రహస్య ఎజెండా కార్యరూపం దాల్చదనే భయంతోనే బీజేపీ ప్రభుత్వం ఆ ఆర్టికల్‌ను తొలగించింది. 'ఆర్టికల్‌ను రద్దుచేసి కశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించామని కేంద్రం చెబుతోంది. అసెంబ్లీ ఎన్నికల కంటే పంచాయితీ ఎన్నికలే ప్రజాస్వామ్యానికి అసలైన గీటురాయి అన్నపుడు ప్రధాని, హోం మంత్రి వంటి వేరే పదవులు ఎందుకు ? వాళ్లు ఏం చేస్తున్నట్లు ?. కశ్మీర్ ప్రజలను బలహీనపరచి తమ ముందు సాగిలపడేలా చేయాలని కేంద్రం కుట్ర పన్నింది' అని ఆరోపించారు.

### మనీశ్ సిసోడియాకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) సీనియర్ నాయకుడు మనీశ్ సిసోడియాను 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీ కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈడీ కస్టడీ ముగియడంతో అధికారులు ఆయనను కోర్టులో ప్రవేశపెట్టారు. సిసోడియాను ఏప్రిల్ 5 దాకా జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తున్నట్లు ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్ ప్రకటించారు. మనీ లాండరింగ్ వ్యవహారంలో ఈడీ అధికారులు ఆయనను ఏడు రోజులపాటు విచారించారు. ఇక సీబీఐ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సిసోడియా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ప్రత్యేక కోర్టు ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది.

### పాకిస్తాన్ భూకంపంలో 12 మంది బలి

ఇస్లామాబాద్: రిక్టర్ స్కేల్‌పై 6.8గా నమోదైన భారీ భూకంపం పాకిస్తాన్‌ను వణికించింది. భూప్రకంపనల ధాటికి 12 మంది మరణించారు. అఫ్గాన్–పాక్ సరిహద్దులోని ఖైబర్ పఖ్తూంఖ్వా ప్రావిన్స్‌లో 9 మంది, ఇస్లామాబాద్‌లో ఇద్దరు, అబోతాబాద్‌లో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. అఫ్గానిస్తాన్‌లో ముగ్గురు మరణించారు. భూకంపం వల్ల అఫ్గానిస్తాన్, పాకిస్తాన్‌లో దాదాపు 200 మంది గాయపడ్డారని అధికారులు బుధవారం ప్రకటించారు.

# ఇద్దరు మిత్రులు సాధించిందేమిటి?

## పశ్చిమ దేశాలపై చైనా, రష్యా అధ్యక్షుల కన్నెర్ర

- అమెరికాపై వ్యతిరేకతే అజెండా
- పుతిన్, జిన్‌పింగ్ సంకేతాలు
- సైనిక సహకారంపైనే ఆసక్తి
- ఉక్రెయిన్ సంక్షోభంపై నోరెత్తని జిన్‌పింగ్

ఉక్రెయిన్–రష్యా యుద్ధానికి ముగింపు పలకడమే లక్ష్యంగా ఇరు దేశాల మధ్య శాంతి చర్చల కోసం తన వంతు సహకారం అందిస్తానన్న ప్రకటనతో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ రష్యా పర్యటన ప్రారంభించారు. శాంతి ప్రణాళికతో వచ్చానని చెప్పారు. తన బృందంతో కలిసి మూడు రోజుల పాటు రష్యా రాజధాని మాస్కోలో మకాం వేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో, ఆయన బృందంతో సుదీర్ఘంగా ద్వైపాక్షిక చర్చలు జరిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, వ్యాపారం, వాణిజ్యం వంటి రంగాల్లో పరస్పర సహకారం కోసం చైనా–రష్యా పదికిపైగా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అండగా ఉంటానని పుతిన్‌కు జిన్‌పింగ్ అభయ హస్తం ఇచ్చారు. ఉక్రెయిన్‌పై ఏకపక్షంగా దండయాత్రకు దిగిన రష్యా పశ్చిమ దేశాల ఆంక్షల కారణంగా ప్రపంచంలో దాదాపు ఏకాకిగా మారింది. మరోవైపు ఉక్రెయిన్‌లో యుద్ధ నేరాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో పుతిన్‌పై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు(ఐసీసీ) అరెస్ట్ వారెంటు జారీ చేసింది. రష్యా నుంచి బయటకు రాగానే పుతిన్‌ను అరెస్టు చేయడం తథ్యమని చెబుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రష్యాలో పర్యటించారు. పుతిన్‌కు స్నేహహస్తం అందించారు. జిన్‌పింగ్ రష్యాలో ఉన్న సమయంలోనే అమెరికా మిత్రుడైన జపాన్ ప్రధానమంత్రి ఫ్యుమియో కిషిదా ఉక్రెయిన్‌లో అడుగుపెట్టడం గమనార్హం. చైనా, రష్యా మధ్య బంధాన్ని పటిష్టం చేసుకోవడంతో పాటు ప్రపంచ దేశాలపై అమెరికా, దాని మిత్రదేశాల పెత్తనం ఇకపై చెల్లదన్న సంకేతాలు ఇవ్వడమే జిన్‌పింగ్, పుతిన్ భేటీ వెనుక ఉన్న అసలు ఉద్దేశమని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఐదు కీలక అంశాలు ఉన్నాయని అంటున్నారు. అవేమిటో చూద్దాం..

**ఉక్రెయిన్‌పై చొరవ సున్నా**

ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించే విషయంలో జిన్‌పింగ్ ఏమీ సాధించలేకపోయారు. యుద్ధాన్ని ముగించేలా రష్యాపై ఒత్తిడి పెంచలేదు. కనీసం ఆ విషయాన్ని కూడా ప్రస్తావించలేదు. ఉక్రెయిన్‌లో హింస, అమాయక ప్రజల మరణాలపై మాట మాత్రంగానైనా స్పందించలేదు. ఉక్రెయిన్‌లో ఉద్రిక్తతలను పెంచే చర్యలకు దూరంగా ఉండాలంటూ జిన్‌పింగ్, పుతిన్ సంయుక్తంగా పశ్చిమ దేశాలకు హితబోధ చేశారు. ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని, భద్రతను, ప్రయోజనాలను గౌరవించాలని సూచించారు. శాంతికి చొరవ చూపుతానన్న జిన్‌పింగ్ ఆ దిశగా ఎలాంటి ప్రయత్నం చేయలేదు. పుతిన్‌తో భేటీలో ఆ ఊసే ఎత్తలేదు. ఉక్రెయిన్ నుంచి ఇప్పటికిప్పుడు తమ సైన్యాన్ని వెనక్కి రప్పించే ప్రతిపాదన ఏదీ లేదని పుతిన్ తేల్చిచెప్పారు. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యకు పశ్చిమ దేశాల రెచ్చగొట్టే చర్యలే కారణమని చైనా, రష్యా చాలా రోజులుగా ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే.

### సైనిక సహకారం, రక్షణ సంబంధాలు

నాటో దేశాలతోపాటు ఆస్ట్రేలియా, యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా(ఏయూకేయూఎస్) భద్రతా చట్టం వంటి వాటితో తమకు ముప్పు పొంచి ఉందని చైనా, రష్యా చెబుతున్నాయి. అందుకే పరస్పరం సైనిక సహకారం మరింత పెంపొందించుకోవాలని, రక్షణ సంబంధాలు బలోపేతం చేసుకోవాలని జిన్‌పింగ్, పుతిన్ నిర్ణయించుకున్నారు. ఆసియా ఖండంలో స్థానికంగా ఎదురవుతున్న చిక్కులను పరిష్కరించుకోవడంతోపాటు పశ్చిమ దేశాలకు చెక్ పెట్టడానికి ఇది తప్పనిసరి అని భావిస్తున్నారు. పలు ఆసియా–పసిఫిక్ దేశాలతో అమెరికా సైనిక–రక్షణ సంబంధాలు మెరుగుపడుతుండడం పట్ల ఇద్దరు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా శాంతికి, స్థిరత్వానికి విఘాతం కలిగించే బాహ్య సైనిక శక్తులను తీవ్రంగా వ్యతిరేకిస్తామని ప్రకటించారు. ఇకపై ఉమ్మడి సైనిక విన్యాసాలు తరచుగా చేపట్టాలని నిర్ణయానికొచ్చారు. తద్వారా తాము ఇరువురం ఒక్కటేనని, తమ జోలికి రావొద్దంటూ ప్రత్యర్థులకు హెచ్చరికలు జారీ చేశారు.



### అమెరికా వ్యతిరేక కూటమి

అమెరికాకు వ్యతిరేకంగా తామే ఒక కొత్త కూటమిగా ఏర్పాటు కావడంతోపాటు నూతన వరల్డ్ ఆర్డర్ నెలకొల్పాలన్నదే చైనా, రష్యా ఆలోచనగా నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వరల్డ్ ఆర్డర్ తమ సొంత అజెండాలకు అనుగుణంగా, ప్రయోజనాలను కాపాడేలా ఉండాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. దీనిపై జిన్‌పింగ్, పుతిన్ మధ్య చర్చలు సాగినట్లు తెలుస్తోంది. బహుళ ధ్రువ ప్రపంచం కోసం కృషి చేద్దామని ఉమ్మడి ప్రకటనలో ఇరువురు నేతలు పిలుపునిచ్చారు. అమెరికా పెత్తనం కింద ఏకధ్రువ ప్రపంచానికి కాలం చెల్లిందన్నదే వారి వాదన. జిన్‌పింగ్ చైనాకు బయలుదేరే ముందు పుతిన్‌తో కరచాలనం చేశారు. కలిసి పనిచేద్దామని, అనుకున్న మార్పులు తీసుకొద్దామని చెప్పారు. మన ఆలోచనలను ముందుకు తీసుకెళ్దామని అన్నారు. పశ్చిమ దేశాల శకం ముగిసిందని, ఇకపై చైనా ప్రాబల్యం మొదలుకాబోతోందని జిన్‌పింగ్ పరోక్షంగా వెల్లడించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

### వ్యాపార, వాణిజ్యాలకు అండ

యుద్ధం మొదలైన తర్వాత తమ దేశం నుంచి వెళ్లిపోయిన పశ్చిమ దేశాల వ్యాపార సంస్థల స్థానంలో చైనా వ్యాపారాల సంస్థలను ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నామని పుతిన్ చెప్పారు. నాటో దేశాల ఆంక్షల తర్వాత ఎగుమతులు, దిగుమతుల విషయంలో చైనాపై రష్యా ఆధారపడడం పెరుగుతోంది. ఇరు దేశాల నడుమ ఇంధన వాణిజ్యం అభివృద్ధి చెందుతోంది. చమురు, గ్యాస్, బొగ్గు, విద్యుత్, అణు శక్తి వంటి రంగాల్లో ఇరుదేశాల సంస్థలు కలిసికట్టుగా పనిచేసేలా మద్దతు ఇస్తామని జిన్‌పింగ్, పుతిన్ తెలిపారు. కొత్తగా చైనా–మంగోలియా–రష్యా నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టు చేపడతామని పుతిన్ వెల్లడించారు.

### రష్యాకే మొదటి ప్రాధాన్యం

- ఇతర దేశాలతో సంబంధాలను పణంగా పెట్టయినా సరే రష్యాతో బంధాన్ని కాపాడుకోవాలని చైనా పట్టుదలతో ఉన్నట్లు అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు.
- అమెరికా వ్యతిరేకతే ఏకైక అజెండాగా రెండు దేశాలు ఒక్కటయ్యాయని అభిప్రాయపడుతున్నారు. ఉక్రెయిన్‌కు నాటో దేశాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి.
- ఆర్థిక, ఆయుధ సాయం అందిస్తున్నాయి. ఉక్రెయిన్–రష్యా యుద్ధం మొదలయ్యాక జిన్‌పింగ్ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఒక్కసారి కూడా మాట్లాడలేదు.
- యుద్ధాన్ని ఏనాడూ ఖండించలేదు.
- రష్యాకే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తన వైఖరి ద్వారా తేల్చేశారు.

### అది స్నేహం, సహకారం, శాంతి యాత్ర: చైనా

బీజింగ్: రష్యాలో చైనా అధినేత షీ జిన్‌పింగ్ పర్యటన బుధవారం ముగిసింది. ఈ పర్యటనను స్నేహం, సహకారం, శాంతి యాత్రగా చైనా అభివర్ణించింది. ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధ, ఆర్థిక సాయం అందిస్తుండడాన్ని డ్రాగన్ దేశం తప్పుపట్టింది. ఉక్రెయిన్–రష్యా మధ్య ఉద్రిక్తతలను ఇంకా రెచ్చగొట్టడానికి అమెరికా కుట్రలు పన్నుతోందని ఆరోపించింది. ఉక్రెయిన్–రష్యా యుద్ధం విషయంలో తాము తటస్థంగానే వ్యవహరిస్తామని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ బుధవారం స్పష్టం చేశారు. ఉక్రెయిన్ విషయంలో తమకు ఎలాంటి స్వార్థపూరిత ప్రయోజనాలు లేవన్నారు. ఈ యుద్ధాన్ని లాభం కోసం వాడుకోవాలన్న ఆలోచన ఎంతమాత్రం లేదని తేల్చిచెప్పారు. జిన్‌పింగ్ రష్యా పర్యటనపై ప్రపంచవ్యాప్తంగా పూర్తి సానుకూల స్పందన వ్యక్తమైందని వెన్‌బిన్ హర్షం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్–రష్యా దేశాల నడుమ శాంతి చర్చల కోసం తాము చొరవ చూపుతున్నామని వివరించారు. ఇదిలా ఉండగా, జిన్‌పింగ్ రష్యా పర్యటన వల్ల తక్షణ ఫలితమేమీ కనిపించలేదు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా వెనక్కి తగ్గడం లేదు. శాంతి ప్రణాళికతో రష్యాకు వచ్చానని జిన్‌పింగ్ చెప్పిన సంగతి తెలిసిందే.

### బిల్కిస్ కేసు విచారణకు ప్రత్యేక ధర్మాసనం

న్యూఢిల్లీ: గోధ్రా అల్లర్ల బాధితురాలు బిల్కిస్ బానో కేసులో దోషులుగా తేలి జీవితఖైదు అనుభవిస్తున్న 11 మందిని ముందస్తుగా విడుదలచేసిన అంశాన్ని విచారించేందుకు ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటుచేస్తామని సర్వోన్నత న్యాయస్థానం మరోమారు స్పష్టంచేసింది. బాధితురాలిని గ్యాంగ్‌రేప్ చేసి ఆమె కుటుంబసభ్యులు ఏడుగురిని హత్యచేసిన దోషులకు వర్తింపజేసిన రెమిషన్(ముందస్తు విడుదల)ను వ్యతిరేకిస్తూ బిల్కిస్ తరఫున శోభా గుప్తా సుప్రీంకోర్టులో బుధవారం కేసును వాదించారు. ఈ కేసును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దివాలాల ధర్మాసనం విచారించింది. ' ఈ అంశాన్ని విచారించేందుకు ప్రత్యేకంగా బెంచ్‌ను ఏర్పాటుచేస్తాం' అని సీజేఐ చంద్రచూడ్ గుప్తాకు హామీ ఇచ్చారు. ఈ కేసును వీలైనంత త్వరగా విచారించాలని ఫిబ్రవరి ఏడో తేదీనే బిల్కిస్ న్యాయవాది కోర్టును కోరగా అప్పటి నుంచీ ఈ కేసు కనీసం విచారణకు నోచుకోలేదు. ఫిబ్రవరి 24వ తేదీన విచారణకు వచ్చినా అదే బెంచ్‌లోని జడ్జీలు అనాయాస మరణానికి సంబంధించిన వేరే కేసును విచారించే ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో సభ్యులుగా ఉండటంతో ఈ విచారణ వీలుకాలేదు. యావజ్జీవ ఖైదీలను ముందస్తుగా విడుదల చేయడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని గుజరాత్ రాష్ట్ర సర్కార్ చెప్పడంతో అందుకు అనుమతిస్తూ కోర్టు సమ్మతి తెలపడంతో ఆ ఖైదీలు గత ఏడాది విడుదలయ్యారు.

# మళ్లీ హైకమిషన్ వద్ద ఉద్రిక్తత

**ఖలిస్తాన్ అనుకూల, భారత వ్యతిరేక నినాదాలు చేసిన వేర్పాటువాదులు • అప్రమత్తతతో దాడి యత్నాన్ని అడ్డుకున్న లండన్ పోలీసులు**

లండన్: ఖలిస్తానీ మద్దతుదారుల దాడితో ఘటనకు కేంద్ర బిందువుగా మారిన లండన్‌లోని భారతీయ హైకమిషన్ వద్ద మళ్లీ ఉద్రిక్తత నెలకొంది. ఆదివారం భారతీయ హైకమిషన్‌పై దాడికి తెగబడిన ఘటన మరువకముందే మళ్లీ దాదాపు 2,000 మందితో కూడిన ఆ వేర్పాటువాద మూక అదే భవంతి సమీపానికి చేరుకుంది. ఖలిస్తాన్ అనుకూల, భారత వ్యతిరేక నినాదాలు చేసిన వేర్పాటువాదులు వెంట తెచ్చుకున్న రంగులు వెదజల్లే చిన్న బాణసంచా, నీళ్ల సీసాలు, కొన్ని వస్తువులను హైకమిషన్ భవంతిపైకి విసిరారు. ఆదివారం నాటి దుశ్చర్యతో అప్రమత్తమైన లండన్ పాలనా యంత్రాంగం భారీ సంఖ్యలో పోలీసులను అంతకుముందే అక్కడ మొహరించడంతో వేర్పాటువాదుల భారీ దాడి యత్నాలు ఆచరణలో విఫలమయ్యాయి. అమృత్‌పాల్ అరెస్ట్‌కు కంకణం కట్టుకున్న పంజాబ్ పోలీసుల చర్యను నిరసిస్తూ ఫెడరేషన్ ఆఫ్ సిఖ్ ఆర్గనైజేషన్స్, సిఖ్ యూత్ జతేబందియా వంటి సంస్థలు ఉమ్మడిగా 'నేషనల్ ప్రొటెస్ట్' పేరిట బ్యానర్లు సిద్ధంచేసి భారతీయ హైకమిషన్ వద్ద దాడికి కుట్ర పన్నినట్లు మీడియాలో వార్తలొచ్చాయి. నిరసనకారులను అదుపులోకి తీసుకుని తరలించేందుకు దాదాపు 20 బస్సులను పోలీసులు తెప్పించారు. అప్రమత్తతలో భాగంగా కొందరు పోలీసులను అక్కడి వీధుల్లో కవాతుచేశారు. ఖలిస్తానీవాదులు అక్కడికి రాగానే పంజాబ్‌లో మానవహక్కుల ఉల్లంఘన కొనసాగుతోందని ఇంగ్లిష్, పంజాబీ భాషల్లో మైకుల్లో భారత వ్యతిరేక ప్రసంగాలు ఇచ్చారు. నిరసనకారుల్లో చిన్నారులు, మహిళలూ ఉండటం గమనార్హం. భారత్ తమను వేర్పాటువాదులని, పాక్ ఐఎస్‌ఐతో కుమ్మక్కయ్యారని ప్రకటించడాన్ని తప్పుబడుతున్నారు.



భారత్ హైకమిషన్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగిన ఖలిస్తానీ మద్దతుదారులు

### నిరసనగా పోలీసులే బారికేడ్లు తొలగించారు

న్యూఢిల్లీ: లండన్‌లో భారత హైకమిషన్‌కు సరైన భద్రత కల్పించడంలో విఫలమైన బ్రిటిష్ ప్రభుత్వానికి భారత ప్రభుత్వం తన నిరసనను మరోలా తెలియజేసింది. ఖలిస్తానీ మద్దతుదారులు లండన్‌లోని భారత హైకమిషన్ ముందున్న బారికేడ్లు తొలగించి భవనం పైన ఉన్న త్రివర్ణ పతాకాన్ని కిందకు లాగి ఖలిస్తానీ జెండాలు రెపరెపలాడించడం తెల్సిందే. ఈ దుశ్చర్యను వెంటనే తీవ్రంగా ఖండించిన భారత సర్కార్.. ఖలీస్తానీవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. భారత ప్రభుత్వ నిరసనకు కొనసాగింపుగా ఢిల్లీ పోలీసులు ఢిల్లీలోని బ్రిటిష్ హైకమిషన్ కార్యాలయం ముందు ఉన్న బారికేడ్లు అన్నింటినీ పక్కన పడేశారు. ఇవి పాదచారుల బాటకు అడ్డుగా ఉన్నాయని పోలీసులు చెబుతున్నా.. నిజానికి ఇది బ్రిటన్ వైఖరికి సరైన సమాధానంగా తీసుకున్న చర్యగా కొందరు అభివర్ణించడం గమనార్హం. బారికేడ్లు తొలగించిన విషయాన్ని బ్రిటిష్ హైకమిషన్ అధికార ప్రతినిధి వద్ద మీడియా ప్రస్తావించగా..' భద్రతకు సంబంధించిన అంశాలపై మేం స్పందించబోం' అని ఆయన అన్నారు.

### అమృత్‌పాల్ సింగ్ విదేశీ నిధులపై పోలీసుల ఆరా

**భార్య కిరణ్‌దీప్ కౌర్‌ను ప్రశ్నించిన పంజాబ్ పోలీసులు**

అమృత్‌సర్: ఖలీస్తాన్ వేర్పాటువాద నాయకుడు అమృత్‌పాల్ సింగ్ పోలీసుల కన్నుగప్పి తప్పించుకొని తిరుగుతున్న నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యుల్ని పంజాబ్ పోలీసులు ప్రశ్నించారు. అమృత్‌పాల్ సింగ్ భార్య కిరణ్‌దీప్ కౌర్, ఆయన తండ్రి తర్సేమ్ సింగ్, తల్లిని బుధవారం పోలీసులు విచారించారు. అమృత్‌పాల్‌కు అందుతున్న విదేశీ నిధులపై ప్రశ్నించినట్టుగా తెలుస్తోంది.

**ఎవరీ కిరణ్ దీప్ ?**

యూకేలో ఎన్నారై అయిన కిరణ్ దీప్ కౌర్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో అమృత్‌పాల్ పెళ్లి చేసుకున్నారు. పెళ్లయిన వెంటనే పంజాబ్‌కు వచ్చిన కిరణ్‌దీప్ ప్రస్తుతం తమ పూర్వీకుల గ్రామం జల్లూపూర్ ఖేదాలో ఉంటున్నారు. పంజాబ్‌లోని జలంధర్ ఆమె స్వగ్రామం. వారిస్ పంజాబ్ దే వారిస్ సంస్థ బాధ్యతల్ని అమృత్‌పాల్ తీసుకున్న కొద్ది నెలలకే కిరణ్‌దీప్‌ను వివాహం చేసుకున్నారు. రివర్స్ మైగ్రేషన్ జరగాలని, వివిధ దేశాల్లో భారతీయుల్ని తిరిగి మాతృదేశానికి రప్పించడమే తన ధ్యేయమని, అందుకే ఎన్నారైని పెళ్లి చేసుకున్నానని అమృత్‌పాల్ అప్పట్లో చెప్పారు. అమృత్‌పాల్ సింగ్, కిరణ్‌దీప్, ఇతర కుటుంబ సభ్యుల బ్యాంక్ అకౌంట్లను పోలీసులు ఇప్పుడు తరచి చూస్తున్నారు. ఆ అకౌంట్లలోకి డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయో ఆరా తీస్తున్నారు.



అమృత్‌పాల్‌కు విదేశాల నుంచి వివిధ మార్గాల ద్వారా దాదాపుగా రూ.35 కోట్లు అందినట్టుగా ఆయన అనుచరుడు దిల్‌జిత్ కల్సిని విచారించగా వెల్లడైంది. ఆ డబ్బులతోనే తనకు, తన అనుచరులకు అమృత్‌పాల్ వాహనాలు కొన్నాడు.

**రూ.35 కోట్ల విదేశీ నిధులు**

అక్రమ ఆయుధాలతో పాటు 35 బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు కొన్నారు. పాకిస్తాన్ ఐఎస్ఐతో కూడా అమృత్‌పాల్‌కు సంబంధాలున్నట్టు పోలీసులు చెబుతున్నారు.



బుధవారం రాష్ట్రపతి భవన్‌లో కేంద్ర మాజీ మంత్రి ఎస్.ఎం.కృష్ణకు పద్మవిభూషణ్ పురస్కారం, గాయని సుమన్ కల్యాణ్‌పూర్‌కు పద్మభూషణ్ పురస్కారం ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

### 6జీ.. భారత ఆత్మవిశ్వాస ప్రతీక: మోదీ

న్యూఢిల్లీ: దేశంలో 5జీ సాంకేతికత అందుబాటులోకి వచ్చిన కేవలం ఆరు నెలల్లోనే 6జీ టెక్నాలజీపై పరిశోధనలు చేసే స్థాయికి భారత్ ఎదిగిందని ప్రధాని మోదీ ప్రకటించారు. ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ సంఘం(ఐటీయూ) ప్రాంతీయ కార్యాలయం, ఇన్నోవేషన్ సెంటర్‌ను బుధవారం ఢిల్లీలో ప్రారంభించిన సందర్భంగా ప్రధాని ప్రసంగించారు. ' దేశంలోకి 5జీ సేవలు మొదలైన 6 నెలల్లోనే 6జీ టెక్నాలజీపై పరిశోధన మొదలవుతోంది. ఇది భారత ఆత్మవిశ్వాసానికి దర్పణం పడుతోంది. 4జీ కంటే ముందు టెలికం సాంకేతికతలో భారత్ కేవలం ఒక యూజర్‌గా ఉండేది. కానీ ఇప్పుడు భారీ టెలికం టెక్నాలజీని ఎగుమతి చేసే దిశగా అడుగులు వేస్తోంది. దేశీయంగా అభివృద్ధిని సాధించిన టెక్నాలజీ వైపు ప్రపంచం దృష్టి సారించింది.

**ఇది భారత సాంకేతిక దశాబ్దం**

'సమ్మిళిత సాంకేతికత వల్లే డిజిటల్ చెల్లింపులు, ప్రత్యక్ష నగదు బదిలీ, జన్‌ధన్, ఆధార్, బ్రాడ్‌బ్యాండ్ సేవలు సాధ్యమయ్యాయి. టెలికం టెక్నాలజీ భారత్‌లో కేవలం శక్తి మాధ్యమం మాత్రమేకాదు సాధికారతకు సోపానం. ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య 85 కోట్లకు పెరిగింది. దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో మొత్తంగా 25 లక్షల కి.మీ.ల ఆప్టికల్ ఫైబర్ వేశాం. త్వరలో వంద 5జీ ల్యాబ్‌లు ఏర్పాటుచేస్తాం. దేశీయ అవసరాల తీర్చేలా 5జీ అప్లికేషన్లను ఇవి అభివృద్ధిచేస్తాయి. దేశంలో 5జీ సేవలు మొదలైన 120 రోజుల్లోనే 125 నగరాలకు విస్తరింపజేశాం. ఈ దశాబ్దం భారత సాంకేతికదశాబ్దం(టెక్‌ఏడ్)' అని మోదీ అభివర్ణించారు.

### అది 'క్లీన్ చిట్' కమిటీ: జైరామ్

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ అక్రమాలపై విచారణ కోసం సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీతో ఎలాంటి ఉపయోగం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తేల్చిచెప్పారు. అది ప్రభుత్వానికి క్లీన్ చిట్ కమిటీగా మాత్రమే తోడ్పడుతుందని అన్నారు. అదానీ విషయంలో అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపే అధికారం చట్టపరంగా నిపుణుల కమిటీకి లేదన్నారు. కేవలం జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)తోనే నిజాలు వెలుగులోకి వస్తాయని తేల్చిచెప్పారు. జైరామ్ బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. దర్యాప్తు సంస్థలను దేశ ప్రయోజనాల కోసమా? వ్యక్తిగత అవసరాల కోసమా? దేని కోసం వాడుకుంటారని ప్రధాని మోదీని ప్రశ్నించారు. 1992లో హర్షద్ మెహతా, 2001లో కేతన్ పరేఖ్ స్కామ్‌లపై విచారణకు జేపీసీ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు అదానీ అక్రమాలపై జేపీసీని నియమించాలని చెప్పారు.

**సభలో రాహుల్ గాంధీని మాట్లాడనివ్వండి**

లోక్‌సభలో మాట్లాడేందుకు, వివరణ ఇచ్చేందుకు రాహుల్‌కు అవకాశం కల్పించాలని స్పీకర్‌కు జైరామ్ రమేశ్ విజ్ఞప్తి చేశారు. రూల్ 357 కింద సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలంటూ స్పీకర్‌కు రాహుల్ లేఖ రాశారని, దానిపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది కాలమే సమాధానం చెబుతుందన్నారు.

### అప్రమత్తత ముఖ్యం

**కోవిడ్ పరిస్థితిపై సమీక్షా సమావేశంలో ప్రధాని సూచన**




న్యూఢిల్లీ: గత రెండు వారాలుగా కరోనా పాజిటివ్, ఇన్‌ఫ్లూయెంజా కేసుల సంఖ్య మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో కోవిడ్ పట్ల అప్రమత్తత అత్యవసరమని ప్రధాని మోదీ సూచించారు. కోవిడ్ తాజా పరిస్థితిపై ప్రధాని మోదీ బుధవారం ఢిల్లీలో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. 'కోవిడ్ ఇంకా ముగిసిపోలేదు. జన్యుక్రమ విశ్లేషణ కొనసాగించండి. కోవిడ్ నిబంధనావళిని తప్పక పాటించండి. తీవ్ర శ్వాస సంబంధ కేసులు, ఇన్‌ఫ్లూయెంజా, సార్స్–కోవ్2 పరీక్షలు పెంచండి' అని ఉన్నతాధికారులకు సూచించారు. ఆస్పత్రుల్లో పడకలు, మానవ వనరుల అందుబాటు తదితర సన్నద్ధతలనూ మోదీ సమీక్షించారు. 2020లో జనతా కర్ఫ్యూ పెట్టిన సరిగ్గా మూడేళ్ల తర్వాత అదేరోజు ప్రధాని కోవిడ్ సమీక్షా సమావేశం నిర్వహించడం గమనార్హం. ఎక్కువవుతున్న కోవిడ్ కేసులు, కోవిడ్ మళ్లీ విజృంభిస్తే ప్రజారోగ్య వ్యవస్థ ఏ మేరకు సంసిద్ధంగా ఉందనే వివరాలను ఆయన ఉన్నతాధికారులను అడిగి తెల్సుకున్నారు. ఈ సమావేశంలో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్ దేశంలో కోవిడ్ తాజా పరిస్థితిపై మోదీకి ఒక ప్రజెంటేషన్ చూపించారు. బుధవారం కేంద్ర ఆరోగ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం గత 24 గంటల్లో కొత్తగా 1,134 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

### బాణసంచా పేలి 9 మంది మృతి

సాక్షి, చెన్నై: తమిళనాడులోని కాంచీపురం సమీపంలోని కురివి మలైలో బుధవారం బాణసంచా పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళలుసహా తొమ్మిది మంది మరణించారు. గాయపడిన 12 మందిని ఆస్పత్రిలో చేర్పించారు. మృతుల కుటుంబాలకు తలా రూ.3 లక్షల ఆర్థికసాయం రాష్ట్ర సీఎం స్టాలిన్ ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి తలా రూ.1 లక్ష సాయం అందిస్తామన్నారు. కర్మాగారం నిర్వాహకుడిని అరెస్టు చేశారు.

# ఉక్రెయిన్‌పై మళ్లీ నిప్పుల వాన



జపొరిజాజియాలో రష్యా క్షిపణి దాడిలో మంటలంటుకున్న బహుళ అంతస్తుల భవనం

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా సైన్యం మళ్లీ విరుచుకుపడింది. బుధవారం ఉదయం తెల్లవారుజామున క్షిపణులు, డ్రోన్లతో సాధారణ నివాస ప్రాంతాలపై దాడికి దిగింది. ఉక్రెయిన్ నుంచి జపాన్ ప్రధానమంత్రి ఫ్యుమియో కిషిదా, రష్యా నుంచి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ వెళ్లిపోయిన తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే ఈ దాడులు జరగడం గమనార్హం. జపొరిజాజియా నగరంలో తొమ్మిది అంతస్తుల అపార్టుమెంట్‌పై రష్యా మిస్సైల్ దాడి వీడియో దృశ్యాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోషల్ మీడియాలో షేర్ చేశారు. రాజధాని కీవ్ సమీపంలో విద్యార్థుల వసతి గృహంపై రష్యా సైన్యం దాడి చేయడంతో నలుగురు మృతిచెందారు. 20 మందికిపైగా గాయపడ్డారు. కీవ్‌కు దక్షిణాన ఉన్న రిజీసిచివ్ సిటీలో ఓ ఉన్నత పాఠశాల, రెండు డార్మిటరీలు సైతం పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఓ డార్మిటరీ ఐదో అంతస్తు నుంచి 40 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని వెలికితీశారు. మొత్తం ఎంతమంది చనిపోయారన్నది ఇంకా తెలియరాలేదు. రష్యా 21 డ్రోన్లను ప్రయోగించగా, అందులో తాము 16 డ్రోన్లను కూల్చేశామని ఉక్రెయిన్ సైనిక వర్గాలు వెల్లడించాయి. రష్యా ఒకవైపు శాంతి చర్చలు అంటూనే మరోవైపు భీకర దాడులకు ఆదేశాలకు జారీ చేస్తోందని జెలెన్‌స్కీ మండిపడ్డారు. పౌరుల నివసాలపై రష్యా క్షిపణి దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ రష్యాలో మూడు రోజుల పర్యటన ముగించుకొని బుధవారం స్వదేశానికి తిరిగివచ్చారు. జపాన్ ప్రధాని కిషిదా ఉక్రెయిన్ నుంచి పోలాండ్‌కు చేరుకున్నారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
గురువారం । 23 । మార్చి । 2023



## రియల్ ఎస్టేట్ సంస్థలో ఐటీ సోదాలు

సాక్షి, చెన్నై: అబు బక్కర్ ప్యారిస్, రియల్ ఎస్టేట్ సంస్థతో పాటు వాటి అనుబంధ సంస్థల్లో ఆదాయ పన్ను అధికారులు బుధవారం సోదాల్లో చేశారు. చెన్నై, బెంగళూరు, ముంబైలో ఈ సంస్థకు చెందిన అనేక కార్యాలయాలు ఉన్నాయి. గిండిలో ఆ సంస్థకు చెందిన కార్యాలయంలో లెక్కలోకి రాని నల్ల ధనం భారీగా బయట పడినట్లు సమాచారం. అలాగే ఈ సంస్థ విదేశాలకు నగదు బదిలీల సమయంలో భారీగా పన్ను ఎగవేతకు పాల్పడినట్లు ఐటీ విచారణలో తేలింది. ఈమేరకు పలు రికార్డులు, పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

### న్యూస్‌రీల్

## అమ్మా క్యాంటీన్‌లతో రూ.95 కోట్లు నష్టం

– కార్పొరేషన్ సర్వే వెల్లడి



కొరుక్కుపేట: నిరుపేద ప్రజల ఆకలి తీర్చే లక్ష్యంతో ఏర్పాటైన అమ్మా క్యాంటీన్‌లు ప్రస్తుతం భారీ నష్టాలను చవిచూస్తున్నాయి. చెన్నై కార్పొరేషన్ నిర్వహించిన తాజా సర్వేలో రూ.95 కోట్లు నష్టం వాటిల్లినట్లు తెలిసింది. వివరాలు.. దివంగత ముఖ్యమంత్రి జయలలిత హయాంలో అమ్మా క్యాంటీన్‌లను ప్రారంభించిన విషయం తెలిసిందే. రూపాయికే ఇండ్లీ, మూడు రూపాయలకే చపాతీ అంటూ పెద్దఎత్తున ఆహార పదార్థాలను ఇక్కడ తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితిలో చెన్నైలోని అమ్మా క్యాంటీన్‌లకు ప్రస్తుతం కస్టమర్ల సంఖ్య తగ్గడంతో ఆదాయం కూడా బాగా పడిపోయింది. చెన్నై కార్పొరేషన్ తరఫున ఆడిట్ నిర్వహించారు. కొన్నేళ్లుగా ఆదాయం కంటే నష్టాలే ఎక్కువయ్యాయని తెలిసింది. ఈ క్యాంటీన్లు 2014–15 లో రూ.40 కోట్లు నుంచి రూ.51 కోట్ల నష్టాన్ని చవిచూశాయి. ఈ పరిస్థితుల్లో 2021–22లో రూ.95 కోట్లు నష్టం వచ్చినట్లు తెలిసింది. కొన్ని చోట్ల దుకాణాదారులు పెద్దమొత్తంలో సరుకుల కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఇక ఏళ్ల తరబడి నష్టాలు పెరుగుతుండడంతో వీటి కొనసాగింపుపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

# బతుకు ఛిద్రం

పొట్టకూటి కోసం కూలికి వెళ్లిన బతుకులు ఛిద్రమయ్యాయి. పనుల్లో నిమగ్నమైన సమయంలో బాణసంచా కర్మాగారంలో చోటు చేసుకున్న పేలుడు కారణంగా తొమ్మిది మంది అసువులుబాశారు. వారి శరీరాలు గుర్తుపట్టలేనంతగా ముక్కలయ్యాయి. మరో 17 మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘోర ప్రమాదం బుధవారం కాంచీపురం సమీపంలో చోటు చేసుకుంది.

- కురివిమలైలో బాణసంచా పేలుడు
- తొమ్మిది మంది మృతి
- 17 మందికి గాయాలు
- ఆరుగురి పరిస్థితి విషమం
- మృతుల కుటుంబాలకు తలా రూ.3 లక్షలు పరిహారం ప్రకటించిన సీఎం స్టాలిన్



పేలుడు కారణంగా నామరూపాలు లేకుండా పోయిన బాణసంచా ఫ్యాక్టరీ



సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు అధికారులు

సాక్షి, చెన్నై: కాంచీపురం సమీపంలోని కురివిమలైలో బాణసంచా ఫ్యాక్టరీలో బుధవారం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కూలి పనుల నిమిత్తం వెళ్లిన తొమ్మిది మంది మరణించారు. 17 మంది గాయాలతో చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు.. కాంచీపురానికి పది కి.మీ దూరంలో కురివిమలై గ్రామం ఉంది. ఇక్కడ నరేంద్రన్ అనే వ్యక్తి అన్ని రకాల లైసెన్స్‌లు పొంది బాణసంచా పరిశ్రమను గత కొన్నేళ్లుగా నిర్వహిస్తూ వస్తున్నాడు. బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఇక్కడ 30 మందికి పైగా కార్మికులు పనుల్లో ఉండగా ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. అక్కడున్న కార్మికులు ఆందోళనతో బయటకు పరుగులు తీసే ప్రయత్నం చేశారు. అప్పటికే అనేక గదులు, గోడౌన్ నేలమట్టం అయ్యింది. ఈ శబ్దం విని కురివిమలై పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున ఘటనా స్థలానికి చేరుకున్నారు. దట్టమైన పొగ, మంటలు చెలరేగడంతో లోనికి వెళ్లేందుకు ఎవరూ సాహసించ లేదు. సమాచారం అందుకున్న కాంచీపురం, ఉత్తర మేరు అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.



ఘటనా స్థలంలో గుమికూడిన జనం

### మృతుల్లో ఆరుగురి గుర్తింపు

బాణసంచా పేలుడు ఘటనలో మృతి చెందిన ఆరుగురిని పోలీసులు గుర్తించారు. వీరిలో భూపతి (57), మురుగన్ (40), శశికళ (35), దేవి (32), సుదర్శన్ (31), విద్య (30) ఉన్నట్లు ప్రకటించారు. మరో ముగ్గురి మృతదేహాలు గుర్తించలేని స్థితిలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాద సమాచారంతో సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన సానుభూతి తెలియచేశారు. తలా రూ.3 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.



మృతుల వివరాలు వెల్లడిస్తున్న కాంచీపురం కలెక్టర్ ఆర్తీ

### మృతుల్లో ముగ్గురు మహిళలు..

అగ్నిమాపక సిబ్బంది గంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. భవన శిథిలాల కింద పడి ఉన్న వారిని, గాయాలతో ఆర్తనాదాలు చేస్తున్న వారిని ఆగమేఘాలపై కాంచీపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనాస్థలంలోనే ముగ్గురు మహిళలతో పాటు ఆరుగురు దుర్మరణం చెందారు. వీరి మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. ఆసుపత్రిలో మరో ముగ్గురు మృతి చెందారు. 17 మంది గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఇందులో ఐదుగురు చెంగల్పట్టు, చెన్నై కీల్పాకం ఆసుపత్రుల్లోనూ, 13 మంది కాంచీపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో ఆరుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. మృతుల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నం అయ్యారు. కాంచీపురం కలెక్టర్ ఆర్తీ, ఎస్పీ సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారిస్తున్నారు. డీఎస్పీ పగలవన్ నేతృత్వంలోని బృందం ఆ పరిశ్రమ నిర్వాహకుడు నరేంద్రన్‌ను అరెస్టు చేసి ప్రమాదానికి గల కారణాలపై ప్రశ్నిస్తున్నారు. మంత్రి టి. అన్బరసన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి చేరుకుని గాయపడ్డ వారిని పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో కాంచీపురం ఆస్పత్రి దద్దరిల్లింది.

## ఘనంగా కళాసుధ విశిష్ట ఉగాది పురస్కారం



అవార్డు అందుకుంటున్న డీవీవీ దానయ్య. చిత్రంలో నరసింహన్, అలీ, కల్యాణ్‌రామ్

తమిళసినిమా: శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ విశిష్ట ఉగాది పురస్కారాల ప్రదానం బుధవారం చెన్నైలో జరిగింది. మ్యూజిక్ అకాడమీలో జరిగిన ఈ వేడుకకు ముఖ్య, విశిష్ట అతిథులుగా మాజీ గవర్నర్ నరసింహన్, గాయని పి.సుశీల, నటుడు, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుడు డాక్టర్ అలీ హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ స్వాగతోపన్యాసం చేశారు. ఇందులో ఉత్తమ నిర్మాత అవార్డును ఆర్ఆర్ఆర్ చిత్రానికి గాను.. డీవీవీ దానయ్య అందుకున్నారు. ఉత్తమ నటుడు అవార్డును బింబిసార చిత్రానికి గాను నందమూరి కల్యాణ్‌రామ్‌కు ప్రదానం చేశారు. లతా మంగేష్కర్ పురస్కారం గాయని ఎంఎం శ్రీలేఖకు అందజేశారు. నటి ఈశ్వరరావుకు బాపు బొమ్మ పురస్కారం, దర్శకుడు హను రాఘవపూడి బాపు–రమణ పురస్కారం ప్రదానం చేశారు. అలాగే మహిళ రత్న అవార్డును, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును, ఉత్తమ నటి, చిత్రం, రచయిత తదితర అవార్డులను ఈ వేడుకలో ప్రదానం చేశారు.

# పార్టీ ఔన్నత్యాన్ని కాపాడాలి

పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా నాయకులు, కార్యకర్తలు వ్యవహరించ కూడదని డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ హెచ్చరించారు. అధిష్టానాన్ని ధిక్కరించే విధంగా ఇటీవల కొన్ని ఘటనలు చోటు చేసుకోవడంపై విచారం వ్యక్తం చేశారు. కాగా ఈ ఏడాది పొడవునా డీఎంకే దివంగత నేత కరుణానిధి శత జయంతి ఉత్సవాలు నిర్వహించాలని జిల్లా కార్యదర్శుల సమావేశంలో తీర్మానించారు.

- చెడ్డ పేరు తీసుకు రావొద్దు
- డీఎంకే శ్రేణులకు స్టాలిన్ క్లాస్
- అధిష్టానాన్ని ధిక్కరించే ఘటనలు విచారకరమని వ్యాఖ్య
- ఏడాది పొడవున కరుణానిధి శత జయంతి ఉత్సవాలు
- జూన్ 3న తిరువారూర్‌లో భారీ బహిరంగ సభ



పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశంలో ప్రసంగిస్తున్న స్టాలిన్

సాక్షి, చెన్నై: డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలోని కలైంజ్ఞర్ అరంగంలో బుధవారం ఆ పార్టీ జిల్లాల కార్యదర్శులు, ముఖ్య నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీకి పార్టీ ప్రధాన కార్యదర్శి దురై మురుగన్, ముఖ్య నేతలు నెహ్రూ, టీఆర్‌బాలు, ఐ పెరియ స్వామి తదితరులు హాజరయ్యారు. డీఎంకే పార్టీ పరంగా ఉన్న అన్ని జిల్లాల కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టాలిన్ కార్యదర్శులను ఉద్దేశించి ప్రసంగించారు. కొన్ని చోట్ల నాయకులు, కార్యకర్తలు వ్యవహరిస్తున్న తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది.

### నేతలకు క్లాస్..

కొన్ని చోట్ల నాయకులు, కింది స్థాయి కేడర్ వ్యవహరిస్తున్న తీరు తీవ్ర ఆవేదన కలిగిస్తోందని స్టాలిన్ అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు అసహించుకునే విధంగా వ్యవహరించ వద్దని హెచ్చరించారు. కేడర్‌ను కట్టడి చేయాల్సిన బాధ్యత జిల్లాల కార్యదర్శులపై ఉందన్నారు. పార్టీ అధిష్టానాన్ని ధిక్కరించే విధంగా కొన్ని ఘటనలు జరుగుతున్నాయని పేర్కొంటూ, పరోక్షంగా తిరుచ్చిలో జరిగిన పరిణామాలను గుర్తు చేశారు. ప్రజలు నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారికి సేవ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతే గానీ, పార్టీకిప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వేదికలు, సభలలో మాట్లాడే టప్పుడు జాగ్రత్తలు పాటించాలని, అనాగరిక చర్యలు, అనాగరిక వ్యాఖ్యలు వద్దే వద్దంటూ నేతలు స్పష్టం చేసినట్లు డీఎంకే వర్గాలు పేర్కొన్నాయి.

### లోక్‌సభ ఎన్నికలే లక్ష్యం..

పార్టీ నాయకులు అందరూ లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు. బూత్‌కమిటీల ఏర్పాటు వేగవంతం చేయాలని సూచించారు. త్వరలో నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లను రంగంలోకి దించనున్నట్లు పేర్కొన్నారు. 100 మంది ఓటర్లకు ఒకరు చొప్పున పార్టీ స్థానిక నాయకులను నియమించి, వారికి ప్రభుత్వ ఫలాలు అందే విధంగా, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే రీతిలో కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం రెండేళ్ల పాలన, తాజా బడ్జెట్ వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లే రీతిలో సభలు, సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచి కార్యక్రమాలు విస్తృతం చేయాలని ఆదేశించారు. అలాగే పార్టీ బలోపేతం లక్ష్యంగా మరో కోటి మందిని కార్యకర్తలుగా చేర్చే కార్యక్రమాన్ని విస్తృతం చేయాలన్నారు.

### వాడవాడలా కరుణ శతజయంతి సభలు..

దివంగత డీఎంకే అధినేత కరుణానిధి శతజయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా వాడవాడల్లో ఏడాది పొడవున నిర్వహించాలని ఈ సమావేశంలో తీర్మానించారు. కరుణానిధి శత జయంతి ఉత్సవాలను కేడర్ తమ ఇంటి వేడుకగా, ప్రజా ఉత్సవంగా నిర్వహించాలని సూచించారు. జూన్ 3వ తేదీన శతజయంతి ఉత్సవాల బహిరంగ సభ తిరువారూర్ వేదికగా జరగనున్నట్లు ప్రకటించారు. ఇందులో జాతీయస్థాయి నేతలు పాల్గొంటారని వివరించారు. ఇక్కడే కరుణానిధి స్మారంగా భారీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

## ప్రధాన కార్యదర్శి పదవికి నేనూ రెడీ

- కోర్టులో పన్నీరు సెల్వం స్పష్టీకరణ
- ఉదయం నుంచి సాయంత్రం వరకు వాదనలు
- తీర్పు రేపు వెలువరించే అవకాశం



పన్నీరు సెల్వం

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేయడానికి తానూ సిద్ధంగానే ఉన్నానని ఆ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం స్పష్టం చేశారు. కోర్టులో విచారణ సమయంలో ఆయన తరపు న్యాయవాదులు బుధవారం వాదనలు వినిపించారు. వివరాలు.. అన్నాడీఎంకే తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళనిస్వామి శిబిరం నిర్వహించిన సర్వసభ్య సమావేశ తీర్మానాలకు వ్యతిరేకంగా ఆ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం, నేతలు వైద్యలింగం, జేసీడీ ప్రభాకర్, మనోజ్ పాండియన్ దాఖలు చేసిన పిటిషన్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారణ సాగింది. తొలుత పన్నీరు సెల్వం తరపున వాదనలు కోర్టు ముందు ఉంచారు. అన్నాడీఎంకే నిబంధనలన్నీ ఒకరి స్వలాభం కోసం మార్చేశారని కోర్టుకు వివరంచారు. ఇవన్నీ పళని స్వామికి అనుకూలంగానే ఉన్నాయని, ఈ నిబంధనల్లో మార్పులు చేస్తే అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేయడానికి తానూ సిద్ధంగానే ఉన్నట్టు పన్నీరు సెల్వం కోర్టు ముందు తన న్యాయవాదుల ద్వారా స్పష్టం చేశారు. ఈ ఎన్నికలు నిబంధనలకు అనుగుణంగా జరగాలని, అన్నాడీఎంకేలోని కేడర్ ఓటర్ల జాబితాను ప్రకటించాలని కోర్టును కోరారు. అనంతరం వైద్యలింగం, మనోజ్ పాండియన్, జేసీడీ ప్రభాకర్ తరఫున వాదనలు కోర్టుకు చేరాయి.

### మార్గం చూపిన సుప్రీం కోర్టు

చివరగా పళని స్వామి తరపున వాదనలు కోర్టుకు చేరాయి. అన్నాడీఎంకే నిబంధనలను ఒక వ్యక్తి మార్చలేదని, పార్టీలోని అందరూ కలిసి కట్టుగా తీసుకున్న నిర్ణయం అని వివరించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలు ప్రధాన కార్యదర్శి ఎన్నికలకు మార్గాన్ని సుగమం చేశాయని కోర్టు దృష్టికి తెచ్చారు. పార్టీతో సంబంధం లేని వ్యక్తులు ఎన్నికలలో పోటీ చేయకూడదనే ఉద్దేశంతోనూ నిబంధనలలో మార్పులు చేశామని వివరించారు. పన్నీరు సెల్వం మరో పార్టీని నడుపుతున్నట్లుగా, పార్టీ గతంలో నియమించిన జిల్లాల కార్యదర్శులను తొలగించి, కొత్త వాళ్లను నియమిస్తూ వస్తున్నారని, ఇది పార్టీ నిబంధనలకు విరుద్ధం కాదా..? అని ప్రశ్నించారు. పార్టీ నిబంధనలలో మార్పు చట్ట విరుద్ధం కాదని వాదించారు. గురువారం కూడా వాదనలు కొనసాగనున్నాయి. శుక్రవారం కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందో అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొని ఉంది.

## మిమిక్రీ ఆర్టిస్ట్ కోవై గుణ కన్నుమూత



తమిళసినిమా: తమిళ చిత్ర పరిశ్రమలో వరుస మరణాలు అభిమానులను శోకసంద్రంలో ముంచేస్తున్నాయి. తాజాగా మిమిక్రీ ఆర్టిస్ట్ కోవై గుణ (54) మృతి వారిని దిగ్భ్రాంతికి గురి చేసింది. కలక్కపోవదు యారు కార్యక్రమంలో తొలి టైటిల్ విన్నర్ కోవై గుణ. ఆ తరువాతు పలు వేదికలపై తన మిమిక్రీతో ప్రేక్షకులను అలరిస్తూ వచ్చారు. తన కామెడీతో బుల్లితెర ప్రేక్షకులను అలరించిన అయన సొంత ఊరు కోవై జిల్లా, శరవణంపట్టి సమీపంలోని వినాయకపురం గ్రామం. ఈయనకు భార్య,ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కూతుళ్లకు పెళ్లి చేశారు.కాగా ఇటీవల కిడ్నీ సమస్యకు గురైన కోవై గుణ కోవై ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యచికిత్స పొందుతూ వచ్చారు. అయితే వైద్యం ఫలించక బుధవారం తుదిశ్వాస విడిశారు.

# తెలుగు లోగిళ్లలో.. శోభకృత్ సంబరాలు



కన్యకాపరమేశ్వరిలో పుష్పయాగం



సౌత్ ఇండియా వైశ్య సంఘంలో ఉగాది వేడుకలు



పెరంబూరులో..



ఆంధ్ర కళా స్రవంతి ఆధ్వర్యంలో..



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు



సారె తీసుకుని వస్తున్న ఏజే శేఖర్‌రెడ్డి తదితరులు



తెలుగు బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో..

సాక్షి,చెన్నై : చెన్నై నగరంలో నివసిస్తున్న తెలుగు ప్రజలు ఉగాది వేడుకలను బుధవారం పెద్దఎత్తున నిర్వహించారు. వివిధ సంఘాల కూడా తెలుగు సంస్కృతి, సంప్రదాయం ఉట్టి పడే విధంగా కార్యక్రమాలు నిర్వహించాయి.

**టీబీఎం నేతృత్వంలో..:** తెలుగు బ్రాహ్మణ మహా సభ (టీబీఎం) అధ్యక్షులు కల్య రఘుకుమార్ అధ్యక్షతన టి.నగర్‌లోని ఇన్ఫోసిస్ హాలు వేదికగా ఉగాది వేడుకలు చేపట్టారు. ముఖ్యఅతిథిగా సీబీఐ–చెన్నై డీఎస్పీ టి. సత్యమూర్తి పాల్గొని.. వేదపండితులు బ్రహ్మశ్రీ సీతారామ శర్మ, ఫ్లూట్ కళాకారులు టి. శ్రీధర్, అడ్వకేట్ కె.ప్రదీప్‌కు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు.

**శ్రీ ఆంధ్ర కళాస్రవంతి నేతృత్వంలో..:** శ్రీ ఆంధ్ర కళా స్రవంతి అధ్యక్షులు జీఎం నాయుడు అధ్యక్షతన కొరట్టూరు అగ్రహారంలోని కోదండ రామాలయం ఆవరణలో వైభవంగా వేడుకలు నిర్వహించారు. దక్షిణ భారత రిపబ్లిక్ ఆఫ్ సీషెల్స్ కాన్సుల్ జనరల్ ఎమ్. శేషసాయితోపాటు గుల్లపల్లి సుజాత , డాక్టర్ విస్తాలి శంకరరావు, డాక్టర్ ముత్తు ఎతిరాజులు వంటి తెలుగు ప్రముఖులు హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితర దాతల సౌజన్యంతో విద్యార్థులు, అంధులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు.

**ఆస్కాలో..:** ఆంధ్రాసోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్(ఆస్కా) అధ్యక్షుడు కె. సుబ్బారెడ్డి నేతృత్వంలో ఆస్కా ఆవరణలో వేడుకలు జరిగాయి. ఐఏఎస్ అధికారి గోవింద్ రావు, సినీ నటుడు మానస్ హాజరయ్యారు. నేపథ్య గాయకులు రాము, శ్రీవర్ధిని తమన్‌ల సంగీత విభావరి అలరించింది. ఆస్కా సంయుక్త కార్యదర్శి జీకే రెడ్డి, తదితర సభ్యులు పెద్ద సంఖ్యలో కుటుంబ సమేతంగా హాజరయ్యారు.

**ఆంజనేయ నగర్‌లో..:** ఉత్తర చెన్నైలోని తెలుగు ప్రజలు అధికంగా నివసిస్తున్న ఆంజనేయ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ తరపున పేద చిన్నారులకు ,పేద మహిళలకు , కార్మికులకు సహాయకాలు అందించారు .నార్త్ చెన్నై జిల్లా కార్యదర్శి ఆర్ తిరుపాల్, ఆర్ కె గోపాల్ సారథ్యంలో ముఖ్యఅతిథిగా నార్త్ చెన్నై కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎంఎస్ ద్రవ్యం పాల్గొని సహాయకాలు అందించారు.

**పెరంబూరులో..:** తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘంలో అధ్యక్షులు తమ్మినేని బాబు అధ్యక్షతన స్థానిక పెరంబూరులో ఉగాది వేడుకలు జరుపుకున్నారు. అతిథులుగా ఆలిండియా రేడియో –చెన్నై పూర్వనిర్దేశకులు ఎస్. వేణుగోపాల్‌రెడ్డి, పారిశ్రామికవేత్తలు సురేష్ కుమార్‌రెడ్డి, నర్రావుల వెంకటరమణ పాల్గొని ఉగాది విశిష్టతను తెలిపారు.

**ఉగాది బహుమతులు ప్రదానం:** పాత చాకలిపేటలోని దేవాంగ పెండ్లిసమాజం ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. పండుగ రోజున విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

**వైశ్య సంఘంలో అధ్వర్యంలో..:** దక్షిణ ఇండియా వైశ్య సంఘంలో అధ్యక్షుడు అజంతా డాక్టర్ కె. శంకర రావు అధ్యక్షతన ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సంయుక్త కార్యదర్శులు ఎం. నర్సింహులు, పి. అశోక్‌కుమార్, కోశాధికారి పి. రమేష్‌తో పాటు సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**టీటీడీ అధ్వర్యంలో..:** టీ నగర్‌లోని టీటీడీ సమాచార కేంద్రం శ్రీవారి ఆలయంలో ఉగాది వేడుకలు పెద్దఎత్తున చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక సలహామండలి చైర్మన్ ఏజే శేఖర్‌రెడ్డి నేతృత్వంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే జీఎన్ చెట్టి రోడ్డులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరారు.

**పుష్పయాగం..:** ఉగాది సందర్భంగా శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆలయంలో పుష్పయాగం కనుల పండువగా సాగింది. అర్చకులు భాస్కర్ పంతులు నేతృత్వంలో సాయంత్రం ఆలయంలో విశిష్ట పూజలు నిర్వహించి, పలు రకాల పుష్పాలతో అమ్మవారిని అలకరించారు. అలాగే, ప్యారిస్‌లోని సాయిబాబా ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయిబాబాకు ప్రత్యేక అలకంరణలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### వేలూరు, తిరువణ్ణామలై ..

తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకొని వేలూరు తిరుమల తిరుపతి దేవస్థానం సమాచార కేంద్రంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. అలాగే తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. వాలాజ ధన్వంతరి ఆరోగ్య పీఠంలో ఉదయం 6 గంటలకే ధన్వంత్రి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

## క్లుప్తంగా

### 50 కిలోల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు సీజ్

**అన్నానగర్:** వాల్పారైలో బుధవారం 50 కిలోల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. కోయంబత్తూరు జిల్లా వాల్పారై ప్రాంతంలో మునిసిపల్ కార్పొరేషన్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య సూపర్ వైజర్ల బృందం బుధవారం కిరాణా దుకాణాలు, బేకరీలు, మల్టీ పర్పస్ షాపులు, ఆహార గోడౌన్లలో తనిఖీలు నిర్వహించింది. 50 కిలోల ప్లాస్టిక్ ఉత్పత్తులను సీజ్ చేసి దుకాణదారులకు జరిమానా విధించింది.

### ప్రభుత్వ ఉద్యోగం పేరిట రూ.24.80 లక్షలు మోసం

**అన్నానగర్:** కృష్ణగిరి జిల్లా కల్లావి సమీపంలోని కల్లాయిపట్టికి చెందిన రామచంద్రన్ (25) ఎంఎస్‌డీ, ఎంఎడ్ పట్టభద్రుడు ఇతడిని ధర్మపురి ఒట్టపట్టికి చెందిన పుష్ప లింగం (34). ఇతని భార్య సుభాషిణి (27) ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామంటూ రూ.24. 80లక్షలు మోసంచేశారు. దీంతో రామచంద్రన్ తాను ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వాలని ఆ దంపతులను కోరాడు. కానీ వారు డబ్బులు తిరిగివ్వకపోగా.. బెదిరింపులకు పాల్పడ్డారు. రామచంద్రన్ ఫిర్యాదు మేరకు కల్లావి పోలీసులు పుష్ప లింగాన్ని బుధవారం అరెస్టు చేశారు. ఇతని భార్య సుభాషిని కోసం గాలింపు చేపడుతున్నారు.

### పవర్ ట్రాన్స్ మిషన్‌ల అభివృద్ధిపై దృష్టి

**సాక్షి, చెన్నై:** పవర్ ట్రాన్స్ మిషన్, డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్క్‌ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని తోషిబా ఇండియా (టీటీడీఐ) చైర్మన్ హిరషి పురుటా తెలిపారు. తోషిబా ట్రాన్స్ మిషన్ సేవలను గురించి ఆయన స్థానికంగా బుధవారం వివరించారు. 400 కేవీతో 23 యూనిట్లు, 220 కేవీతో 9 గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్ గేర్ (జీఐఎస్) కోసం నెట్ వర్క్ ల అభివృద్ధి, మెరుగే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామన్నారు. గోవాలో 2 ఇన్‌టూ 500ఎంవీఏ సబ్ స్టేషన్, ఆలమూరు, కోడమూరులలో 400 కేవీ ఓల్టేజ్ స్థాయిలో సోలార్, విండ్ పునరుత్పాదక ప్రాజెక్ట్, హైదరాబాద్ సమీపంలో ప్రత్యేక సదుపాయాలతో మే నెలలో సరికొత్త ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టబోతున్నట్లు వెల్లడించారు. అధునాతన సాంకేతిక ప్రక్రియలు, భారీ ఉత్పత్తి సామర్థ్యం, అత్యంత నైపుణ్యం కలిగిన వర్క్ ఫోర్స్‌తో మేడ్ ఇన్ ఇండియా లక్ష్యంతో జీఐఎస్ పనితీరు ఉంటుందని స్పష్టం చేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా వాటర్ డే గ్రామసభలు


రైతులు సాగు చేసిన పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్


పాండేశ్వరం గ్రామసభలో ప్రసంగిస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, చిత్రంలో సబ్‌కలెక్టర్ రిషబ్

– ఎన్ఎల్‌సీ, విమానాశ్రయానికి వ్యతిరేకంగా తీర్మానాలు

**సాక్షి, చెన్నై :** ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీల్లో గ్రామసభలు జరిగాయి. తమ తమ ప్రాంతాలలో నీటి అవశ్యకత, సంరక్షణ తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. అయితే కడలూరు జిల్లా నైవేలి పరిధిలోని కత్తాలై, ముమ్ముడి చోళగం తదితర గ్రామాల్లో అయితే, ఎన్ఎల్ఎల్‌సీ విస్తరణకు వ్యతిరేకంగా గ్రామ సభల్లో తీర్మానాలు చేశారు. తమకు ఎన్ఎల్‌సీ కారణంగా నష్టాలు, కష్టాలు అధికంగా ఉంటాయని, తమకు ఆ విస్తరణ వద్దే వద్దని నినాదించారు. ఇక కాంచీపురం జిల్లా పరందూరు పరిధిలోని గ్రామాలలో అయితే చెన్నైకు ప్రత్యామ్నాయంగా విమానాశ్రయ కొత్త టెర్మినల్‌ను వ్యతిరేకిస్తూ గ్రామసభల్లో వాదనలు వినిపించారు. ఇక, ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం స్టాలిన్ ఓ ప్రకటనలో నీటి ఆవశ్యకత, విలువ, పొదుపు, భవిష్యత్ దృష్ట్యా చేపట్టాల్సిన, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను గుర్తు చేశారు.

**గ్రామాల్లో రక్షిత మంచినీటి సదుపాయం**

**తిరువళ్లూరు:** గ్రామాలకు రక్షిత మంచినీటి సదుపాయాన్ని వంద శాతం అమలు చేస్తామని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ స్పష్టం చేశారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా వున్న అన్ని గ్రామాల్లోనూ గ్రామ సభలను నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంఆనే తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న 526 పంచాయతీల్లోనూ సభలను నిర్వహించారు. విల్లివాక్కం యూనియన్‌లోని పాండేశ్వరం గ్రామంలో జరిగిన గ్రామసభకు కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, సబ్‌కలెక్టర్ రిషబ్ హాజరయ్యారు. స్థానిక పంచాయతీ అధ్యక్షురాలు రేఖ రాము ఆధ్వర్యంలో ఈ సభ సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల్‌జీవన్ పథకం ద్వారా అన్ని గ్రామాలకు రక్షిత మంచినీటి పథకాన్ని అందజేస్తామన్నారు. ఉపాధీహామీ కూలీల ఎంపికతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసే సమయంలో అర్హులకే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రజల నుంచి వినతి పత్రాన్ని సైతం స్వీకరించారు. ఇదే విధంగా వెంగత్తూరులో సునితబాలయోగి, ఉలుంధైలో రమేష్, తొడుగాడులో వెంకటేషన్, నేమంలో ప్రేమ్‌నాథ్ నేతృత్వంలో గ్రామసభలను నిర్వహించారు. గ్రామసభలో పలు అబివృద్ధి పనులతో పాటు, భవిష్యత్‌లో చేపటాల్సిన పనులు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై చర్చించారు. కాగా గ్రామసభలో ఏర్పాటు చేసిన కూరగాయల ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించి రైతులను అభినందించారు.

## 'ఇన్ ఫ్లూయెంజా' వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డాక్టర్ వి.రామసుబ్రమణియన్

**కొరుక్కుపేట:** ఇన్ ఫ్లూయెంజా జ్వరాలకు కారణమైన వైరస్ వ్యాప్తిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్యులు సైతం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అపోలో ఆసుపత్రులు వైద్యనిపుణుడు డాక్టర్ వి. రామసుబ్రమణియన్ తెలిపారు. చెన్నైలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిన్నటి వరకు కరోనా కల్లోలం కొనసాగితే ప్రస్తుతం ఇన్ ఫ్లూయెంజా పంజా విసురుతోందన్నారు. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో ఈ వైరల్ జ్వరాలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. దగ్గు, జలుబు, జ్వరం ఉంటే ముందస్తు పరీక్షలు చేసుకోవాలని, లేకుంటే నిమోనియాతో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉందని చెప్పారు. బాధితులు ఇమ్యూనిటీని పెంచే వ్యాక్సిన్ వేసుకుంటే మంచిదని చెప్పారు. ఈ విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. ఈ సమావేశంలో అబాట్ ఇండియా వైద్యసేవల విభాగం డైరెక్టర్ డాక్టర్ జీజో కరణ్ కుమార్ పాల్గొన్నారు.

## జాక్టో జియో ఆధ్వర్యంలో మానవహారం రేపు


సమావేశంలో ప్రసంగిస్తున్న జాక్టో జియో ప్రతినిధి జనార్ధనన్

**వేలూరు:** వేలూరు జిల్లా జాక్టో జియో ప్రతినిధుల ఉన్నత స్థాయి సమావేశం కాట్పాడిలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి కమిటీ సభ్యులు జనార్ధనన్ మాట్లాడుతూ జాక్టో జియో ఆధ్వర్యంలో కొత్త పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పథకాన్ని అమలు చేయాలని కోరుతూ నెలల తరబడి పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం కనీసం చర్చలకు కూడా ఆహ్వానించపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24న వేలూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న వేలూరు, కాట్పాడి, కేవీ కుప్పం, గుడియాత్తం, పేర్నంబట్టు వంటి తాలుకా కార్యాలయాల ఎదుట జాక్టో జియో ప్రతినిధులచే మానవహారం నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయనున్నట్లు తీర్మానం చేశారు. సమావేశంలో తమిళనాడు రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి దీన దయాళన్, తమిళనాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు ఇలంగో, జిల్లా కోశాధికారి మణి, రాష్ట్ర జనరల్ కమిటీ సభ్యులు విల్వనాథన్ తదితరులు పాల్గొన్నారు.

## 101 జంటలకు.. ఉచిత సామూహిక వివాహాలు


వివాహం చేసుకోనున్న జంటలను పరిచయం చేస్తున్న నిర్వాహకులు, అతిథులు

**కొరుక్కుపేట:** ప్రధాని నరేంద్ర మోదీ విజన్‌కు అనుగుణంగా ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రమైన మహాబలిపురాన్ని వివాహ గమ్యస్థానంగా కూడా మార్చనున్నట్లు డబ్ల్యూవీ కనెక్ట్ సీఈఓ దక్షిణామూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మధ్యతరగతి వారు కూడా వెడ్డింగ్ డెస్టినేషన్‌లను ఎంచుకుంటున్నారని.. అందువల్ల పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలను వెడ్డింగ్ వేదికలగానూ ప్రమోట్ చేయాలని పీఎం పిలుపునిచ్చారన్నారు.

ప్రధాని మోదీ పిలుపు మేరకు డబ్ల్యూవీ కనెక్ట్ -2023 పేరుతో చెన్నై మహాబలిపురంలోని రాడిసన్ బ్లూ టెంపుల్ బేలో ఏప్రిల్ 3,4,5 తేదీల్లో ఆసియాలోనే అతిపెద్ద వివాహ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో భాగంగా కులమతాలకు అతీతంగా ఆర్థికంగా వెనుకబడిన పేద, దివ్యాంగులైన 101 జంటలకు ఉచితంగా సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇది ప్రపంచంలోనే తొలిసారిగా చేపడుతున్నట్లు వివరించారు. ఈ సదస్సులో దేశంతోపాటు టర్కీ, ఇటలీ, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్, శ్రీలంక దేశాల నుంచి 500లకు పైగా వెడ్డింగ్ ప్లానర్‌లు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో జీఆర్‌టీ గ్రూప్ సీఈఓ విక్రం కోట, డబ్ల్యూవీ డైరెక్టర్ నందిని విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## 39 ఏళ్ల తరువాత మళ్లీ..


గీత రచయిత వైరముత్తు, గాయని చిత్ర, దర్శకుడు తంగర్‌బచ్చన్

**తమిళసినిమా:** సినిమాలో కొన్ని జ్ఞాపకాలు తీపి గుర్తుగా మిగిలిపోతాయి. అలాంటి సంఘటనే ఇప్పుడు జరిగింది. తమిళసినిమాలో గీత రచయిత వైరముత్తు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఇక చిన్న గానకోకిలగా పేరుగాంచిన గాయనీ చిత్ర గానామృతం గురించి చెప్పాల్సిన అవసరం ఉండదు. కాగా 39 ఏళ్ల క్రితం వైరముత్తు రాసిన పూజైకేత్త పూవిదు అనే పాటను గాయనీ చిత్ర పాడారు. కాగా తాజాగా తంగర్‌బచ్చన్ దర్శకత్వంలో రూపొందుతున్న కరుమేఘంగళ్ కలైగింద్రన చిత్రం కోసం వైరముత్తు రాసిన పాటను చిత్ర పాడారు. దీని గురించి వైరముత్తు మాట్లాడుతూ 39 ఏళ్ల క్రితం పాడిన చిత్ర గొంతులో అదే మాధుర్యం, ఆమె అణుకువ,అదే మర్యాద ఇప్పుడూ చూస్తున్నానన్నారు. కాగా చిత్ర దర్శకుడు తంగర్‌బచ్చన్ మాట్లాడుతూ 1990లో మలైచారల్ అనే చిత్రానికి తాను ఛాయాగ్రహణను అందించానని, అప్పుడు ఆ చిత్రానికి వైరముత్తు రాసిన పాటకు చిత్ర పాడారని గుర్తు చేశారు. అలాంటిది ఇప్పుడు తన దర్శకత్వంలో తెరకెక్కుతున్న కరుమేఘంగళ్ కలైగింద్రన చిత్రంలో వైరముత్తు రాసిని వరుం వరుం కరుమేఘంగలే అనే పాటను చిత్ర పాడారని చెప్పారు. ఇటా మళ్లీ తాము ముగ్గురు కలిసి పని చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని త్వరలోనే నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

కోలీవుడ్ టాక్స్

## రీమేక్ సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి


కాసేదాన్ కవులడా చిత్ర యూనిట్

**తమిళసినిమా:** 1972లో ఏవీఎం సంస్థ నిర్మించిన చిత్రం కాసేదాన్ కడవులడా. ముత్తురామన్ ,లక్ష్మీ జంటగా నటించిన ఈ చిత్రం అప్పట్లో సంచలన విజయాన్ని సాధించింది. కాగా అదే చిత్రాన్ని ఇప్పుడు దర్శకుడు ఆర్. కన్నన్ తన మసాలా ఫిక్స్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో రీమేక్ చేశారు . ఇందులో మిర్చి శివ, నటి ప్రియాఆనంద్ హీరోహీరోయిన్లుగా నటించారు. యోగిబాబు, కరుణాకరన్, ఊర్వశి తదితరులు ముఖ్య పాత్రలను పోషించిన ఈ చిత్రానికి రాజ్ ప్రతాప్ సంగీతం అందించారు. కాగా నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం స్థానిక సాలిగ్రామంలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నిర్మాత, నటుడు రాజన్ మాట్లాడుతూ దర్శకుడు కన్నన్ దివంగత దర్శక నిర్మాత రామనారాయణన్ మాదిరి వరుసగా చిత్రాలను చేస్తున్నారని, అయితే ఇకపై నిర్మాతగా చిత్రాలు చేయవద్దని తాను ఆయనకు చెప్పానని అన్నారు. కారణం చిత్ర నిర్మాణం లాంటి శిక్ష మరొకటి ఉండదన్నారు. కథలను నమ్మి చిత్రాలు చేయాలని, హీరోల కోసం కథలు తయారు చేస్తే కచ్చితంగా ఫ్లాప్ అవుతాయని చెప్పారు. క్లాసిక్ కథా చిత్రాలను రీమేక్ చే సేటప్పుడు కచ్చితంగా పోల్చుకుంటారని తెలుసని, అందువల్ల భయం భయంగానే ఈ చిత్రాన్ని చేసినట్లు నటుడు శివ అన్నారు. అయితే గత చిత్రం కాసేదాన్ కవదులడా కంటే బాగా చేయలేమని, అయితే సాధ్యమైనంత వరకూ ఈ చిత్రాన్ని బాగా చేసే ప్రయత్నం చేశామని పేర్కొన్నారు. చిత్ర దర్శక నిర్మాత ఆర్.కన్నన్ మాట్లాడుతూ గత నెలలో తాను దర్శకత్వం వహించిన ది గ్రేట్ ఇండియన్ కిచ్చన్ చిత్రాన్ని విడుదల చేశామని, ఈ నెల కాసేదాన్ కడవులడా చిత్రాన్ని విడుదల చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుత సినిమా పరిస్థితుల్లో నెలకో చిత్రాన్ని విడుదల చేయడం సాధారణ విషయం కాదన్నారు. అందుకు తనకు పలువురు అండగా నిలుస్తున్నారని చెప్పారు. కాగా నటుడు మిర్చిశివ లేకపోతే ఈ చిత్రం లేదన్నారు. ఆయన తన చిరకాల మిత్రుడు అనీ, ఇప్పటికీ ఇద్దరం కలిసి చిత్రం చేయడం సంతోషంగా ఉందన్నారు. కాగా ఉళ్లళ్లై అళ్లిత్తా, పంబల్ కె.సంబంధం చిత్రాల తరహాలో జాలీగా సాగే చిత్రం ఇదన్నారు.

## కవిన్‌తో రొమాన్స్‌కు సిద్ధమేనా?


ప్రియాంక మోహన్

**తమిళసినిమా:** నాలుగేళ్లలోనే మూడు భాషలలో నటించిన లక్కీ నటి ప్రియాంక మోహన్. 2019లో మాతృభాషలో కథానాయకిగా పరిచయమైన ఈ కన్నడ బ్యూటీ.. అదే ఏడాదిలో తెలుగులో నాని గ్యాంగ్ లీడర్ చిత్రంలో నటించే లక్కీ చాన్స్ దక్కించుకుంది. ఆ వెంటనే కోలీవుడ్ నుంచి పిలుపు వచ్చింది. ఇక్కడ శివ కార్తికేయన్‌కు జంటగా డాక్టర్ చిత్రంలో నటించింది. ఈమె కెరీర్‌లో మంచి విజయాన్ని సాధించిన చిత్రం ఇదే. ఆ తరువాత వెంటనే సూర్యకు జంటగా ఎదుర్కుమ్ తుణిందన్ చిత్రంలో నటించే అవకాశం తలుపు తట్టింది. అయితే ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించలేదు. ఆ తరువాత శివకార్తికయేన్‌తో జతకట్టిన డాన్ చిత్రం సూపర్ హిట్ అయ్యింది. కాగా ప్రస్తుతం ధనుష్ సరసన నటిస్తున్న కెప్టెన్ మిల్లర్ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. అదే విధంగా దర్శకుడు రాకేష్ నూతన చిత్రంలో ప్రియాంక మోహన్ నాయకిగా నటించనుంది. అదే విధంగా సూర్యతో మరోసారి వాడివాసల్ చిత్రంలో నటించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం . కాగా తాజాగా ఈ అమ్మడు మరో అవకాశం వరించినట్లు తెలిసింది. డా డా చిత్ర విజయంతో మంచి జోరు మీద వున్న నటుడు కవిన్‌తో ప్రియాంక మోహన్ రొమాన్స్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు తాజా సమాచారం. దీనిని నృత్య దర్శకుడు సతీష్ తెరకెక్కించనున్నారు. దీనికి అనిరుధ్ సంగీతాన్ని అందించనున్నట్లు తెలిసింది. కాగా ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెలువడే అవకాశం ఉందని సమాచారం. కాగా ఇప్పటి వరకు తాను నటించిన చిత్రాలలో పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను సంపాదించుకున్న ప్రియాంక మోహన్‌కు గ్లామరస్ పాత్రలపై దృష్టి పెట్టింది. ఈ కారణంతోనే ఇటీవల అందాల ఆరబోతతో ఫొటోలను సామాజిక మాధ్యమాలలో తరచూ విడుదల చేస్తోందనే ప్రచారం సాగుతోంది.

## కమల్ చిత్రంలో లేడీ సూపర్ స్టార్


కమలహాసన్


నయనతార

**తమిళసినిమా:** విశ్వనటుడు కమలహాసన్ చిత్రంలో లేడీ సూపర్‌స్టార్ నయనతార నటించబోతున్నట్లు తాజా సమాచారం. సూపర్‌స్టార్ రజనీకాంత్ సరసన మూడు, నాలుగు చిత్రాలలో నటించిన నయనతార ఇప్పటి వరకు కమలహాసన్‌కు జంటగా నటించలేదు. అయితే ఇప్పుడు నటించబోతున్నారా? అన్న ప్రశ్న తలెత్తుతుండొచ్చు. దీనికి కాదనే బదులే వస్తుంది. అయితే కమలహాసన్ నిర్మించనున్న చిత్రంలో నయనతార ప్రధాన పాత్రను పోషించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. నటుడు కమలహాసన్ ఓ పక్క కథానాయకుడిగా నటిస్తునే మరో పక్క ఇతర నటులతో తన రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై చిత్రాలు నిర్మించడానికి సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఆ విధంగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ఒక చిత్రాన్ని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అజిత్ 62వ చిత్రానికి దర్శకత్వం వహించడానికి విఘ్నేష్ శివన్ సుమారు రెండేళ్లు కష్టపడ్డాడు. అయితే చివరి క్షణంలో ఆ చిత్రం నుంచి తొలగించారు. అలాంటి సమయంలో నటుడు కమలహాసన్ అండగా నిలిచారని సమాచారం. నయనతార కథానాయకిగా లేడీ ఓరియంటెడ్ కథా చిత్రాన్ని విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో కమలహాసన్ నిర్మించతలపెట్టినట్టు తెలుస్తోంది. మరో విషయం ఏంటంటే ఇంతకుముందు ఈ చిత్రాన్ని లవ్ టుడే చిత్రం ప్రేమ్ ప్రదీప్ రంగనాథన్ కథానాయకుడు స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించనున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు సీన్ మారింది. దీనికి విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించనున్నారట. నయనతార ప్రధాన పాత్రలో నటించనున్న ఈ చిత్రంలో ప్రదీప్ రంగనాథన్ ముఖ్య పాత్రలో నటించనున్నట్లు, ఆయనకు జంటగా మరో యువ నటి నటించిన సమాచారం. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కాగా నయనతార ఇప్పటికే తన 75వ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.

## తాతా బామ్మలే నా గురువులు

**తమిళసినిమా:** ప్రఖ్యాత కవి పులమైపిత్తన్ మనవడు దిలీపన్ పుగళేంది కథానాయకుడిగా నటించిన చిత్రం ఎవన్.నటి దీప్తీ మానే నాయకిగా నటించిన ఇందులో నటుడు జేకే.సంజిత్, ఉజ్జయినీరాయ్, గానాబాలా, పాండిరవి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. సన్‌లైట్ సినిమాస్ పతాకంపై నవ దర్శకుడి దురైమురుగన్ తెరకెక్కించిన ఈ చిత్రానికి శివరామన్ ఛాయాగ్రహణం , ఏకే.శశిధరన్ సంగీతాన్ని అందించారు. చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఏప్రిల్ 7న తెరపైకి రానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ చెన్నైలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిత్ర కథానాయకుడి దిలీపన్ పుగళేంది మాట్లాడుతూ తాను నటుడిగా పరిచయం కావడం యాదృచ్ఛికమేనన్నారు. బేసిక్‌గా తాను బైక్ రేసర్ అని, 2009లో బైక్ రేసింగ్ పోటీలో పాల్గొని కప్ గెలుచుకున్నానని చెప్పారు. అదేవిధంగా వీలింగ్ అనబడే ఒంటి చక్ర వాహనంతో 13 కిలోమీటర్ల నడిపి గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కానన్నారు. ఆ తరువాత అనుకోకుండా సినీరంగంలోకి ప్రవేశించానని చెప్పారు. అందుకు ముందు నటనలో శిక్షణ పొందినట్లు చెప్పారు. అలా 2012లో జయశీలన్ దర్శకత్వంలో పళ్లికూడం పోగామలే చిత్రం ద్వారా కథానాయకుడిగా పరిచయం అయినట్లు చెప్పారు. ఇది రెండో చిత్రమని చెప్పారు. ఈ చిత్రం వేరే నిర్మాత నిర్మించతల పెట్టారని, కొన్ని కారణాల వల్ల తానే పూర్తి చేయాల్సి వచ్చిందనీ చెప్పారు. తన చిత్రం ఆగిపోరాదని తన బామ్మ అప్పట్లోనే రూ.30 లక్షలు ఆ నిర్మాతకు ఇచ్చిందన్నారు. కాగా తల్లి కొడుకుల అనుబంధం ఇతి వృత్తంగా రూపొందించిన చిత్రం ఎవన్ అని చెప్పారు. చిత్రం సంతృప్తిగా వచ్చిందన్నారు. తదుపరి ఆంటనీ అనే పాన్ ఇండియా చిత్రంలో నటించబోతున్నట్లు చెప్పారు. ఇందులో పోలీస్ అధికారిగా నటించనున్నట్లు తెలిపారు. తన వరకూ తాత, బామ్మలే తనకు గురువులు అని నటుడు దిలీపన్ పుగళేంది పేర్కొన్నారు.



మీడియా సమావేశంలో ఎవన్ చిత్ర యూనిట్

## క్లుప్తంగా

### చెరువు కాలువకట్టపై రోడ్డు వద్దు



కీచ్చళం చెరువు కాలువకట్టపై రోడ్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**పళ్లిపట్టు:** చెరువు కాలువకట్టపై రోడ్డు ఏర్పాటు వద్దని రైతులు డిమాండ్ చేశారు. పళ్లిపట్టు యూనియన్ కీచ్చళం పంచాయతీలోని పంట పొలాల వద్ద రెండు దశాబ్దాలుగా మూడు కుటుంబాల వారు నివాసముంటున్నారు. ఇళ్ల నుంచి రోడ్డుకు వచ్చి వెళ్లేందుకు దారిలేక ఇబ్బందులు పడుతున్నారు. తాము రాకపోకలు సాగించేందుకు దారి చూపాలని అధికారులను కోరారు. దీంతో రెవెన్యూ అధికారులు చెరువుకట్ట పోరంబోకు స్థలాన్ని సర్వే చేసి రాకపోకలకు వీలుగా జేసీబీతో పనులు చేపట్టారు. నొచ్చిలి చెరువు నుంచి వర్షపు ఎక్కువగా కాలువ ద్వారా కీచ్చళం చెరువుకు వస్తుందని, కాలువకట్ట కూల్చి దారి ఏర్పాటు చేస్తే వర్షపు నీరు సమీపంలోని పంట పొలాలను ముంచెత్తి నష్టం వాటిల్లుతుందని రైతులు నిరసన తెలిపారు. కట్ట కూల్చివేతను ఆపేసి వేరే చోట రోడ్డు ఏర్పాటుచేయాలని కలెక్టర్‌ను కోరారు.

### టైరు పేలి సిమెంట్ లారీ బోల్తా

**అన్నానగర్:** మధురవాయల్ బైపాస్ రోడ్డులో బుధవారం ఉదయం 6 గంటలకు తాంబరం వైపు సిమెంట్ మిక్సర్ లోడుతో లారీ బయలుదేరింది. దీన్ని ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన డ్రైవర్ రాజేష్ నిశాంత్ నడిపాడు. వానగరం సమీపంలోకి రాగానే ఒక్కసారిగా పెద్దశబ్దంతో లారీ ముందు టైరు పేలింది. ఈ క్రమంలో లారీ అదుపు తప్పి బోల్తా పడింది. అలాగే లారీలోని సిమెంట్ మిశ్రమం అంతా రోడ్డుపై పడిపోయింది. ఆ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు లారీని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ రాజేష్‌ను రక్షించి చికిత్స నిమిత్తం కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కోయంబేడు ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ విభాగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### చర్చి మతబోధకుడి అరెస్టు

**తిరువొత్తియూరు :** తెన్‌కాశి జిల్లాలో చర్చికి వచ్చిన మహిళను లైంగికంగా వేధించిన మతబోధకుడిని పోలీసులు అరెస్టు చేశారు. తెన్‌కాశి జిల్లా ఆలంగుళం ప్రాంతంలో ఉన్న చర్చిలో మతబోధకుడిగా స్టాన్లీ కుమార్ (49) పనిచేస్తున్నాడు. ఆలంగుళం ప్రాంతానికి చెందిన ఒక మహిళ ఆలంగుళం డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. మతబోధకుడు స్టాన్లీ కుమార్ చర్చికి వస్తున్న మహిళ సెల్‌ఫోన్ నెంబర్లు తీసుకుని లైంగిక వేధింపులకు దిగుతున్నాడని వాపోయింది. మరో గ్రామానికి చెందిన ఒక యువతి స్నానం చేస్తుండగా ఫొటోలు తీసి వాటిని చూపించి లైంగికంగా వేధిస్తున్నట్టు పేర్కొంది. స్టాలిన్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి స్టాన్లీ కుమార్‌ను అరెస్టు చేశారు. అతని సెల్‌ఫోన్‌లో ఉన్న వీడియోలు, ఫొటోలను డిలీట్ చేశారు.

### బాలికను గర్భవతిని చేసిన విద్యార్థి అరెస్టు

**తిరువొత్తియూరు:** కాంచీపురం సమీపంలో 9వ తరగతి విద్యార్థిని గర్భవతిని చేసిన కళాశాల విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. కాంచీపురం సమీపంలోని పుల్లూరుకు చెందిన బాలిక 9వ తరగతి చదువుతోంది. కొన్ని రోజులుగా విద్యార్థిని శరీరంలో మార్పులు వచ్చాయి. స్పృహ తప్పి పడిపోవడంతో తల్లిదండ్రులు ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆమె మూడు నెలల గర్భిణిగా తేల్చారు. తల్లిదండ్రులు కాంచీపురం మహిళా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. విచారణలో గోవిందవాడి సమీపంలోని అగరం గ్రామానికి చెందిన లోకనాథన్ అనే యువకుడు బాలికను ప్రేమిస్తున్నట్టు తెలిసింది. అతను తరచూ పుల్లూరుకు వచ్చి వెళుతూ బాలికతో శారీరకంగా కలిసినట్టు తేలింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని లోకనాథన్‌ను అరెస్టు చేశారు.

### రైలు కింద పడి టీచర్ ఆత్మహత్య



టీచర్ అనిత(ఫైల్)

**వేలూరు:** తిరుపత్తూరు పెరియార్ నగర్‌కు చెందిన సదాశివం సెల్‌ఫోన్ దుకాణం నడుపుతున్నాడు. ఇతని భార్య అనిత(38) టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. అనిత తిరుపత్తూరు పునిచిమోటూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గత పదేళ్లుగా పనిచేస్తున్నారు. సదాశివానికి మద్యం తాగే అలవాటు ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో తరచూ దంపతుల మధ్య ఘర్షణలు చోటు చేసుకునేవి. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి ఇద్దరి మధ్య మరోసారి గొడవ చోటు చేసుకుంది. దీంతో మనో వేదనకు గురైన అనిత బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని రైల్వే పట్టాల వద్దకు వెళ్లి.. రైలుకింద పడిపోయి ఆత్మహత్యకు పాల్పడింది. రైల్వే ఇంజిన్ డ్రైవర్ జోలారుపేట రైల్వే పోలీసులకు సమాచారం అందజేశారు. ఆర్పీఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

# క్రికెట్ సందడి



స్టేడియం వద్ద అభిమానుల సందడి



స్టేడియంలో పిల్లల కేరింతలు

- అభిమానుల హంగామా
- నిరుపేదల కల సాకారం చేసిన ఆర్‌సీసీ మ్యాగ్నమ్

**సాక్షి, చెన్నై :** చెన్నైలో బుధవారం క్రికెట్ సందడి మిన్నంటింది. అభిమానులు స్టేడియంలో హంగామా చేశారు. నిరుపేద పిల్లల కలను సాకారం చేసే విధంగా ఆర్‌సీసీ మ్యాగ్నమ్ నేతృత్వంలో స్టేడియంలోకి 500 మందిని తీసుకెళ్లారు. తమిళనాట క్రికెట్ అభిమానులు ఎక్కువే. టీవీల ముందు కూర్చుని మ్యాచ్‌లను చూడడం కన్నా ప్రత్యక్షంగా తిలకించాలన్న ఆశతో చెన్నైకి పోటెత్తుతుంటారు. దీంతో చెన్నై చేపాక్ ఎంఏ చిదంబరం స్టేడియం కిటకిటలాడుతుంది. ఇటీవల ఈ స్టేడియాన్ని ఆధునీకీకరించారు. ఇందులో 50 వేల మంది కూర్చుని మ్యాచ్‌లను వీక్షించేందుకు వీలుంది. 37 వేల మందిని మాత్రమే అనుమతి ఇస్తున్నారు. బుధవారం భారత్ – ఆస్ట్రేలియా వన్డే మ్యాచ్ తిలకించేందుకు అభిమానులు వేలాదిగా చేపాక్కంకు పోటెత్తారు. ఆ పరిసరాలన్నీ అభిమానులతో నిండాయి. పోలీసు నిఘా నడుమ అభిమానులను స్టేడియంలోకి అనుమతించారు. క్రికెట్ అభిమానుల కోసం మెట్రో రైలు సేవలు నిర్ణీత సమయం కన్నా అధికంగా అర్ధ రాత్రి వరకు కొనసాగాయి.

**500 మంది పిల్లలతో..**

క్రికెట్‌ను టీవీల్లో చూసి ఆనందంతో ఉప్పొంగిపోతాం ... అదే నేరుగా క్రికెట్‌ను చూస్తే ఇక ఆనందానికి అవధులే ఉండదు. ఇందులో భాగంగా నిరుపేద చిన్నారులు నేరుగా క్రికెట్ స్టేడియంకు వెళ్లి చూస్తే ఇక పట్టలేని సంతోషమే. తమ కల నిజమైందని తెగ మురిసిపోవడాన్ని మాటల్లో చెప్పలేం. ఇప్పటికే క్రికెట్ టిక్కెట్‌లన్నీ అమ్ముడైపోయి ఎంతోమంది అభిమానులు నిరాశ చెందుతున్న తరుణంలో నిరుపేద చిన్నారుల కలను ఆర్‌సీసీ మ్యాగ్నమ్ సంస్థ సాకారం చేసింది. చెన్నైలోని చిదంబరం స్టేడియంలో మ్యాచ్‌ను తిలకించేందుకు 500 మంది నిరుపేద పిల్లలను తీసుకెళ్లారు. పిల్లలకు క్రికెట్ ప్రత్యక్షంగా తిలకించే అనుభూతిని కలిగించడంతో పాటు భోజనం తదితర సౌకర్యాలు కల్పించారు. చెన్నై రాజారత్నం స్టేడియం నుంచి ముఖ్య అతిథిగా పోలీసు సంక్షేమ విభాగం డీజీపీ కరుణాసాగర్, జాయింట్ పోలీసు కమిషనర్–చెన్నై (ఈస్ట్) దిషా మిట్టల్ పాల్గొని చెక్ దే ఇండియా జెండాను ఆవిష్కరించి చిన్నారులను నేరుగా చేపాక్‌లోని చిదంబరం స్టేడియంలోకి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ రత్న అవార్డు గ్రహీత లలితా జంగ్రా, మంగళ్‌చాంద్‌జీ దాదర్, తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ గౌరవ కోశాధికారి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

## విమానంలో తరలించిన అరుదైన జాతి కోతులు



అనుమతి లేకుండా తీసుకొచ్చిన అరుదైన జాతికి చెందిన కోతులు

**తిరువొత్తియూరు:** మలేషియా నుంచి చెన్నైకి విమానంలో అక్రమంగా తీసుకొచ్చిన అరుదైన జాతికి చెందిన నాలుగు కోతులను అధికారులు తిరిగి బుధవారం అదే విమానంలో మలేషియాకు పంపించారు. చెన్నై మీనంబాక్కం అంతర్జాతీయ విమానాశ్రయానికి మలేషియా రాజధాని కౌలాలంపూర్ నుంచి ప్రయాణికుల విమానం వచ్చింది. కస్టమ్స్ అధికారులు ప్రయాణికులను తనిఖీ చేశారు. ఇద్దరు ప్రయాణికులపై అనుమానం రావడంతో విచారణ చేపట్టారు. వారి దుస్తులను తనిఖీ చేశారు. గంపలో మధ్య ఆఫ్రికాలోని పాడి అడవుల్లో ఉండే టీ ప్రిస్పా జాతి కోతులు, నైజీరియా, కెన్యా, ఉగాండా తదితర దేశాల్లో నివసించే మాంటా క్రోసా జాతి కోతులను గుర్తించారు. అరుదైన జాతులకు చెందిన నాలుగు కోతులకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవు. వాటిని పెంచుకోవడానికి తీసుకువచ్చామని ప్రయాణికులు చెప్పారు. ఎటువంటి ఆధారాలు లేకుండా, వైద్యపరీక్షలు లేకుండా తీసుకుని వెళుతున్నట్టు గుర్తించి వాటిని తిరిగి అదే విమానంలో మలేషియాకు పంపించారు. కోతులను తీసుకువచ్చిన ఇద్దరిని విచారిస్తున్నారు.

## కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభం



దుస్థితిలో విద్యుత్ స్తంభం, అడుగుభాగంలో పెచ్చులూడిన విద్యుత్ స్తంభం

**తిరుత్తణి:** ఇళ్లకు సమీపంలో విద్యుత్ స్తంభం దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆర్కేపేట యూనియన్ ఆదివరాహపురం గ్రామంలో ఇళ్లకు సమీపంలో రోడ్డులో పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం అడుగు భాగం దెబ్బతినింది. రోడ్డు సమీపంలోని కుటుంబీకులు రోడ్డులో నడిచి వెళ్లేందుకు చిన్నారులు, మహిళలు ఆందోళన చెందుతున్నారు. గాలివానకు స్తంభం కూలిపడే ప్రమాదముందని, వెంటనే తొలగించాలని విద్యుత్‌శాఖ అధికారులకు పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తిరుత్తణి డివిజన్ విద్యుత్‌శాఖ ఇంజినీరు స్పందించి కొత్తగా విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని గ్రామీణులు కోరారు.

## నగల చోరీ కేసులో యువకుడి అరెస్టు

**తిరువొత్తియూరు:** చెన్నై పురసైవాక్కంలో కళాశాల విద్యార్థిని నగలు చోరీ చేసిన యువకుడిని పోలీసులు 24 గంటల్లోనే అరెస్టు చేశారు. పురసైవాక్కం చూలై షావుకార్‌పేటకు చెందిన పరమశివం కుమార్తె రుద్రవాణి మూడో సంవత్సరం డిగ్రీ చదువుతోంది. ఆమె సోమవారం రాత్రి పురసైవాక్కంలో వున్న ప్రముఖ జౌళి దుకాణంలో దుస్తులు తీసుకుని స్నేహితులతో కలిసి ఇంటికి బయలుదేరింది. మోటారు సైకిల్‌లో వచ్చిన యువకుడు ఆమె మెడలో వున్న ఒకటిన్నర సవర్ల బంగారు చైన్‌ను లాక్కుని పారిపోయాడు. ఫిర్యాదు అందుకున్న వెప్పేరి సహాయ కమిషనర్ హరికుమార్, పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టి నిఘా కెమెరాల ఆధారంగా నగలు అపహరించిన యువకుడు పురసైవాక్కం ఎస్ఎస్ పురానికి చెందిన వినోద్‌కుమార్‌గా గుర్తించారు. అతను ప్రైవేటు క్లబ్బులో పనిచేస్తున్నాడు. మద్యం తాగేందుకు చైన్ స్నాచింగ్ చేసినట్టు తెలిసింది. వినోద్‌కుమార్‌ను అరెస్టు చేశారు. అతని నుంచి చైన్‌ను స్వాధీనం చేసుకుని విద్యార్థినికి అప్పగించారు. 24 గంటల్లోనే దుండగుడిని అరెస్టు చేసిన పోలీసులను స్థానికులు అభినందించారు.

## ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడిపై దాడి



టీచర్లపై దాడి చేస్తున్న శివలింగం తదితరులు

**తిరువొత్తియూరు:** పాఠశాలలోకి చొరబడి హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులపై దాడి చేసిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. తూత్తుకుడి జిల్లా ఎటాయపురం సమీపంలో వున్న కీల్‌నంబిపురంలో ప్రభుత్వ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల ఉంది. ఇక్కడ గురవమ్మాళ్ (56) ప్రధాన ఉపాధ్యాయినిగాను, భరత్ (40) ఉపాధ్యాయుడిగానూ పనిచేస్తున్నారు. ఈ పాఠశాలలో 20 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలలో అదే ప్రాంతానికి చెందిన శివలింగం, సెల్వి దంపతుల కుమారుడు ప్రదీప్ రెండవ తరగతి చదువుతున్నాడు. కొన్ని రోజుల క్రితం ప్రదీప్ హోమ్ వర్కును ఇంటిలో వారు రాసినట్టు గుర్తించి ఉపాధ్యాయులు మందలించారు. ఈ సంగతి తెలుసుకున్న ప్రదీప్ తాత మునస్వామి పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయునితో వాగ్వాదానికి దిగాడు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో శివలింగం, సెల్వి, మునస్వామి పాఠశాలలోకి చొరబడి ప్రధానోపాధ్యాయిని గురవమ్మాళ్, ఉపాధ్యాయుడు భరత్‌పై దాడి చేశారు. కుర్చీలను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న ఎటాయపురం విలాతికులం పోలీసుస్టేషన్ డీఎస్పీ జగదీశ్వర్, పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులపై దాడి చేసిన మునస్వామి, శివలింగం, సెల్విని అరెస్టు చేశారు.

## ఏటీఎంలో నగదు చోరీకి యత్నం





ఏటీఎం కేంద్రం వద్ద విచారణ చేస్తున్న పోలీసులు, వేలి ముద్రలు సేకరిస్తున్న నిపుణులు

**వేలూరు:** తిరుపత్తూరు జిల్లా ఆలంగాయం సమీపంలోని వెల్‌లెక్టుట్ట గ్రామంలో ఏటీఎంను మంగళవారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి నగదు చోరీ చేసేందుకు ప్రయత్నించారు. శబ్దం విన్న స్థానికులు బయటకు రావడంతో దుండగులు పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. సీసీటీవీ పుటేజీలను చూడగా వాటిని దుండగులు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఏటీఎంలోని వేలి ముద్రలను సేకరించారు. బ్యాంకు అధికారులను రప్పించి విచారణ జరిపారు. ఏటీఎం కేంద్రంలో రూ: 4.50 లక్షల నగదు ఉన్నట్టు అధికారులు తెలిపారు. రెండు రోజులుగా ఖాతాదారులు డ్రా చేయడంతో ప్రస్తుతం రూ: 3.50 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించారు. తిరువణ్ణామలై జిల్లాలో గత మాసంలో నాలుగు ఏటీఎం కేంద్రాలను గ్యాస్ వెల్డింగ్ ద్వారా ధ్వంసం చేసి రూ.75 లక్షలు చోరీ చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు. తిరువణ్ణామలై, వేలూరు, తిరుపత్తూరు, రాణిపేట జిల్లాల ప్రత్యేక పోలీస్ బృందాలు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలోనే తిరుపత్తూరులో ఏటీఎం కేంద్రాన్ని ధ్వంసం చేసి చోరీకి యత్నించిన సంఘటన సంచలనం రేపింది.

### రెండు కార్లు ఢీకొని ముగ్గురి మృతి

- తొమ్మిదిమందికి తీవ్ర గాయాలు

**అన్నానగర్:** పుదుకోట్టై సమీపంలో మంగళవారం రాత్రి రెండు కార్లు ఢీకొని ముగ్గురు మృతిచెందారు. మరో 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పుదుకోట్టై జిల్లా అరంతాంగి ఎంజీఆర్ నగర్‌కు చెందిన మణికంఠన్ (28) మంగళవారం ఉదయం తన తల్లి వళ్లియమ్మాళ్ (48), భార్య నీలవేణి (25), కుమార్తె మహిషశ్రీ (12), అత్త సుమతి (45)లతో కలిసి సేలంలోని మారియమ్మన్ ఆలయానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. అదేసమయంలో రామేశ్వరం నుంచి సేలం వైపు ఆరుగురు కారులో వస్తున్నారు. రాత్రి 10.15 గంటల సమయంలో తిరుచ్చి – పుదుకోట్టై రోడ్డులోని భారతీదాసన్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ సమీపంలో రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు కార్లలో ప్రయాణిస్తున్న 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని మాత్తూరు పోలీసులు తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ అరంతాంగికి చెందిన కదీర్ (28), సుమతి, మహిషశ్రీ మృతి చెందారు. మిగిలిన 9 మంది చికిత్స పొందుతున్నారు.

### భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్య

**అన్నానగర్:** కంబం సమీపంలో ప్రసవ సమయంలో భార్య మృతిచెందడంతో భర్త బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తేని జిల్లా కంబం స్వామి వివేకానంద వీధికి చెందిన ఆసై పాండియన్ కుమారుడు రాజ్‌కుమార్ (23) తల్లిదండ్రులు కుటుంబ సమస్యల కారణంగా విడిపోయారు. ఆసై పాండియన్ మరో మహిళను రెండో పెళ్లి చేసుకుని ఊటీలో ఉంటున్నాడు. రాజ్‌కుమార్‌ను అతని తాత సోలైరాజ్ పెంచారు. రాజ్‌కుమార్ తాను పని చేస్తున్న కంపెనీలో దేవరం బొమ్మినాయగకన్ పట్టికి చెందిన ఆంథోనియమ్మాళ్‌ను పెళ్లి చేసుకున్నాడు. ఈ నెల 13వ తేదీన రాజ్‌కుమార్ తాత చోలైరాజ్ అనారోగ్యంతో మృతి చెందారు. గర్భిణి అయిన ఆంథోనియమ్మాళ్‌కు ప్రసవ నొప్పులు రావడంతో కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. 17న ప్రసవం కష్టమై ఆమె మృతి చెందింది. తనను పెంచి పెద్ద చేసిన తాత, ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య చనిపోవడంతో రాజ్‌కుమార్ తట్టుకోలేకపోయాడు. బుధవారం ఇంటిలో ఉరివేసుకున్నాడు. ఎంతసేపటికి బయటికి రాకపోవడంతో బంధువులు తలుపులు పగులగొట్టి చూడగా రాజ్‌కుమార్ ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. కంబం నార్త్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాజ్‌కుమార్ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### తల్లి మందలించిందని విద్యార్థి ఆత్మహత్య

**అన్నానగర్:** పొల్లాచ్చిలో తల్లి మందలించిందని 8వ తరగతి విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి అన్సారీ వీధికి చెందిన శరవణబాబు, విజయలక్ష్మి దంపతులకు కుమారుడు తరుణ్ (13) ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. బాలుడు మంగళవారం సాయంత్రం టీవీ చూస్తుండడంతో తల్లి మందలించింది. తర్వాత ఆమె వేరే చోటికి వెళ్లింది. తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులు వేసి ఉన్నాయి. తలుపులు పగులగొట్టి చూడగా తరుణ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. అతన్ని పొల్లాచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఆరోగ్యంగానే ఉన్నా!

- వీడియో విడుదల చేసిన ఈవీకేఎస్



ఆస్పత్రిలో ఈవీకేఎస్

**సాక్షి, చెన్నై:** తాను ఆరోగ్యంగానే ఉన్నానని ఈరోడ్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత ఈవీకేఎస్ ఇలంగోవన్ బుధవారం వీడియో విడుదల చేశారు. ఈ ఏడాది జనవరిలో ఈవీకేఎస్ తనయుడు తిరుమగన్ గుండెపోటుతో మరణించాడు. దీంతో ఈరోడ్ తూర్పు నియోజకవర్గానికి ఉప ఎన్నికలు వచ్చాయి. ఈవీకేఎస్ విజయకేతనం ఎగుర వేశారు. ఎమ్మెల్యేగా ఆయన ప్రమాణ స్వీకారం చేసినా అసెంబ్లీలో అడుగు పెట్టలేదు. గత వారం గుండెపోటు రావడంతో పోరూర్‌లోని శ్రీరామచంద్ర ఆసుపత్రికి తరలించారు. ఆయనకు కరోనా నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతం కరోనా నుంచి ఆయన కోలుకున్నారు. కాగా తాను ఆరోగ్యంగానే ఉన్నానని, త్వరలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి.. ప్రజాసేవకు అంకితం అవుతానని నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ఆయన ఓ వీడియో విడుదల చేశారు.

# కృష్ణగిరిలో పరువు హత్య



భార్య శరణ్యతో మృతుడు జగన్ (ఫైల్)



రోడ్డులో జగన్‌పై కత్తులతో దాడి చేస్తున్న దుండగులు

**తిరువొత్తియూరు:** తమ కుమార్తెను ప్రేమ వివాహం చేసుకున్నాడని యువకుడిని కత్తులతో నరికి హత్య చేసిన సంఘటన కృష్ణగిరిలో సంచలనం కలిగించింది. కృష్ణగిరి సమీపంలో వున్న కిడామ్‌పట్టికి చెందిన చిన్నయ్యన్ కుమారుడు జగన్ (28) టైల్స్ అతికించే పనిచేస్తుంటాడు. ఇతను కృష్ణగిరి జిల్లా ములంగళ్‌కు చెందిన శంకరన్ కుమార్తె శరణ్య (21)ను ప్రేమించాడు. ఈ విషయం యువతి తల్లిదండ్రులకు తెలిసింది. వారి ప్రేమను ఒప్పుకోలేదు. ఆమెకు మరొక యువకుడితో పెళ్లి చేసేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఈ క్రమంలో జగన్, శరణ్య ఒక క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. దీంతో శరణ్య కుటుంబ సభ్యులు ఆ యువకుడిపై కక్ష పెంచుకున్నారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జగన్ మోటారు సైకిల్‌పై ధర్మపురి, కృష్ణగిరి రోడ్డులో వెళుతుండగా శరణ్య తండ్రి శంకరన్, తన బంధువుతో కలిసి అతన్ని అడ్డగించారు. కత్తులతో దాడి చేశారు. జగన్ గొంతు కోసి హత్య చేశారు. సమాచారం అందుకున్న కావేరి పట్టణం పోలీసులు అక్కడికి చేరుకుని జగన్ మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించడానికి ప్రయత్నించారు. యువకుడి తల్లిదండ్రులు లీసులను అడ్డుకుని న్యాయం చేయాలని ఆందోళన చేశారు. ఎస్పీ సరోజ్‌కుమార్ ఠాగూర్, సహాయ డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ తమిళరసి అక్కడికి చేరుకుని హంతకులను త్వరలోనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తరువాత మృతదేహాన్ని కృష్ణగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జగన్ మామ శంకరన్, బంధువులు అరులు, గోవిందరాజు, తిమ్మరాయ కోసం గాలింపు చర్యలు చేపట్టగా శంకరన్ మంగళవారం రాత్రి కృష్ణగిరి అదనపు మహిళా పోలీసుస్టేషన్‌లో లొంగిపోయాడు.

## నీటి ఆధారిత ప్రాంతాలను పరిరక్షించాలి



పుష్కరిణి వద్ద మొంక్కలు నాటుతున్న కమిషనర్ రాజ్యలక్ష్మి

**తిరువళ్లూరు:** పట్టణంలోని నీటి ఆధారిత ప్రాంతాలను గుర్తించి వాటిని పరిరక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తిరువళ్లూరు మున్సిపల్ కమిషనర్ రాజ్యలక్ష్మి వివరించారు. తిరువళ్లూరు జిల్లా జేఎన్ రోడ్డులో అపరిశుభ్రంగా వున్న పుష్కరిణిని రూ.4 లక్షలతో మరమ్మతులు చేశారు. అందులో పూడికను సైతం తీయించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం పుష్కరిణికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం పుష్కరిణిని పరిశుభ్రంగా వుంచడంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తామని స్థానికుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ రహిత తిరువళ్లూరుగా తీర్చిదిద్దడానికి మున్సిపాలిటీ చేస్తున్న ప్రయత్నంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ అధికారి గోవిందరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు

- 16 కేజీల గంజాయి స్వాధీనం



అరెస్టయిన సూర్యకుమార్, స్వాధీనం చేసుకున్న గంజాయి, అరెస్టయిన మణిగండన్ అలియాస్ కుళ్లుమణి

**తిరువళ్లూరు:** అంబత్తూరులో గంజాయిని నిల్వ వుంచి తిరుముల్లైవాయల్ రైల్వేస్టేషన్ సమీపంలో విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తిరువళ్లూరు జిల్లా తిరుముల్లైవాయల్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఇద్దరు యువకులు సంచరిస్తున్నట్టు అంబత్తూరు ఇన్‌స్పెక్టర్ ధనమ్మాల్‌కు ప్రయాణికులు సమాచారం అందించారు. దీంతో ప్రత్యేక టీమ్ అక్కడికి చేరుకుని ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వారు చెన్నై వీరాపురం గ్రామానికి చెందిన సెల్వం కుమారుడు సూర్యకుమార్(21), కొడుంగయూర్ ప్రాంతానికి చెందిన శివ కుమారుడు మణిగండన్ అలియాస్ కుళ్లుమణి(25)గా గుర్తించారు. వారు గంజాయి విక్రయిస్తున్నట్టు తేలింది. వారిని అరెస్టు చేసి 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారు కేరళ నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. సూర్యకుమార్ 2018లో పోక్సో యాక్ట్ కింద అరెస్టయి బెయిల్‌పై వున్నాడు.

## డ్రాపౌట్ విద్యార్థినిని స్కూల్లో చేర్పించిన డీఎస్పీ



విద్యార్థినితో డీఎస్పీ మాయవన్, పోలీసులు

**అన్నానగర్:** తూత్తుకుడి జిల్లా ఆళ్వార్తిరు నగర్‌కు చెందిన లోకనాథన్ కుమార్తె తామరైకని నజరత్‌లోని ప్రభుత్వ ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదివింది. ఆమె తల్లి చనిపోవడంతో మూడు నెలలుగా పాఠశాలకు వెళ్లలేదు. ఈ స్థితిలో శ్రీ వైకుంఠం డిప్యూటీ ఎస్పీ పరిధిలోని ప్రాంతాలలో మధ్యలోనే చదువు మానేసిన విద్యార్థులపై పోలీసులు సర్వే చేశారు. తామరైకని పాఠశాలకు వెళ్లడం మానేసినట్లు డీఎస్పీ మాయవన్ గుర్తించారు. ఆమెను పిలిచి మళ్లీ పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకున్నారు. అందుకు అనుగుణంగా విద్యార్థికి అవసరమైన పాఠ్య పుస్తకాలు, బ్యాగులు కొనుగోలు చేశాడు. బుధవారం నుంచి తిరిగి నజరత్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించాడు. ప్రజలు ఆయనకు అభినందనలు తెలిపారు.

## తాగునీటి పొదుపు అందరి బాధ్యత



అమ్మనేరిలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

**పళ్లిపట్టు:** తాగునీటి పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యతని పలువురు సర్పంచ్‌లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రపంచ తాగునీటి దినోత్సవం సందర్భంగా గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు ఆమోదించారు. తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్కేపేట యూనియన్‌లోని 37 గ్రామ పంచాయతీలు, పళ్లిపట్టు యూనియన్‌లోని 33 గ్రామ పంచాయతీలు, తిరుత్తణి యూనియన్‌లోని 27 గ్రామ పంచాయతీల్లో తాగునీటి దినోత్సవం నిర్వహించారు. ఆర్కేపేట యూనియన్‌లోని అమ్మనేరి పంచాయతీ కొండాపురం దళితవాడలో చేపట్టిన గ్రామసభకు సర్పంచ్ గోవిందరెడ్డి అధ్యక్షత వహించారు. ఇందులో గ్రామీణులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తాగునీటి పొదుపు, వర్షపు నీటి వినియోగంపై తీర్మానాన్ని ఆమోదించారు. అయ్యనేరిలో పంచాయతీ సర్పంచ్ జయలలిత గ్రామ సభ నిర్వహించారు. పళ్లిపట్టు యూనియన్‌లోని కీచ్చళం పంచాయతీలో సర్పంచ్ జాన్ గ్రామసభ జరిగింది. నెడిగళ్లులో కుమార్, పేటకండ్రిగలో రాజ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు.

# రూ.4,411.68 కోట్లతో టీటీడీ బడ్జెట్

## 2023-24 బడ్జెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం

- గణనీయంగా పెరిగిన హుండీ ఆదాయం, బ్యాంకు వడ్డీ
- వర్చువల్ సేవల కొనసాగింపు
- వేసవిలో 3 నెలలు వీఐపీ సిఫార్సు లేఖలు తగ్గింపు
- సామాన్య భక్తుల దర్శనం కోసం శ్రీవాణి టికెట్ల కుదింపు
- టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి

**తిరుమల:** వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2023–24కి) తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) బడ్జెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది. రూ.4,411.68 కోట్ల బడ్జెట్‌ను ఫిబ్రవరి 15న జరిగిన పాలకమండలి సమావేశం ఆమోదించినట్లు టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున అప్పుడు ఈ వివరాలు వెల్లడించలేదని తెలిపారు. తిరుమలలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసిందని చెప్పారు. శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులందరికీ శ్రీ శోభకృత్ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ ప్రజలంతా, ముఖ్యంగా తెలుగు ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. గతనెలలో జరిగిన పాలకమండలి సమావేశంలో కొన్ని పాలనపరమైన నిర్ణయాలు కూడా తీసుకున్నట్లు తెలిపారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవి, ఎస్ఈ జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్న ఈ సమావేశంలో వై.వి.సుబ్బారెడ్డి వెల్లడించిన వివరాలు..

- ▲ వీఐపీ బ్రేక్ దర్శన సమయం మార్చినందువల్ల సామాన్య భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఈ విధానాన్ని కొనసాగిస్తాం.
- ▲ కోవిడ్ తరువాత హుండీ ఆదాయం గణనీయంగా పెరిగింది. కోవిడ్‌కు ముందు ఏడాదికి రూ.1,200 కోట్ల కానుకలు లభించేవి. కోవిడ్ తరువాత హుండీ ఆదాయం ఏడాదికి రూ.1,500 కోట్ల వరకు పెరిగింది. బ్యాంకుల్లో ఉన్న టీటీడీ డిపాజిట్ల మీద కూడా వడ్డీ రేట్లు పెరిగాయి.
- ▲ భక్తుల కోరిక మేరకు కోవిడ్ సమయంలో వర్చువల్ సేవా టికెట్లు ఆన్‌లైన్‌లో జారీచేశాం. తరువాత కూడా భక్తుల కోరిక మేరకు ఈ సేవలు కొనసాగించాలని నిర్ణయించాం.
- ▲ తిరుపతిలో నిర్మిస్తున్న శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్ పనులు ఏప్రిల్ ఆఖరు నాటికి పూర్తిచేయించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తాం.
- ▲ అలిపిరి నుంచి వకుళమాత ఆలయం వరకు కొత్తగా రోడ్డు మంజూరు చేశాం.
- ▲ ఏప్రిల్ 5వ తేదీన ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి కల్యాణోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు.
- ▲ వేసవిలో మూడునెలలు భక్తుల రద్దీ బాగా పెరిగే అవకాశం ఉన్నందువల్ల వీఐపీల సిఫారసులు బాగా తగ్గించాలని కోరుతున్నాం. శ్రీవాణి టికెట్ల సంఖ్య కూడా తగ్గించి ఎక్కువమంది సామాన్య భక్తులకు దర్శనం కల్పిస్తాం.
- ▲ తిరుమలలో భక్తుల అవసరాలకు అనుగుణంగా లడ్డూ కాంప్లెక్స్ వద్ద 30 అదనపు లడ్డూ కౌంటర్ల నిర్మాణానికి రూ.5.25 కోట్లు మంజూరు చేశాం.
- ▲ తమిళనాడు రాష్ట్రం ఉలందూరుపేటలో దాత విరాళంతో నిర్మిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.4.70 కోట్లతో కొన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించాం.
- ▲ తిరుపతిలోని ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల పడమర వైపు మూడో అంతస్తు నిర్మాణం, ల్యాబ్ ఆధునికీకరణ, గ్రంథాలయం, ఇండోర్ గేమ్స్ భవనాల నిర్మాణం తదితర పనుల కోసం రూ.4.71 కోట్లతో టెండర్లు ఖరారు చేశాం.
- ▲ శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్‌పవర్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి, వారి కుటుంబసభ్యులతో కలిపి దర్శన వసతి, రాయితీపై రూ.20 చొప్పున నెలకు 10 లడ్డూలు ఇవ్వాలని నిర్ణయించాం.

### హుండీ ద్వారా రూ.1,591 కోట్ల రాబడి అంచనా

వచ్చే ఆర్థిక సంవత్సరంలో శ్రీవారి హుండీ ద్వారా సుమారు రూ.1,591 కోట్లు ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో టీటీడీ అంచనా వేసింది. 2022–23 బడ్జెట్‌తో పోలిస్తే ఈ బడ్జెట్ రూ.1,315.28 కోట్ల మేర పెరిగింది. ఇందులో ఉద్యోగులు, పొరుగు ఉద్యోగులు, ఒప్పందసేవ సిబ్బంది జీతాలకు రూ.1,532 కోట్లు వెచ్చించనున్నారు. పరికరాల కొనుగోలుకు రూ.690.50 కోట్లు కేటాయించారు. కార్పస్, ఇతర పెట్టుబడుల కోసం రూ.600 కోట్లు వెచ్చించనున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభం నిల్వ రూ.291.85 కోట్లుగా అంచనా వేశారు. ఇటీవల కొన్ని వసతి గదులు, కల్యాణ మండపాల అద్దె పెంచడం వల్ల ఆదాయం పెరుగుతుందని అంచనా వేశారు. వీటిద్వారా ప్రస్తుత సంవత్సరం రూ.118 కోట్ల ఆదాయాన్ని అంచనా వేయగా రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.129 కోట్లు వస్తాయని బడ్జెట్లో పేర్కొన్నారు.

### రూ.990 కోట్లకు వడ్డీ ఆదాయం

టీటీడీ వివిధ బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన నగదు, బంగారం ద్వారా పెద్ద ఎత్తున వడ్డీ ఆదాయం లభిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.813 కోట్ల వడ్డీ వస్తున్నట్లు అంచనా వేసిన టీటీడీ.. రానున్న ఆర్థిక సంవత్సరంలో వడ్డీ ఆదాయం మరో రూ.177 కోట్లు పెరిగి మొత్తం రూ.990 కోట్లు వస్తాయని పేర్కొంది.

# పెట్రోల్ కార్లదే హవా

**దేశీయ మార్కెట్‌లో 70 % వాటాతో అగ్రస్థానం**

- గణనీయంగా తగ్గుతున్న డీజిల్ కార్ల అమ్మకాలు
- క్రమంగా పుంజుకుంటున్న విద్యుత్ కార్ల అమ్మకాలు
- ఐదేళ్లలో దేశంలో కార్ల మార్కెట్‌లో ఆసక్తికర మార్పులు



**సాక్షి, అమరావతి:** దేశంలో కార్ల కొనుగోలుదారుల అభిరుచుల్లో ఆసక్తికరమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా ఐదేళ్లలో కార్ల మార్కెట్‌పై దీని ప్రభావం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. దేశంలో కార్ల మార్కెట్‌ను పెట్రోల్ వెర్షన్ కార్లు శాసిస్తున్నాయనే చెప్పొచ్చు. మార్కెట్‌లో 70 శాతం అమ్మకాలతో పెట్రోల్ వెర్షన్ కార్లు అగ్రస్థానంలో కొనసాగుతున్నాయి. డీజిల్ కార్లపై వినియోగదారుల ఆసక్తి క్రమంగా తగ్గుతోంది. దీంతో వీటి అమ్మకాలు 18.50 శాతానికే పరిమితమయ్యాయి. విద్యుత్ కార్ల అమ్మకాలు అనూహ్యంగా పుంజుకుంటున్నాయి. మొత్తం కార్ల అమ్మకాల్లో ఎస్‌యూవీ మోడల్ వాహనాల వాటా 42 శాతంగా ఉంది. 2018–19 నుంచి 2022–23లో దేశంలో కార్ల అమ్మకాల నివేదికను ప్రముఖ మార్కెటింగ్ రీసెర్చ్ సంస్థ 'జేటో డైనమిక్స్' వెల్లడించింది.

### నివేదిక ఏం చెబుతోందంటే..

ఐదేళ్లలో దేశంలో పెట్రోల్ కార్ల అమ్మకాలు 10 శాతం పెరిగాయి. 2018–19లో దేశీయ కార్ల మార్కెట్‌లో పెట్రోల్ వెర్షన్ కార్ల అమ్మకాలు 60 శాతంగా ఉండేవి. ఇవి 2022–23లో 70 శాతం మార్కెట్‌ను సాధించాయి. కాలుష్య నియంత్రణ కోసం ప్రభుత్వం తీసుకున్న మార్గదర్శకాలు కూడా పెట్రోల్ వాహనాల అమ్మకాలు పెరగడానికి కారణమయ్యాయి. డీజిల్ వాహనాలను 10 ఏళ్లకు తుక్కుగా మార్చాలని కేంద్రం నిర్ణయించింది. అదే పెట్రోల్ వాహనాలకు 15 ఏళ్ల వరకూ అవకాశం కల్పించింది. దాంతో డీజిల్ వాహనాల కంటే పెట్రోల్ వాహనాల కొనుగోలుకు వినియోగదారులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ఐదేళ్ల క్రితం పెట్రోల్, డీజిల్ ధరల మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉండేది. కానీ డీజిల్ ధరలు క్రమంగా పెరుగుతూ వచ్చాయి. ప్రస్తుతం రెండింటి ధరల మధ్య ప్రస్తుతం పెద్ద వ్యత్యాసం లేదు.

### కొత్త మోడల్స్ లాంచింగ్‌లోనూ..

కార్ల కొనుగోలుదారుల ఆసక్తి కొత్త మోడళ్ల లాంచింగ్‌ను ప్రభావితం చేస్తోంది. కార్ల తయారీ కంపెనీలు కూడా మార్కెట్‌లోకి కొత్తగా పెట్రోల్, విద్యుత్ వాహనాలను ప్రవేశపెట్టేందుకే ఆసక్తి చూపిస్తున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో భారత్ మార్కెట్‌లోకి 28 కొత్త మోడల్ కార్లను ప్రవేశపెట్టారు. వాటిలో పెట్రోల్ వెర్షన్ కార్లు 13 ఉండగా.. విద్యుత్ కార్లు 8 ఉన్నాయి. డీజిల్ వెర్షన్ కార్లు ఆరు, సీఎన్‌జీ వెర్షన్ కారు ఒక మోడల్ భారత్ మార్కెట్‌లోకి ప్రవేశించాయి.

### సగానికి తగ్గిన డీజిల్ కార్ల అమ్మకాలు

ఐదేళ్లలో దేశంలో డీజిల్ కార్ల అమ్మకాలు దాదాపు సగానికి తగ్గిపోయాయి. పర్యావరణ నియంత్రణ చర్యలు, డీజిల్ ధరలు అమాంతంగా పెరుగుతుండటమే దీనికి కారణం. ఎస్‌యూవీ వాహనాల్లోనే డీజిల్ వెర్షన్‌కు డిమాండ్ ఉంది. సాధారణ కార్ల అమ్మకాల్లో డీజిల్ వాహనాలకు డిమాండ్ తగ్గుతూ వస్తోంది. 2018–19లో దేశంలో డీజిల్ వెర్షన్ కార్ల వాటా 36 శాతం ఉండేది. కాగా 2022–23లో అది 18.50 శాతానికి తగ్గిపోయింది. 2018–19తో పోలిస్తే 2022–23నాటికి దేశంలో కార్ల కొనుగోలుదారుల అభిరుచుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి.



**దేశంలో కార్ల అమ్మకాల ట్రెండ్ మారిందిలా..**

| మోడల్ | 2018-19 | 2022-23 |
|---|---|---|
| పెట్రోల్ కార్లు | 20,19,710 | 27,40,683 |
| డీజిల్ కార్లు | 12,24,452 | 7,23,433 |
| సీఎన్‌జీ కార్లు | 1,29,559 | 3,93,692 |
| విద్యుత్ కార్లు | 1,603 | 52,319 |

# మొక్కల డాక్టర్లు వచ్చేస్తున్నారు!

- ఖరీఫ్ సీజన్ నుంచి అందుబాటులో సేవలు
- ప్లాంట్ హెల్త్ డయాగ్నస్టిక్ సెంటర్లుగా ఆర్బీకేలు
- ప్లాంట్ డాక్టర్లుగా సేవలందించనున్న ఆర్బీకే సిబ్బంది
- ఏప్రిల్ నుంచి దశల వారీగా ఆర్బీకే సిబ్బందికి సాంకేతిక శిక్షణ
- తొలి విడతగా మండలానికో ఆర్బీకేలో అమలు
- శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు రైతులకు సూచనలు, సలహాలు



**సాక్షి, అమరావతి:** మొక్కల డాక్టర్లు వచ్చేస్తున్నారు.. వీరు ఏటా భూసార పరీక్షలు చేయడమే కాదు.. భూసారాన్ని కాపాడేందుకు సిఫార్సు మేరకు తగిన సూక్ష్మపోషకాలందిస్తారు. విత్తు నుంచి కోత వరకు పంటలకు సోకే తెగుళ్లను గుర్తించి శాస్త్రవేత్తల సూచనల మేరకు ఎంత మోతాదులో మందులు వాడాలో చెబుతారు. దగ్గరుండి మొక్కలకు అందేలా చూస్తారు. నాణ్యమైన పంట దిగుబడులు సాధించడమే లక్ష్యంగా..దేశంలోనే తొలిసారిగా ఏపీలోని ఆర్బీకేల్లో ప్లాంట్ హెల్త్ డయాగ్నస్టిక్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి తొలుత మండలానికి ఓ ఆర్బీకేలో వీటి సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**తొలి దశలో 670 ఆర్బీకేల పరిధిలో అమలు..**

విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అండగా నిలుస్తోన్న వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ప్లాంట్ హెల్త్ డయాగ్నస్టిక్ సెంటర్లు (పీహెచ్‌డీసీ)గా తీర్చిదిద్దేందుకు రంగం సిద్ధం చేశారు. భూసారం, నీటి, సూక్ష్మ పోషక లోపాలను గుర్తించేందుకు రైతు క్షేత్రం నుంచి నమూనాలు సేకరించి నిర్దేశిత గడువులోగా ఫలితాలు అందించడమే కాకుండా.. సకాలంలో తగిన సలహాలు, సూచనలు అందించాలన్న లక్ష్యంతోనే ప్లాంట్ డాక్టర్ విధానానికి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది. తొలుత మండలానికి ఓ ఆర్బీకే పరిధిలో పీహెచ్‌డీసీ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ విధంగా తొలిదశలో రాష్ట్ర వ్యాప్తంగా 670 ఆర్బీకేల పరిధిలో అమలు చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత దశల వారీగా మిగిలిన ఆర్బీకేలలోనూ ఈ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**ఏప్రిల్ నుంచి ప్లాంట్ డాక్టర్స్‌గా శిక్షణ**

పీహెచ్‌డీసీ ఏర్పాటుకు అనువైన భవనం, సౌకర్యాలున్న ఆర్బీకేలను ఎంపిక చేస్తారు. అగ్రికల్చర్, హార్టికల్చర్ సైన్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్, గ్రాడ్యుయేషన్, డిప్లమో పూర్తయిన ఆర్బీకేల్లోని వ్యవసాయ, ఉద్యాన, పట్టు సహాయకుల (వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏ)ను ఎంపిక చేస్తారు. వీరికి జిల్లా స్థాయిలోని కేవీకే, ఏఆర్ఎస్, డాట్ సెంటర్లలో ఏప్రిల్–మే నెలల్లో కనీసం మూడు వారాల పాటు విడతల వారీగా పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపిక చేసిన ఆర్బీకేల్లో అవసరమైన మినీ కిట్స్‌తో పాటు పంటల ఆధారిత లీఫ్ కలర్ (ఎల్‌సీసీ), సూక్ష్మ పోషక లోపాల చార్ట్‌లను అందిస్తారు. ప్రత్యేకంగా. ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ కోసం మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు.

**అగ్రి ల్యాబ్స్‌లో ఉచితంగా పరీక్షలు**

స్థానికంగా పరీక్షించ తగ్గ వాటిని ఆర్బీకే స్థాయిలో పరీక్షిస్తారు. భూసారంతో పాటు సూక్ష్మపోషక లోపాలు, మొక్కలకు వచ్చే తెగుళ్లు, వ్యాధులను నిర్ధారించేందుకు వాటి శాంపిల్స్‌ను సమీప వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్‌కు పంపిస్తారు. నిర్దేశిత గడువులోగా ఉచితంగా పరీక్షించి వాటి ఫలితాలను ఎస్ఎంఎస్, వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా రైతులకు పంపిస్తారు. అవే ఫలితాలను సంబంధిత శాస్త్రవేత్తలకు పంపిస్తారు. ఫలితాల ఆధారంగా వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు సూచించే సిఫార్సులను రాత పూర్వకంగా రైతులకు అందిస్తారు. ఏ రకమైన ఎరువులు ఎంత మోతాదులో ఏ సమయంలో వాడాలో చెబుతారు. సామూహికంగా, వ్యక్తిగతంగా పాటించాల్సిన జాగ్రత్తలు, ఆచరించాల్సిన యాజమాన్య పద్ధతులపై పీహెచ్‌డీసీల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తారు. సిఫార్సు మేరకు అవసరమైన సూక్ష్మ పోషకాలు, మందులు తగిన మోతాదులో అందేలా చూస్తారు. 2023–24లో కనీసం 5 లక్షల భూసార పరీక్షలు నిర్వహించి ప్రతీ రైతుకు ఈ పీహెచ్‌డీసీల ద్వారా సాయిల్ హెల్త్ కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# ఏఐలో మనదే హవా!

## దేశ వృద్ధి రేటులో కీలకం కానున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

- భారీగా ఉద్యోగావకాశాలు..
- వెల్లడించిన టీమ్‌లీజ్ డిజిటల్ సర్వే



**సాక్షి, అమరావతి:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) రానున్న రోజుల్లో భారత ఆర్థిక వృద్ధికి కీలక ఉత్ప్రేరకంగా మారనుంది. దేశ జీడీపీకి 10 శాతం వాటాను సమకూర్చనుంది. భారీగా ఉద్యోగ అవకాశాలను కూడా కల్పించనుంది. ప్రపంచంలోనే అత్యుత్తమ ఏఐ నిపుణులకు భారత్ కేంద్ర స్థానంగా రూపాంతరం చెందుతోంది. ఈ విషయాలను 'ఐసెట్ ఫోర్సెస్ షేపింగ్ ఫ్యూచర్ ఆఫ్ టెక్నాలజీ' పేరుతో ప్రముఖ రీసెర్చ్ సంస్థ 'టీమ్‌లీజ్ డిజిటల్' వెల్లడించింది. 2027–28 నాటికి ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏర్పడాలన్నది భారత్ లక్ష్యం. 2025 నాటికే దేశ జీడీపీకి ఏఐ దాదాపు 500 బిలియన్ డాలర్లు సమకూర్చనుందని ఈ నివేదిక పేర్కొంది. 2035 నాటికి ఏకంగా 967 బిలియన్ డాలర్లు సమకూరుస్తుందని కూడా అంచనా వేసింది. ఏఐ రంగంలో పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి. 2020లో కొత్తగా 36 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాగా.. 2021లో 77.5 బిలియన్ డాలర్ల కొత్త పెట్టుబడులు వచ్చాయి. 2022లో ఏఐ రంగంలోని పెట్టుబడుల్లో భారత్ వాటా 1.5 శాతంగా ఉంది. 2025 నాటికి ఇది 5 శాతానికి పెరుగుతుందని భావిస్తున్నారు.

**భారీగా ఉద్యోగాలు..**

దేశంలో కొత్త ఉద్యోగాల కల్పనలోనూ ఏఐ రంగం ప్రధాన పాత్ర పోషిస్తోంది. 2023 ప్రారంభంలోనే కొత్తగా 45 వేల ఉద్యోగాల భర్తీకి కంపెనీలు నియామక ప్రక్రియను ప్రకటించాయి. డేటా సైంటిస్టులు, మెషీన్ లెర్నింగ్ ఇంజనీర్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. వివిధ స్థాయిల్లో ఉద్యోగులకు ప్రారంభ వార్షిక వేతనాలే రూ.10 లక్షల నుంచి 14 లక్షల వరకు ఉన్నాయి. 8 ఏళ్ల అనుభవం ఉన్న ఉద్యోగులకు వార్షిక వేతనాలు రూ.25 లక్షల నుంచి 45 లక్షల వరకు ఉన్నాయి. ఏఐ రంగానికి నిపుణులను అందించడంలో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉంది. భారత్‌లో ఇప్పటికి 4 లక్షల మంది ఏఐ నిపుణులు ఉన్నట్టు అంచనా. ప్రపంచంలో 16 శాతం మంది నిపుణులు భారత్‌లో ఉన్నారు. ఈ రంగంలో నైపుణ్యవంతమైన మానవ వనరులున్న నగరాల్లో బెంగళూరు ప్రపంచంలోనే 5వ స్థానంలో ఉండగా.. ఢిల్లీ 18, హైదరాబాద్ 19, ముంబై 27 స్థానాల్లో ఉన్నాయి. దీంతో భారత్ ఏఐ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచవ్యాప్తంగా పలు కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయి.

# జీ–20 సదస్సుకు విశాఖ ముస్తాబు




బీచ్ రోడ్డులో డెస్టినేషన్ ఆంధ్రా..విశాఖపట్నం సిటీ

**డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ):** జీ–20 దేశాల సదస్సుకు విశాఖ ముస్తాబవుతోంది. ఇందుకోసం నగరంలో సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. డివైడర్లకు రంగులు వేశారు. డివైడర్ల మధ్యలో ఉన్న చెట్లకు వేసిన జాతీయ జెండా రంగులు అందరినీ అలరిస్తున్నాయి. దాదాపు పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు మరో 3 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు వెల్లడించారు. అతిథులు విశాఖ నగరంలో పర్యటించే సమయంలో జీవీఎంసీ చేపడుతున్న పలు ప్రాజెక్టులను వారికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తామని చెప్పారు. జీ–20 సదస్సు జరిగే ప్రాంతాలు తెలిపేందుకు సంబంధించి టోల్ ఫ్రీ ఏర్పాటు చేశామని తెలిపారు.

# పారిశ్రామికాభివృద్ధికి నవరత్నాలు

**ఇవీ 9 మిషన్లు**

## తొమ్మిది మిషన్స్‌తో 2023-27 పారిశ్రామిక పాలసీ

- విదేశీ పెట్టుబడుల నుంచి ఎంఎస్ఎంఈల వరకు ఒకే విధమైన ప్రోత్సాహం
- పీపీపీ విధానంలో పారిశ్రామిక, లాజిస్టిక్ పార్కుల ఏర్పాటు
- వాక్ టు వర్క్ తరహాలోపారిశ్రామిక టౌన్‌షిప్స్ అభివృద్ధి
- దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో 33/66 ఏళ్ల లీజుపై భూములు అప్పగింత
- వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించి పదేళ్లు దాటితే భూముల కొనుగోలుకు అవకాశం
- విశాఖ సమ్మిట్‌లో ఎంవోయూ చేసుకున్న సంస్థలు ఆరు నెలల్లో పనులు ప్రారంభిస్తే ఎర్లీబర్డ్ రాయితీలు
- ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు,ఎంఎస్ఎంఈ యూనిట్లకు ప్రత్యేక రాయితీలు



**సాక్షి, అమరావతి:** అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా మౌలిక వసతులకు పెద్దపీట వేస్తూ 2023 – 27 పారిశ్రామిక పాలసీని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందుకోసం తొమ్మిది మిషన్లను నిర్దేశించుకుని పూర్తిస్థాయి పారిశ్రామిక ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేసేలా పాలసీలో పలు ప్రతిపాదనలు చేశారు. పరిశ్రమలకు తక్కువ వ్యయంతో అన్ని మౌలిక వసతులతో కూడిన భూములను అందుబాటు ధరల్లో అందించనున్నారు. ఇందుకోసం నాలుగేళ్లలో మూడు లక్షల ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో పారిశ్రామిక పార్కులు, మౌలిక వసతుల అభివృద్ధితో పాటు స్టార్టప్‌లు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించేలా ప్రత్యేక వ్యవస్థను ప్రోత్సహించనున్నారు. ఇదే సమయంలో అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న ఎంఎస్ఎంఈలతోపాటు మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా పాలసీని రూపొందించారు.

- ➢ ఎకనామిక్ గ్రోత్: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో పాటు స్థానిక పెట్టుబడులను ఆకర్షించే విధంగా పూర్తిస్థాయి ఇండస్ట్రియల్ ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేయడం. ప్రపంచస్థాయి పారిశ్రామిక మౌలిక వసతులతో పాటు లాజిస్టిక్ కల్పన, సులభతర వాణిజ్యం, ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించనున్నారు.
- ➢ పోర్టు ఆధారిత అభివృద్ధి: పోర్టు ప్రాంతాలు అభివృద్ధికి మూల స్తంభాలుగా ప్రణాళికలు. వీసీఐసీ, సీబీఐసీ, హెచ్‌బీఐసీ కారిడార్స్‌తో పాటు రైలు, రోడ్డు, అంతర్గత జలరవాణా మార్గాలను ప్రస్తుత పోర్టులతో పాటు కొత్తగా నిర్మించే పోర్టులకు అనుసంధానిస్తారు.
- ➢ లాజిస్టిక్స్ వ్యవస్థను పెంచడం: సరుకు రవాణా వ్యయం తగ్గించే విధంగా రోడ్ రైల్ నెట్‌వర్క్‌ను పెంచడం. కోస్టల్ షిప్పింగ్, అంతర్గత జలరవాణా మార్గాలను ప్రోత్సహించడం. లాజిస్టిక్ పార్కుల అభివృద్ధితో పాటు గిడ్డంగులు, శీతలీకరణ గిడ్డంగులు సౌకర్యాలను పెంచడం.
- ➢ రెడీ టు బిల్ట్ పార్కులు: పరిశ్రమలు తక్షణం వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించే విధంగా ప్రస్తుత పారిశ్రామిక పార్కులతో పాటు కొత్తగా వచ్చే పార్కుల్లో రెడీ టు బిల్ట్ ఫ్యాక్టరీలు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ స్పేస్‌లు, స్టాండర్డ్ డిజైన్ ఫ్యాక్టరీస్‌ను అభివృద్ధి చేయడం. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో పారిశ్రామిక పార్కులు, మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రైవేట్ పారిశ్రామిక, ఎంఎస్ఎంఈ పార్కులను నెలకొల్పడం.
- ➢ పారిశ్రామిక సేవలన్నీ ఒకేచోట: ప్రభుత్వ విభాగాలకు చెందిన సేవలు, అనుమతులన్నీ ఒకేచోట లభించే విధంగా వైఎస్సార్ ఏపీ వన్‌ను అభివృద్ధి చేస్తారు.
- ➢ ఉద్యోగ కల్పన: రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేలా ఎంఎస్ఎంఈ రంగానికి ప్రోత్సహించడంతోపాటు ఇబ్బందుల్లో ఉన్న ఎంఎస్ఎంఈలకు చేయూతనివ్వడం. లార్జ్, మెగా, అల్ట్రా మెగా పరిశ్రమలకు నిపుణులైన మానవ వనరులను అందించే విధంగా శిక్షణ, ఉపాధి కోసం ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు.
- ➢ నైపుణ్యం కలిగిన మానవ వనరులు: కనీస చదువులు పూర్తి చేసుకున్న యువతకు పరిశ్రమల్లో అవసరమైన రంగాల్లో ప్రాక్టికల్ శిక్షణ అందించేలా నైపుణ్య శిక్షణ కోర్సులను అందుబాటులోకి తెచ్చి సాఫ్ట్ స్కిల్స్‌ను పెంపొందిస్తారు.
- ➢ స్టార్టప్ కల్చర్‌ను ప్రోత్సహించడం: యువతను నూతన పారిశ్రామికవేత్తలుగా తీర్చి దిద్దే విధంగా మెంటారింగ్ కార్యక్రమాలు, స్టార్టప్ జోన్స్, స్టార్టప్‌లకు రాయితీలు, స్టార్టప్ ఫైనాన్సింగ్ ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేయడం
- ➢ మహిళలు, బడుగు వర్గాలకు ప్రోత్సాహం: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయడం. వారిని గుర్తించి పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయూతనివ్వడం.

| పరిశ్రమలు ఇలా | జిల్లాలు |
|---|---|
| తక్కువ పరిశ్రమలు ఉన్నవి  | అనంతపురం, అన్నమయ్య, బాపట్ల, అంబేద్కర్ కోనసీమ, కర్నూలు, కృష్ణా, నంద్యాల, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, వైఎస్ఆర్, అల్లూరి సీతారామరాజు పాడేరు |
| మధ్యస్థాయిలో పరిశ్రమలు ఉన్నవి  | చిత్తూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, కాకినాడ, ఎన్‌టీఆర్, పల్నాడు, ప్రకాశం, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు, సత్యసాయి, విజయనగరం |
| అధికంగా పరిశ్రమలున్నవి | అనకాపల్లి, తిరుపతి, విశాఖ |

### సమానంగా అభివృద్ధి చెందేలా..

నాలుగేళ్ల కాలానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023 – 27 పారిశ్రామిక పాలసీ ఈ ఏడాది ఏప్రిల్ 1వతేదీ నుంచి అమల్లోకి రానుంది. గత మూడేళ్లలో వచ్చిన మార్పులను పరిగణనలోకి తీసుకుంటూ అంతర్జాతీయ మార్కెట్లకు సేవలు అందించేలా కొత్త పాలసీని రూపొందించినట్లు పరిశ్రమలు, మౌలిక వసతులు పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ తెలిపారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సమానంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందే విధంగా పాలసీలో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లాల వారీగా వివరాలు సేకరించి పరిశ్రమలు తక్కువగా ఉన్న చోట్ల మరిన్ని ఏర్పాటయ్యేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

### పెట్టుబడుల ఆకర్షణకు దృష్టిసారించే ప్రధాన రంగాలు

- కెమికల్స్–పెట్రోకెమికల్స్
- ఫార్మాస్యూటికల్స్–బల్క్ డ్రగ్స్
- టెక్స్‌టైల్స్ అండ్ అప్పరెల్స్
- ఆటోమొబైల్ అండ్ ఆటో కాంపోనెంట్స్
- ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ
- అగ్రో, ఫుడ్ ప్రోసెసింగ్
- ఇంజనీరింగ్
- మెడికల్ డివైసెస్
- డిఫెన్స్ అండ్ ఎయిరోస్పేస్



- మెషినరీ అండ్ ఎక్విప్‌మెంట్
- భవిష్యత్తు నాల్గవ తర్గతి పరిశ్రమలు తయారీ రంగం, బయోటెక్నాలజీ, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రికల్ వెహికల్స్
- రెన్యువబుల్ ఎనర్జీకి సంబంధించిన పరికరాల తయారీ

### ప్రతిపాదన నుంచి ఉత్పత్తి దాకా..

రాష్ట్రంలో పెట్టుబడి ప్రతిపాదనలతో వచ్చిన దగ్గర నుంచి ఉత్పత్తి ప్రారంభమయ్యే వరకు సింగిల్ విండో విధానంలో త్వరితగతిన అన్ని అనుమతులను ప్రభుత్వం మంజూరు చేయనుంది. భూముల కోసం పరిశ్రమలు దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లోనే ఏపీఐఐసీ భూమిని కేటాయిస్తుంది. పరిశ్రమలకు 33 – 66 ఏళ్ల కాలానికి లీజు విధానంలో భూమిని కేటాయిస్తారు. వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించిన 10 ఏళ్ల తర్వాత భూములను కొనుగోలు చేసుకునే హక్కును కల్పించనున్నారు. ప్రభుత్వ సేవలన్నీ ఒకే గొడుగు కింద అందించే విధంగా వైఎస్సార్ ఏపీ వన్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఎంఎస్ఎంఈలు, ఎస్సీ ఎస్టీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలతో పాటు లార్జ్, మెగా, అల్ట్రా మెగా ప్రాజెక్టులకు పెట్టుబడి సామర్థ్యం, ఉపాధి కల్పనను బట్టి రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పిస్తారు. మెగా, అల్ట్రా మెగా ప్రాజెక్టులకు సంబంధించి వేగవంతంగా కార్యరూపం దాల్చేలా సీనియర్ అధికారిని ప్రత్యేకంగా కేటాయిస్తారు. ప్రాజెక్టు అమలులో ఈ అధికారి అంబాసిడర్‌గా వ్యవహరిస్తారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో కుదిరిన ఒప్పందాలను త్వరితగతిన వాస్తవ రూపంలోకి తెచ్చేలా సీఎస్ అధ్యక్షతన కమిటీని నియమించిన రాష్ట్ర ప్రభుత్వం దీనికి సంబంధించి ప్రత్యేక రాయితీలను ప్రకటించింది. ఒప్పందం జరిగిన రోజు నుంచి ఆర్నెల్లలో నిర్మాణ పనులు ప్రారంభించే సంస్థలకు ఎర్లీ బర్డ్ కింద ప్రోత్సాహకాలను కల్పించనున్నారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డును అందుకుంటున్న పద్మావతి



పద్మావతి

* కళ

సత్యభామ.. శ్రీ కృష్ణుడు.. వేంకటేశ్వరుడు.. పద్మావతి..
దివ్యమైన పాత్రలన్నింటినీ ఆమె ఆహార్యంతో అందంగా రూపుకడుతుంది.
వైకల్యం ఆమె అభిలాషను అడ్డుకోలేకపోయింది.
అడుగు కదపలేదు అనుకున్నవారి అంచనాలను ఆవలకు నెట్టి
పట్టుదలతో అవరోధాల మెట్లను అధిరోహించింది.
రంగస్థల నటిగా గుర్తింపుతో పాటు స్వరమాధురిగానూ పేరొందింది.
కళారంగంలో రాణిస్తూనే దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ
సేవా పెన్నిధిగానూ ప్రశంసలు అందుకుంటోంది.
ఆమె ప్రతిభకు గుర్తింపుగా మూడుసార్లు
రాష్ట్రపతి పురస్కారం వరించింది.
ఖమ్మం జిల్లావాసి అయిన డాక్టర్ పొట్టబత్తిని పద్మావతి కృషి
ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

# దివ్యమైన ప్రతిభ

హైదరాబాద్‌లోని తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని మునుగనూరులో ఉంటున్నారు డాక్టర్ పద్మావతి. ఆమెకు ఏడాది వయస్సులో పోలియో సోకడంతో రెండు కాళ్ళు చచ్చుబడి పోయాయి. తన పరిస్థితిని చూసి కుటుంబ సభ్యులు ఆమె భవిష్యత్తుపై ఆందోళనకు గురయ్యేవారు. అయితే పద్మావతి ఐదేళ్ల వయస్సులో సెయింట్ మేరీస్ పోలియో పునరావాసం పర్యవేక్షకురాలు ఆస్ట్రేలియాకు చెందిన క్లారా హీటన్‌కు పరిచయం అయ్యారు. క్లారా దత్తత తీసుకోవడంతో పద్మావతి జీవితం కొత్త మలుపు తిరిగింది. క్లారా పర్యవేక్షణలో పద్మావతికి పలు మార్లు శస్త్ర చికిత్స జరిగింది. పాదాలు, నడుము.. భాగాలు శస్త్ర చికిత్సతో సరి చేశారు. అప్పటి వరకు మంచానికే పరిమితమైన ఆమె క్యాలిపర్స్, కర్రలు సహాయంతో క్రమంగా అడుగులు వేయడం మొదలు పెట్టింది. కాలు కదల్చలేని స్థితిలో మంచం మీద ఉండి చదువులో ప్రతిభ కనబరుస్తూ ఎదిగిన తీరు పద్మావతి మాటల్లో మన కళ్ల ముందు కదలాడుతుంది.

## సేవాభిలాష

గానం, నాటక రంగంలో ఉన్న ఆసక్తితో పద్మావతి క్యాలిపర్స్ సహాయంతోనే ప్రతిభ కనబరుస్తూ వచ్చారు. సత్యభామ, శ్రీకృష్ణుడు, వేంకటేశ్వరుడు తదితర పాత్రలను సమర్థంగా పోషించి దేశ వ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చి, ఎన్నో అవార్డులను పొందారు. వేగేశ్న ఫౌండేషన్ ద్వారా సంగీతంలో శిక్షణపొందడంతో పాటు, డిగ్రీ పూర్తి చేసి, ఆ సంస్థలోనే సంగీత ఉపాధ్యాయురాలుగా దివ్యాంగులకు శిక్షణ ఇస్తున్నారు. దివ్యాంగులకు సాయపడాలనే సంకల్పంతో మునుగనూరులో పద్మావతి ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద (డిజ్) ఏబుల్డ్ సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ద్వారా దివ్యాంగులకు కంప్యూటర్, నృత్యం, సంగీతం,



శ్రీకృష్ణుని పాత్రలో పద్మావతి

టైలరింగ్.. వంటి వృత్తి విద్యా కోర్స్‌లలో శిక్షణ ఇప్పించి, ఉపాధి కల్పిస్తున్నారు.

## ప్రశంసలు.. పురస్కారాలు

పద్మావతి ప్రతిభకు ఎన్నో పురస్కారాలు ఆమెను వరించాయి. మూడుసార్లు రాష్ట్రపతి అవార్డులు అందుకున్నారు. ఓ వైపు కళలు, మరోవైపు సామాజిక సేవారంగంలో ప్రతిభ చూపుతున్న ఆమెను రాష్ట్ర ప్రభుత్వం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. సెన్సార్ బోర్డు సభ్యురాలుగా, నంది అవార్డు జ్యూరీ కమిటీ మెంబర్‌గా సేవలందించిన పద్మావతి 2017లో రాష్ట్ర ప్రభుత్వం రోల్ మోడల్ అవార్డును అందుకున్నారు.. కళాకారిణిగా ప్రతిభ చూపినందుకు 2009లో రాష్ట్రపతి అవార్డు లభించింది. వైకల్యంతో బాధపడుతున్నా పలు రంగాలలో రాణించినందుకు గాను 2011లో రాష్ట్రపతి చేతులు మీదుగా స్త్రీ శక్తి పురస్కారాన్ని అందుకున్నారు ఆమె. దివ్యాంగులకు చేస్తున్న సేవను గుర్తించి 2022లో రాష్ట్రపతి సర్వశ్రేష్ఠ దివ్యాంగన్ అవార్డుతో సత్కరించారు.

దివ్యాంగులకు సేవచేయాలనే సదాశయంతో నడుపుతున్న ఇన్‌స్టిట్యూట్‌కు చేయూతనందిస్తే మరిన్నో ప్రయోజన కరమైన పనులను చేయగలననే ఆశాభావాన్ని పద్మావతి వ్యక్తపరుస్తు న్నారు. తన గమనమే ప్రశ్నార్థకం అవుతుందనుకున్నవారి మాటలను పక్కనపెట్టి, పట్టుదలతో ప్రయత్నించి, గెలుస్తున్న ఆమె జీవితం ఎందరికో ఆదర్శమవుతుంది.

– శ్రీరాం యాదయ్య,
హయత్‌నగర్, హైదరాబాద్, సాక్షి

బ్యూటిప్స్

## నలుపు మచ్చలు తగ్గాలంటే..



ముఖంపై, కళ్ల కింద లేదా మోచేతుల భాగంలో నలుపు తగ్గాలంటే..



- టీ స్పూన్ నిమ్మరసంలో స్పూన్ నీళ్లు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో దూది ఉండను ముంచి, మచ్చలపై రాయాలి. ఆరిన తర్వాత కడిగేయాలి. రోజూ ఈ విధంగా చేయడం వల్ల మచ్చలు తగ్గుతాయి.



- మచ్చలపై తేనె రాసి, 10–15 నిమిషాల తర్వాత శుభ్రం చేయాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే మచ్చలు క్రమంగా తగ్గిపోతాయి.



- కలబంద జెల్‌ను మచ్చలు ఏర్పడిన చోట రాసి, 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి.



- బంగాళదుంప రసాన్ని మచ్చలున్న చోట రాయాలి. లేదంటే, బంగాళ దుంప ముక్కతో మచ్చలున్న చోట రెండు నిమిషాలు మృదువుగా రబ్ చేయాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే మచ్చలు తగ్గుతాయి.



- అవకాడో గుజ్జును మచ్చలున్న చోట మాత్రమే కాదు, ముఖమంతా రాసి, ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి. అవకాడోలో ఉన్న సహజ ఔషధ గుణాలు చర్మం పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తాయి.



- రోజ్‌వాటర్‌లో దూది ఉండను ముంచి, మచ్చలున్న చోట రాయాలి. అలాగే శనగ పిండిలో కొన్ని చుక్కల రోజ్‌వాటర్ పోసి, పేస్ట్ చేసి రాయాలి. ఈ విధంగా రోజూ చేస్తూ ఉంటే మచ్చలు క్రమంగా తగ్గిపోతాయి.



- స్ట్రాబెర్రీలో విటమిన్ 'సి' సమృద్ధిగా ఉంటుంది. స్ట్రాబెర్రీ గుజ్జును మచ్చల మీద రాసి, ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి.
- నారింజ తొక్కలను ఎండబెట్టి, పొడి చేయాలి. దీంట్లో కొద్దిగా పాలు పోసి, పేస్ట్‌లా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని మచ్చలున్న చోట రాసి, 20 నిమిషాల తర్వాత శుభ్రం చేయాలి. తగ్గేదాకా ఈ విధంగా చేయాలి.



సందర్భం

బర్ఖాదత్, అపర్ణ పిరమాల్, నందిని సేన్ గుప్తా పుస్తకాలు బెస్ట్-నాన్ ఫిక్షనల్ విభాగంలో అట్ హర్ అవార్డ్-2023 (ఇండియా) గెలుచుకున్నాయి...

# పురస్కార పుస్తకాలు

జర్నలిస్ట్‌గా బర్ఖాదత్ రెండు దశాబ్దాలకు పైగా వృత్తి జీవితం ఒక ఎత్తయితే కోవిడ్ సమయంలో చేసిన రిపోర్టింగ్ ఒక ఎత్తు. ఆ సమయంలోనే తండ్రి చనిపోయాడు. దుఃఖాన్ని బయటపడనివ్వకుండా రిపోర్టింగ్ చేయాల్సి వచ్చింది. ఎక్కడ ఏ రూపంలో మృత్యువు పొంచి ఉందో అన్నట్లుగా ఉండే ఆ కాలంలో తాను చూసిన ఎన్నో అనుభవాలకు 'టు హెల్ అండ్ బ్యాక్: హ్యూమన్స్ ఆఫ్ కోవిడ్' రూపంలో అక్షర రూపం ఇచ్చింది బర్ఖాదత్.





బర్ఖాదత్

కోవిడ్ సంక్షోభ కాలానికి అద్దంపట్టిన అక్షరాలు



అపర్ణ పిరమాల్ రాజే

కోవిడ్ సమయంలో కొత్త కొత్త మానసిక సమస్యలు తలెత్తాయి. 'ధైర్యంగా ఉంటారు' అని పేరున్న వారు కూడా ఆ సమయంలో నీరుగారిపోవడం, విచిత్రంగా ప్రవర్తించడం అనేది అన్ని ప్రాంతాల్లోనూ జరిగింది.

అలాంటి చిత్రవిచిత్ర అనుభవాలను 'కెమికల్ కిచిడీ' పుస్తకంలో నిక్షిప్తం చేసింది అపర్ణ పిరమాల్ రాజే. ఈ పుస్తకాన్ని జ్ఞాపకాల సమాహారం అనుకోవచ్చు. ఆనాటి పరిస్థితులకు అద్దం పట్టే రిపోర్టింగ్ అనవచ్చు. హెల్త్‌గైడ్ అనుకోవచ్చు.

## పరిపాలనా నైపుణ్యం - సాహసతేజాల కలబోత



నందిని సేన్ గుప్తా

పాండిచ్చేరికి చెందిన రచయిత్రి, జర్నలిస్ట్ నందిని సేన్‌గుప్తా రాసిన 'రాణీ దుర్గావతి: ద ఫర్‌గెటన్ లైఫ్ ఆఫ్ ఏ వారియర్ క్వీన్' చరిత్ర వెలుగును వర్తమానంలోకి తీసుకువచ్చింది. కలింజార్ కోట (ఉత్తర్‌ప్రదేశ్)లో పుట్టిన దుర్గావతి గోండ్వానా రాణిగా చరిత్ర సృష్టించింది.

'రాణి' అనిపించుకోవడం కష్టం కాక పోవచ్చు. రాణిగా తన కిరీటాన్ని నిలుపుకోవడం చాలా కష్టం. అడుగడుగునా తనకు సమస్యలే ఎదురయ్యేవి. బయటి శత్రువులతో పాటు ఇంటి దొంగల నుంచి కూడా రకరకాల కుట్రలు ఎదుర్కోవాల్సి వచ్చేది. ఆ కుట్రలను చాకచక్యంగా అణచివేసి 'ఉక్కు మహిళ'గా పేరు తెచ్చుకున్న రాణి దుర్గావతి పాలనాపరమైన నైపుణ్యాల నుంచి సాహస ఘట్టాల వరకు ఎన్నో విషయాలను ఈ పుస్తకంలో కళ్లకు కట్టింది నందిని సేన్‌గుప్తా.

ఇంటిప్స్




- నిమ్మనూనెలో రెండు చుక్కల వేపనూనె వేసి రాత్రి పూట దీపం వెలిగిస్తే గదంతా మంచి వాసన రావడంతోపాటు దోమల బెడద వదులుతుంది. అంతే కాదు. ఇది నేచురల్ కావడం వల్ల మస్కిటో రిపెల్లెంట్ల మూలంగా వచ్చే దుష్ఫలితాలు కూడా ఏమీ ఉండవు.

● గెలుపు దారి

# యానిమేషన్ క్వీన్

**యానిమేషన్‌కు సంబంధించి పెద్ద చదువులు చదివినప్పటికీ చారువీ అగర్వాల్‌కు చిన్న ఉద్యోగమైనా దొరకడం కష్టమైపోయింది. 'నీకు ఉద్యోగం దొరకనప్పుడు సొంతంగా నువ్వే కంపెనీ పెట్టు' అని ఎవరైనా అన్నారో లేదోగాని అగర్వాల్ అక్షరాలా అలాగే చేసింది. ఎంతో మందికి ఉపాధి ఇవ్వడమే కాదు ఆత్మవిశ్వాసం కూడా ఇస్తోంది...**



చారువీ అగర్వాల్

ఫిల్మ్ స్టూడియోలలో మహిళలు తక్కువగా, యానిమేషన్ స్టూడియోలలో మరీ తక్కువగా కనిపించే కాలం అది. అలాంటి కాలంలో తన యానిమేషన్ స్టూడియోలో...

'ఆడవాళ్లు ఏంచేస్తారు. వేరే ఎవరూ లేరా!'

'మీరు చూస్తే చిన్న అమ్మాయిలా కనిపిస్తున్నారు. మీరేం చేయగలరు!'....ఇలాంటి మాటలెన్నో క్లయింట్స్ నుంచి వినిపించాయి.

పురుషాధిపత్య రంగంగా పేరున్న యానిమేషన్ రంగంలో రాణించడం మాట ఎలా ఉన్నా తొలి అడుగు వేయడమే కష్టంగా మారింది.

'నా టైమ్ బాగోలేదు. ఏం చేద్దాం' అనుకుంటే స్టోరీ మరోలా ఉండేది. టైమ్ బాగోలేక పోతే దాన్ని సెట్ చేసుకోవడం మన చేతుల్లోనే ఉంటుంది. అలా ధైర్యం తెచ్చుకుంది అగర్వాల్.

'ఒక్కసారి అవకాశం ఇవ్వండి. ఆ తరువాత మీ ఇష్టం' అనే మాట అగర్వాల్ నోటి నుంచి వచ్చింది.

తాను అలా అడగడం అదే మొదటిసారి.

ఇక ఆ అవసరం ఎప్పుడూ రాలేదు. 'ఒక్కఛాన్స్'తో అగర్వాల్‌లోని ప్రతిభ పదిమందికి తెలిసి పోయింది.

కట్ చేస్తే...

యానిమేషన్ అండ్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఇప్పుడు చారువీ అగర్వాల్ అనేది సుపరిచిత పేరు అయింది. చిన్న ఆఫీస్ గదిలో మొదలైన గుర్తింపు ప్రపంచ వ్యాప్తం అయింది.

అగర్వాల్‌లో యానిమేటర్ మాత్రమే కాదు శిల్పి, పెయింటర్ కూడా ఉన్నారు. తనలోని సృజనాత్మక పరిధి విస్తరించడానికి ఇదొక కారణం.

పుట్టింది దిల్లీలో అయినా నాన్న ఉద్యోగరీత్యా దేశంలోని ఎన్నో ప్రాంతాల్లో పెరిగింది. చదువుకుంది. కొత్త వ్యక్తులు, కొత్త సంస్కృతులతో పరిచయం అయింది. ఆ పరిచయం, ప్రభావం అగర్వాల్‌లో సృజనాత్మక బీజాలు పడడానికి కారణం అయ్యాయి.

'నేను ఆర్టిస్ట్ అవుతాను. వేరే ఏ ఉద్యోగం చేయను' అని తండ్రితో చెప్పింది.

ఆర్ట్‌కు సంబంధించిన విషయాల్లో ఎప్పుడూ తనకు అండగా ఉండే తండ్రికి 'ఫుల్‌టైమ్ ఆర్టిస్ట్' అనే మాట నచ్చలేదు.

అయినా సరే అగర్వాల్ మనసు మారలేదు.

తండ్రిని ఒప్పించి దిల్లీ యూనివర్శిటీలో ఫైన్ ఆర్ట్స్‌లో చేరింది. ఆ తరువాత కెనడాలో కంప్యూటర్ యానిమేషన్ లో మాస్టర్స్ చేసింది.

చదువు పూర్తికాగానే ముంబైకి చేరింది అగర్వాల్.

చిన్నాపెద్దా తేడా లేకుండా ఎన్నో డిజైనింగ్ స్టూడియోల చుట్టూ తిరిగినా ఉద్యోగం దొరక లేదు.

'యానిమేషన్ స్టూడియోలలో ప్రతి విభాగంలోనూ పురుషులే కనిపించేవారు. అలాంటి సమయంలో నాలాంటి వాళ్లు వచ్చి యానిమేటర్‌గా అవకాశం ఇవ్వండి అని అడగడం వారికి ఆశ్చర్యంగా అనిపించేది. నేను చేసిన పనులు, చదివిన చదువు గురించి ఎంతమాత్రం పట్టించుకునేవారు కాదు. కళ్లలో నిర్లక్ష్యం కనిపించేది' అని ఆ రోజుల్ని గుర్తు చేసుకుంటుంది అగర్వాల్.

ముంబైలో తనకు ఉద్యోగం దొరకడం అనేది ఎడారిలో నీళ్ల దొరకడమంత కష్టం అనిపించింది. ఆ సమయంలో తానే సొంతంగా కంపెనీ మొదలు పెట్టాలనుకుంది. అలా గురుగ్రామ్ కేంద్రంగా చారువీ డిజైన్ ల్యాబ్స్(సిడీఎల్) మొదలు పెట్టింది.



'వీళ్లేం చేస్తారులే' అనుకున్న కంపెనీ క్వాలిటీ యానిమేషన్ కంటెంట్‌తో 'వీళ్లు మాత్రమే చేయగలరు' అనిపించుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు అందుకుంది. ఎన్నో అపోహలను బద్దలు కొట్టింది. మహిళలు యానిమేషన్ రంగంపై దృష్టి సారించడానికి స్ఫూర్తి ఇచ్చింది.

'ఆర్ట్ అనేది నాకు నిరంతర స్ఫూర్తి. అండగా నిలిచే శక్తి' అంటోంది చారువీ అగర్వాల్.



# ట్రావెలాదాయం

ఉద్యోగానికి సెలవు పెట్టి 'ట్రావెల్' చేయడం అనేది సాధారణం. అయితే యూత్‌లో కొందరు 'ట్రావెలింగ్'నే ఉద్యోగం చేసుకుంటున్నారు. తమ చానల్‌తో వ్యక్తిగత అభిరుచి తీర్చుకోవడంతో పాటు బ్రాండ్లతో కొలాబరేట్ కావడం ద్వారా ఆదాయాన్ని కూడా ఆర్జిస్తున్నారు...

దిల్లీకి చెందిన టాన్యా కనింజో ట్రావెలింగ్ కోసం కార్పొరేట్ ఉద్యోగానికి గుడ్‌బై చెప్పింది. ఫుల్‌టైమ్ ట్రావెలర్‌గా మారింది. తన ఎగ్జైటింగ్ ట్రావెల్ జర్నీని ఇతరులతో పంచుకోవడానికి వ్లాగింగ్(వీడియో బ్లాగ్) చానల్‌ను ఆరంభించింది.

క్యాంపింగ్, ట్రెక్కింగ్, రకరకాల ఆహారపదార్థాల రుచులు, వివిధ సంస్కృతులకు సంబంధించి ఆసక్తికర విషయాలను పంచుకోవడంతోపాటు ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వీడియోలు చేస్తుంది.

మన ఈశాన్య రాష్ట్రాల నుంచి ఆఫ్రికా వరకు ఎన్నో ప్రదేశాలు తిరిగి వచ్చింది టాన్యా.

ముంబైకి చెందిన కృతిక గోయెల్ ప్రయాణ ఆనందాలను సొంతం చేసుకోవడంతోపాటు బ్రాండ్లతో కొలాబరేట్ కావడం ద్వారా కూడా ఆదాయాన్ని ఆర్జిస్తుంది.

'మీ చానల్ చూడడం మొదలుపెట్టిన తరువాత ప్రయాణాలపై ఆసక్తి మొదలైంది. ఒంటరిగా ఎన్నో ప్రయాణాలు చేశాను' అంటూ ఎంతో మంది మహిళలు చెప్పినప్పుడు తన సంతోషం రెట్టింపు అవుతుంది.

'గ్లామరస్‌గా, ఫన్‌గా ఉండడమే కాదు రకరకాల సవాళ్లు ఎదురవుతుంటాయి' అని తన ప్రయాణ అనుభవాల గురించి చెబుతుంది కృతిక.

'ప్రయాణాలు నాలో ఎంతో మార్పు తీసుకువచ్చాయి. ఓపెన్ మైండ్‌తో ఆలోచించడం అలవాటు అయింది. అంతకుముందు పెద్ద సమస్యలు అనుకున్నవి ఇప్పుడు చాలా చిన్న సమస్యలుగా కనిపిస్తున్నాయి' అంటుంది కృతిక.



టాన్యా కనింజో

ట్రావెల్ కంటెంట్ క్రియేటర్‌గా పెద్ద పేరే తెచ్చుకుంది లారిసా.

చిన్నప్పుడు కుటుంబసభ్యులతో పాటు దేశంలోని ఎన్నో ప్రాంతాలకు వెళ్లిన లారిసాకు ప్రయాణలపై అలా ఆసక్తి మొదలైంది.

'ప్రయాణం ఇచ్చిన జ్ఞానం మరేదీ ఇవ్వదు. ప్రయాణం సంతోషం ఇవ్వడమే కాదు సహనాన్ని కూడా అలవాటు చేస్తుంది' అంటుంది లారిసా.



లారిసా

ప్రయాణాలు చేయడం ఒక ఎత్తయితే, సాంకేతిక విషయాలపై అవగాహన పెంచుకోవడం అనేది మరో ఎత్తు. తమ చానల్స్ కోసం యు కట్, వీడియో గురు, వైవా... మొదలైన వీడియో ఎడిటర్‌లను ఉపయోగించడంలో ప్రావీణ్యం సంపాదిస్తున్నారు.

'ప్రయాణం ఇచ్చిన జ్ఞానం మరేదీ ఇవ్వదు. ప్రయాణం సంతోషం ఇవ్వడమే కాదు సహనాన్ని కూడా అలవాటు చేస్తుంది' అంటుంది లారిసా.

మొదట్లో నాణ్యమైన వీడియోలు తీసే స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు అనుకున్నవారు ఇప్పుడు డ్రోన్ కెమెరాలపై దృష్టి పెడుతున్నారు. డ్రోన్ కెమెరాలు మన మార్కెట్‌లోకి వచ్చిన కొత్తలో ధరలు ఆకాశంలో ఉండేవి. అయితే ఇప్పుడు అందుబాటుధరల్లో ఉపయోగించే ఫ్లైయింగ్ డ్రోన్ కెమెరాలు కూడా రావడంతో వాటిపై ఆసక్తి మొదలైంది.

తమ కంటెంట్‌కు డ్రోన్ కెమెరాలు 'వావ్ టచ్' ఇస్తాయని బలంగా నమ్ముతున్నారు.

తేలికపాటి బరువుతో కూడిన ఫోల్డబుల్ డ్రోన్ కెమెరా, డ్యూయల్ డ్రోన్ కెమెరా, 4కే ఆడ్జస్టబుల్ లెన్స్, జీపీఎస్ లొకేషన్‌లతో కూడిన సూపర్ టాయ్ డ్రోన్ కెమెరా... ఇలా ఎన్నో ఉన్నాయి. ఇక ఆరంభ స్థాయిలో ఉన్నవారి కోసం లారియో వై-ఫై హెచ్‌డీ డ్రోన్ కెమెరాలాంటివి ఉన్నాయి.

ప్రయాణం అనేది ఒకప్పుడు వ్యక్తిగత అనుభూతుల సమాహారం మాత్రమే. అయితే సోషల్ మీడియా విస్తృతి పెరిగాక 'ట్రావెలింగ్'కు మంచి మార్కెట్ ఏర్పడింది. ఆ మార్కెట్ డైనమిక్స్‌ను సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రయాణ దాహం తీరడమే కాదు, నాలుగు డబ్బులు కూడా సంపాదించవచ్చని యువతరంలో ఎంతోమంది సృజనాత్మకంగా నిరూపిస్తున్నారు.



## సిరాజ్ చేజారిన 'టాప్' ర్యాంక్...

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ తన టాప్ ర్యాంక్‌ను కోల్పోయి మూడో స్థానానికి పడిపోయాడు. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో 3 వికెట్లు తీసిన సిరాజ్, రెండో వన్డేలో మాత్రం 3 ఓవర్లలో 37 పరుగులిచ్చాడు. ఈ ప్రదర్శనే సిరాజ్ ర్యాంక్‌పై ప్రభావం చూపింది. సిరాజ్ ఖాతాలో 702 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. ఆస్ట్రేలియా పేసర్ హాజల్‌వుడ్ 713 పాయింట్లతో టాప్ ర్యాంక్‌కు చేరుకోగా... ట్రెంట్ బౌల్ట్ (న్యూజిలాండ్) 708 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు.

## టెక్సస్ సూపర్ కింగ్స్ కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్

అమెరికాలో జులైలో జరగనున్న మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) టి20 టోర్నీలో పాల్గొనే టెక్సస్ సూపర్ కింగ్స్ జట్టు కోచ్‌గా న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వ్యవహరిస్తారు. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుకు ఫ్లెమింగ్ హెడ్ కోచ్‌గా ఉన్నాడు. ఫ్లెమింగ్ శిక్షణలో సీఎస్‌కే నాలుగుసార్లు ఐపీఎల్ చాంపియన్‌గా నిలిచింది. ఎంఎల్‌సీలో ఆరు జట్లు బరిలో ఉండగా, నాలుగు జట్లను ఐపీఎల్ యాజమాన్యాలే కొనుగోలు చేశాయి.



# సిరీస్ సమర్పయామి

నాలుగేళ్ల క్రితం ఆస్ట్రేలియా జట్టు భారత పర్యటనలో వన్డే సిరీస్‌లో ఒకదశలో 0-2తో వెనుకబడింది. కానీ చివరకు 3-2తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు కూడా దాదాపు అదే తరహాలో వెనుకబడినా కూడా పుంజుకొని కంగారూ టీమ్ భారత గడ్డపై మరో వన్డే సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకుంది. తొలి రెండు వన్డేల్లో పేస్, స్వింగ్ బౌలింగ్‌ను ఆడలేక తడబడిన టీమిండియా తుదిపోరులో స్పిన్‌కు బోల్తా పడింది. ఒక్కరు కూడా అర్ధ సెంచరీ చేయకపోయినా అంతా తలా ఓ చేయి వేయడంతో ఆసీస్ ముందుగా 269 పరుగులు సాధించింది. ఊహించినట్లుగా స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై మన బ్యాటర్లు తడబడ్డారు. రోహిత్, గిల్ ఇచ్చిన మెరుపు ఓపెనింగ్ భాగస్వామ్యం, ఆ తర్వాత కోహ్లి, రాహుల్ అర్ధ సెంచరీ పార్ట్‌నర్‌షిప్‌తో ఒకదశలో టీమిండియా విజయం దిశగా సాగుతున్నట్లు అనిపించింది. అయితే 39 పరుగుల వ్యవధిలో నాలుగు కీలక వికెట్లు కోల్పోయి జట్టు ఓటమిని ఆహ్వానించింది. టెస్టు సిరీస్ కోల్పోయినా ఒక మ్యాచ్ నెగ్గిన ఆసీస్ బృందం, ఇప్పుడు వన్డే సిరీస్‌తో సంతృప్తిగా స్వదేశం వెళ్లనుంది.


రోహిత్ శర్మ

- చివరి వన్డేలో ఓడిన భారత్
- 2–1తో సిరీస్ ఆస్ట్రేలియా సొంతం
- ఆసీస్‌ను గెలిపించిన స్పిన్నర్లు
- టీమిండియా సమష్టి వైఫల్యం



**చెన్నై:** స్టీవ్ స్మిత్ సారథ్యంలోని ఆస్ట్రేలియా స్ఫూర్తిదాయక ప్రదర్శనతో వన్డే సిరీస్‌ను గెలుచుకుంది. బుధవారం జరిగిన చివరి మ్యాచ్‌లో ఆసీస్ 21 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. తొలి మ్యాచ్‌లో ఓడి రెండో వన్డేలో నెగ్గిన కంగారూ బృందం 2–1తో సిరీస్‌ను దక్కించుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 49 ఓవర్లలో 269 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (47 బంతుల్లో 47; 8 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... పాండ్యా, కుల్దీప్ చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 49.1 ఓవర్లలో 248 పరుగులకే ఆలౌటైంది. కోహ్లి (72 బంతుల్లో 54; 2 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా, హార్దిక్ పాండ్యా (40 బంతుల్లో 40; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆడమ్ జంపా (4/45) భారత్‌ను దెబ్బ తీశాడు. మెరుపు వేగంతో ఈ సిరీస్‌లో 194 పరుగులు చేసిన మిచెల్ మార్ష్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికయ్యాడు.

**ఆసీస్ శుభారంభం...**

గత మ్యాచ్‌ల తరహాలోనే ఆసీస్‌కు ఓపెనర్లు హెడ్ (31 బంతుల్లో 33; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), మార్ష్ శుభారంభం అందించారు. వీరిద్దరు తొలి 10 ఓవర్లలో 61 పరుగులు జత చేశారు. పిచ్‌పై స్పిన్‌కు అనుకూలిస్తున్నట్లు కనిపించడంతో ఆరో ఓవర్లోనే భారత్ అక్షర్‌తో బౌలింగ్ చేయించింది. అయితే పాండ్యా బౌలింగ్‌కు దిగి మ్యాచ్ పరిస్థితిని మార్చాడు. తన తొలి మూడు ఓవర్లలో అతను హెడ్, స్మిత్ (0), మార్ష్‌లను పెవిలియన్ పంపించాడు. ఈ దశలో వార్నర్ (23), లబుషేన్ (28) కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరిని కుల్దీప్ అవుట్ చేయడంతో స్కోరు 138/5 వద్ద నిలిచింది. ఈ సమయంలో క్యారీ (46 బంతుల్లో 38; 2 ఫోర్లు, 1 సిక్స్), స్టొయినిస్ (25) భాగస్వామ్యం జట్టు ఇన్నింగ్స్‌ను నడిపించింది. వీరిద్దరు 58 పరుగులు జత చేశారు. భారత బౌలర్లు మళ్లీ దెబ్బ కొట్టడంతో ఆసీస్ స్కోరు 203/7కు చేరింది. సరిగ్గా ఇక్కడే భారత్ పట్టు కోల్పోయింది. లోయర్ ఆర్డర్ అండతో చివరి మూడు వికెట్లకు ఆసీస్ 66 పరుగులు జత చేయడం విశేషం.

**రాణించిన పాండ్యా...**

ఛేదనను ఓపెనర్లు రోహిత్ శర్మ (17 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (49 బంతుల్లో 37; 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ప్రారంభించారు. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై ఎదురుదాడినే నమ్ముకున్నారు. అయితే 12 పరుగుల వ్యవధిలో వీరిద్దరిని ఆసీస్ వెనక్కి పంపించింది. ఈ దశలో కోహ్లి, రాహుల్ (50 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్) జాగ్రత్తగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 69 పరుగులు జత చేశారు. అయితే మరీ నెమ్మదిగా ఆడిన రాహుల్‌తో పాటు అక్షర్ (2) కూడా నిష్క్రమించారు. కోహ్లి, పాండ్యా ఉన్నంత వరకు భారత్‌కు గెలుపు ఆశలు ఉన్నాయి. 61 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న కోహ్లి పేలవ షాట్‌కు వెనుదిరగడంతో ఆసీస్ ఒత్తిడి పెంచింది. సూర్యకుమార్ (0) విఫలం కాగా, పాండ్యాను అవుట్ చేసి జంపా దెబ్బ కొట్టాడు. రవీంద్ర జడేజా (33 బంతుల్లో 18; 1 ఫోర్ ) ఆశించిన స్థాయిలో వేగంగా ఆడలేకపోవడంతో లక్ష్యం మరీ కష్టంగా మారిపోయింది. మరింత కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన ఆసీస్ భారత బ్యాటర్లను కట్టడి చేయడంతో చివరకు ఓటమి తప్పలేదు.

### సూర్యకుమార్ 'హ్యాట్రిక్ గోల్డెన్ డక్'

పాపం సూర్యకుమార్ యాదవ్.. టి20ల్లో విధ్వంసకర బ్యాటింగ్‌తో నంబర్‌వన్‌గా ఎదిగిన అతను వన్డేల్లో మాత్రం 'బాంబే డక్'గా మారి పోయాడు. ఈ సిరీస్‌కు ముందు కూడా వన్డేల్లో గొప్ప రికార్డేమీ లేకపోయినా ఈసారి ప్రదర్శన మాత్రం అయ్యో అనిపించేదే. సిరీస్‌లో ఆడిన మూడు వన్డేల్లోనూ తొలి బంతికే వెనుదిరిగి 0, 0, 0తో 'హ్యాట్రిక్ గోల్డెన్ డక్'ను నమోదు చేశాడు. గతంలో భారత ఆటగాళ్లు వరుసగా మూడు వన్డేల్లో డకౌటైనా, ఇలా మూడుసార్లు తొలి బంతికే ఎవరూ వెనుదిరగలేదు.

### స్కోరు వివరాలు

**ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** హెడ్ (సి) కుల్దీప్ (బి) పాండ్యా 33; మార్ష్ (బి) పాండ్యా 47; స్మిత్ (సి) రాహుల్ (బి) పాండ్యా 0; వార్నర్ (సి) పాండ్యా (బి) కుల్దీప్ 23; లబుషేన్ (సి) గిల్ (బి) కుల్దీప్ 28; క్యారీ (బి) కుల్దీప్ 38; స్టొయినిస్ (సి) గిల్ (బి) అక్షర్ 25; అబాట్ (బి) అక్షర్ 26; అగర్ (సి) అక్షర్ (బి) సిరాజ్ 17; స్టార్క్ (సి) జడేజా (బి) సిరాజ్ 10; జంపా (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (49 ఓవర్లలో ఆలౌట్) 269. వికెట్ల పతనం** : 1-68, 2-74, 3-85, 4-125, 5-138, 6-196, 7-203, 8-245, 9-247, 10-269. **బౌలింగ్:** షమీ 6-0-37-0, సిరాజ్ 7-1-37-2, అక్షర్ 8-0-57-2, పాండ్యా 8-0-44-3, జడేజా 10-0-34-0, కుల్దీప్ 10-1-56-3.

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ (సి) స్టార్క్ (బి) అబాట్ 30; గిల్ (ఎల్బీ) (బి) జంపా 37; కోహ్లి (సి) వార్నర్ (బి) అగర్ 54; రాహుల్ (సి) అబాట్ (బి) జంపా 32; అక్షర్ (రనౌట్) 2; పాండ్యా (సి) స్మిత్ (బి) జంపా 40; సూర్యకుమార్ (బి) అగర్ 0; జడేజా (సి) స్టొయినిస్ (బి) జంపా 18; కుల్దీప్ (రనౌట్) 6; షమీ (బి) స్టొయినిస్ 14; సిరాజ్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (49.1 ఓవర్లలో ఆలౌట్) 248. వికెట్ల పతనం:** 1-65, 2-77, 3-146, 4-151, 5-185, 6-185, 7-218, 8-225, 9-243, 10-248. **బౌలింగ్:** స్టార్క్ 10-0-67-0, స్టొయినిస్ 9.1-0-43-1, అబాట్ 10-0-50-1, జంపా 10-0-45-4, అగర్ 10-0-41-2.

# నిఖత్‌కు పతకం ఖాయం

సెమీఫైనల్లో భారత స్టార్ బాక్సర్ • నీతూ, స్వీటీ, లవ్లీనాలకు కూడా పతకాలు


నిఖత్

**న్యూఢిల్లీ:** ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు నాలుగు పతకాలు ఖాయమయ్యాయి. డిఫెండింగ్ చాంపియన్, తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ (50 కేజీలు)తోపాటు నీతూ (48 కేజీలు), లవ్లీనా బొర్గోహైన్ (75 కేజీలు), స్వీటీ బూరా (81 కేజీలు) సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాలను ఖరారు చేసుకున్నారు. భారత్‌కే చెందిన సాక్షి చౌధరీ (52 కేజీలు), మనీషా మౌన్ (57 కేజీలు), జాస్మిన్ (60 కేజీలు), నుపుర్ (ప్లస్ 81 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో నిఖత్ 5–2తో చుథామట్ రక్సాట్ (థాయ్‌లాండ్)పై, లవ్లీనా 5–0తో అడోసిండా (మొజాంబిక్)పై, స్వీటీ 5–0తో విక్టోరియా కెబికావా (బెలారస్)పై గెలుపొందారు. మరో బౌట్‌లో నీతూ పంచ్‌ల ధాటికి ఆమె ప్రత్యర్థి మదోక వాడా (జపాన్) తట్టుకోలేకపోవడంతో రిఫరీ రెండో రౌండ్‌లోనే బౌట్‌ను నిలిపి వేసి నీతూను విజేతగా ప్రకటించారు. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో సాక్షి 0–5తో యు వూ (చైనా) చేతిలో, మనీషా 1–4తో అమీనా జిదాని (ఫ్రాన్స్) చేతిలో, జాస్మిన్ 0–5తో పాలో వాల్డెజ్ (కొలంబియా) చేతిలో, నుపుర్ 3–4తో లజత్ కుంగెబయేవా (కజకిస్తాన్) చేతిలో ఓటమి చవిచూశారు.

## సరబ్‌జ్యోత్ 'పసిడి' గురి

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ



**భోపాల్:** సొంతగడ్డపై బుధవారం మొదలైన ప్రపంచ కప్ పిస్టల్, రైఫిల్ షూటింగ్ టోర్నీలో తొలి రోజు భారత షూటర్లు రెండు పతకాలతో మెరిశారు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో సరబ్‌జ్యోత్ సింగ్ స్వర్ణ పతకం సాధించగా... వరుణ్ తోమర్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఫైనల్లో 21 ఏళ్ల సరబ్‌జ్యోత్ ఫైనల్లో 16–0తో రుస్లాన్ లునెవ్ (అజర్‌బైజాన్)పై గెలుపొందాడు. క్వాలిఫయింగ్‌లో సరబ్‌జ్యోత్ 585 పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా... వరుణ్ 579 పాయింట్లతో ఎనిమిదో ర్యాంక్‌లో నిలిచి ర్యాంకింగ్ రౌండ్‌కు అర్హత పొందారు. ఎనిమిది మంది పాల్గొన్న ర్యాంకింగ్ రౌండ్‌లో సరబ్‌జ్యోత్ 253.2 పాయింట్లు, రుస్లాన్ 251.9 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించారు. 250.3 పాయింట్లతో వరుణ్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు.

## శ్రీకాంత్ శుభారంభం



**బాసెల్:** స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్ శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 21–16, 15–21, 21–18తో వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరాడు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి–ఆరతి (భారత్) 12–21, 14–21తో సయాక హొబారా–యు సుజు (జపాన్) చేతిలో... పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) 14–21, 14–21తో అప్రియాని–సితి ఫాదియా (ఇండోనేసియా) చేతిలో... మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి–రోహన్ (భారత్) 22–20, 19–21, 15–21తో హీ యోంగ్ కాయ్ టెరీ–తాన్ వె హాన్ జెసికా (సింగపూర్) చేతిలో ఓడిపోయారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ద్వయం 21–15, 21–18తో జిన్ యువాన్ బూన్–తియెన్ సి వోంగ్ (మలేసియా) జోడీని ఓడించింది.

# సినిమా

# పోస్టర్ చూద్దాం

పండగ చేద్దాం.. పోస్టర్ చూద్దాం అన్నట్లు ఉగాది సందర్భంగా బోలెడన్ని కొత్త పోస్టర్లు రిలీజ్ అయ్యాయి. వాటిలో కొన్ని పోస్టర్లను చూద్దాం.

- వెంకటేశ్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మెడికల్ మాఫియా నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోందనే టాక్ వినిపిస్తోంది.
- పల్లకి మోస్తున్నారు గోపీచంద్. 'లక్ష్యం', 'లౌక్యం' చిత్రాల తర్వాత హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీవాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'రామబాణం'. ఈ చిత్రంలో డింపుల్ హయతి హీరోయిన్. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్న ఈ సినిమా మే 5న విడుదల కానుంది.
- నాగచైతన్య పోలీస్‌గా నటిస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'కస్టడీ'. కృతీ శెట్టి హీరోయిన్. వెంకట్ ప్రభు దర్శకత్వంలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం మే 12న రిలీజవుతుంది.
- కల్యాణ్ రామ్ టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'డెవిల్: ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్'. నవీన్ మేడారం దర్శకత్వం వహిస్తున్నారు. పీరియాడికల్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ సినిమాను అభిషేక్ నామా నిర్మిస్తున్నారు.
- 'మామా మశ్చీంద్ర' చిత్రంలో ట్రిపుల్ క్యారెక్టర్స్ చేస్తున్నారు సుధీర్‌బాబు. దర్శక–నటుడు హర్షవర్ధన్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో దుర్గ, పరశురామ్, డీజే పాత్రల్లో కనిపిస్తారు సుధీర్ బాబు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.
- సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న మిస్టిక్ థ్రిల్లర్ 'విరూపాక్ష'. కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సంయుక్తా మీనన్ హీరోయిన్. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 21న విడుదల కానుంది.



సాయిధరమ్

- వరుణ్ తేజ్ తాజా చిత్రం 'అర్జునదారి గాండీవ'. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు.
- కార్తికేయ హీరోగా నటించిన తాజా చిత్రం 'బెదురులంక 2012'. 2012 యుగాంతం కాన్సెప్ట్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాకు క్లాక్స్ దర్శకత్వం వహించారు. నేహా శెట్టి హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రానికి ముప్పానేని రవీంద్ర బెనర్జీ నిర్మాత.
- పోలీసాఫీసర్‌గా కిరణ్ అబ్బవరం నటించిన చిత్రం 'మీటర్'. అతుల్యా రవి హీరోయిన్‌గా నటించారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌ల సమర్పణలో చెర్రీ (చిరంజీవి), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న విడుదల కానుంది.
- దగ్గుబాటి అభిరామ్‌ను హీరోగా పరిచయం చేస్తూ దర్శకుడు తేజ తెరకెక్కించిన చిత్రం 'అహింస'. గీతికా తివారి ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించారు. పి. కిరణ్ నిర్మించారు. ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది.
- 'రౌడీబాయ్స్' ఫేమ్ ఆశిష్ హీరోగా రూపొందుతున్న ద్వితీయ చిత్రం 'సెల్ఫిష్'. ఈ చిత్రానికి విశాల్ కాశి దర్శకత్వం వహిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్, సుకుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి, అశోక్ బండ్రెడ్డి సహనిర్మాతలు.
- రాయ్ లక్ష్మి ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'జనతా బార్'. రమణ మొగిలి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. వచ్చే నెలలో విడుదల కానున్న ఈ సినిమాను రమణ మొగిలి, తిరుపతిరెడ్డి బీరం నిర్మించారు. ''స్పోర్ట్స్‌ను కెరీర్‌గా ఎంచుకున్న మహిళలపై ఆ స్పోర్ట్స్ ఉన్నతాధికారులు తమ అధికారాన్ని అడ్డు పెట్టుకుని చేస్తున్న సెక్సువల్ హెరాస్‌మెంట్‌కు చరమగీతం పాడటానికి పోరాడిన ఓ మహిళ కథ ఇది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


రాయ్ లక్ష్మి


వెంకటేశ్


జగపతిబాబు, గోపీచంద్


నాగచైతన్య, కృతీ శెట్టి


సాక్షీ వైద్య, వరుణ్ తేజ్


ఆశిష్

## కామెడీ ఎంటర్‌టైనర్ షురూ

'అల్లరి' నరేశ్ హీరోగా కొత్త సినిమా ఆరంభమైంది. మల్లి అంకం దర్శకునిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. రాజీవ్ చిలక నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి డైరెక్టర్ తరుణ్ భాస్కర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత సురేశ్‌బాబు క్లాప్ ఇచ్చారు. డైరెక్టర్ నాగ్ అశ్విన్ గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాతలు కిరణ్, శరత్ మరార్‌లు యూనిట్‌కి స్క్రిప్ట్ అందజేశారు. ''మంచి కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అన్నారు 'అల్లరి' నరేశ్. ''మల్లిగారితో సినిమా చేస్తానని పదేళ్ల క్రితమే చెప్పాను. ఇప్పుడు తీస్తున్నాను'' అన్నారు రాజీవ్ చిలక. ''అందరూ గర్వపడే సినిమా చేస్తాననే నమ్మకం ఉంది'' అన్నారు మల్లి అంకం.


సురేశ్‌బాబు, 'అల్లరి' నరేశ్, ఫరియా

## రెండోసారి

హీరో నితిన్, హీరోయిన్ రష్మికా మందన్నా, డైరెక్టర్ వెంకీ కుడుముల రెండోసారి కలిసి పని చేయనున్నారు. వీరి కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'భీష్మ' (2020) మంచి హిట్ అయింది. ఈ ముగ్గురి కాంబినేషన్లో మరో కొత్త చిత్రం రానున్నట్లు ఉగాది సందర్భంగా ఒక వీడియో ద్వారా ఈ చిత్రాన్ని ప్రకటించారు మేకర్స్. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమా నిర్మించనున్నారు. ''వినోదాత్మకంగా, అడ్వెంచరస్‌గా ఈ మూవీ ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్.


వెంకీ, నితిన్, రష్మిక

## గ్రామీణ రంగబలి

నాగశౌర్య హీరోగా పవన్ బాసంశెట్టి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'రంగబలి' టైటిల్ ఖరారు చేశారు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఉగాది సందర్భంగా టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. ''విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే వినూత్నమైన కథ ఇది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: పవన్ సీహెచ్, కెమెరా: దివాకర్‌మణి.


నాగశౌర్య

## వేసవిలో సామజవరగమన

శ్రీ విష్ణు, రెబా మోనికా జాన్ జంటగా నటించిన చిత్రం 'సామజవరగమన'. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, హాస్య మూవీస్ పతాకాలపై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. ఈ సినిమాను మే 18న రిలీజ్ చేస్తున్నట్లుగా ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్.


'సామజవరగమన'లో ఓ దృశ్యం


రవితేజ

## పాటల సందడి

ఉగాది పండగని పురస్కరించుకుని పలు సినిమాల నుంచి పాటలు విడుదలయ్యాయి. ఆ పాటల సందడి విశేషాలు చూద్దాం..

- రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రావణాసుర'. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ సినిమా నుంచి 'డిక్కా డిష్యూం..' అంటూ సాగే పాటను రిలీజ్ చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని స్వాతి రెడ్డి యూకే, భీమ్స్, నరేష్ మామిండ్ల ఆలపించారు.


నాని


- శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని, కీర్తీ సురేష్ జంటగా నటించిన 'దసరా' ఈ నెల 30న రిలీజ్ కానుంది. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమాకి సంతోష్ నారాయణన్ స్వరపరచిన 'ధూం ధాం దోస్తాన్..' అనే వీడియో సాంగ్‌ని రిలీజ్ చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటని రాహుల్ సిప్లిగంజ్, కనకవ్వ, గన్నోర దాసు లక్ష్మి, పాలమూరు జంగిరెడ్డి, నర్సన్న, కాసర్ల శ్యామ్ పాడారు.


లారెన్స్

- అనుష్క శెట్టి, నవీన్ పోలిశెట్టి నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. పి. మహేష్ కుమార్ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మించారు. ఈ సినిమా నుంచి 'పుత్తడి బొమ్మ కోవెల కొమ్మ..' అనే తొలి లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. రధన్ సంగీతం అందించిన ఈ పాటను అనంత్ శ్రీరామ్ రాయగా, ఎమ్ఎమ్ మానసి పాడారు.


అనుష్క

- రాఘవ లారెన్స్ హీరోగా నటించిన చిత్రం 'రుద్రుడు'. కదిరేశన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నిర్మాత 'ఠాగూర్' మధు తెలుగులో ఏప్రిల్ 14న విడుదల చేస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'భగ భగ రగలరా..' పాటని రిలీజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటని పృథ్వీ చంద్ర పాడారు.


యోగేశ్వర్, అతిథి

- యోగేశ్వర్, అతిథి జంటగా సాయి శివాజీ దర్శకత్వం వహించిన చిత్రం 'పరారి'. గాలి ప్రత్యూష సమర్పణలో జీవీవీ గిరి నిర్మించిన ఈ సినిమా ఈ 30న రిలీజవుతోంది. ఈ చిత్రం కోసం మహిత్ నారాయణ్ స్వరాలు సమకూర్చి, రాసిన 'ఏమో ఏమో..' పాటని నటి విజయశాంతి రిలీజ్ చేశారు. ఈ పాటను సాయి చరణ్, సురభి శ్రావణి పాడారు.

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▲ 140 | 58,215 | |
| నిఫ్టీ ▲ 44 | 17,152 | |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 11,872 | ▲ 11 |
| డోజోన్స్ | 32,478 | ▼ 68 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,567 | ▲ 31 |
| డాక్స్ | 15,216 | ▲ 21 |
| షాంఘై | 3,265 | ▲ 10 |
| నికాయ్ | 27,467 | ▲ 521 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.

## హీరో వాహనాలు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ కంపెనీ హీరో మోటోకార్ప్ మోటార్‌సైకిల్స్, స్కూటర్ల ధరలను సుమారు 2 శాతం పెంచుతోంది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ధరలు వర్తించనున్నాయి. వచ్చే నెల నుంచి అమలులోకి రానున్న నూతన ఉద్గార ప్రమాణాలకు అనుగుణంగా వాహనాల తయారీ చేపట్టడంతో వ్యయం పెరిగింది. దీంతో ధరలు సవరించాల్సి వచ్చిందని కంపెనీ బుధవారం ప్రకటించింది. వెలువడే కాలుష్య స్థాయిని తెలిపే పరికరం ప్రతి వాహనానికి తప్పనిసరి.

## రూ.1,000 కోట్ల పెట్టుబడులు: కోరమాండల్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎరువుల తయారీలో ఉన్న కోరమాండల్ ఇంటర్నేషనల్ సస్యరక్షణ రసాయనాల విభాగంలో కార్యకలాపాలను విస్తరించాలని నిర్ణయించింది. కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మాన్యుఫాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీడీఎంవో) వ్యాపారంలోకి ప్రవేశించాలన్న ప్రణాళికను బుధవారం సమావేశమైన కంపెనీ బోర్డు ఆమోదించింది. ప్రత్యేక, పారిశ్రామిక రసాయనాల తయారీలోకి సైతం ఎంట్రీ ఇవ్వనుంది. ఈ విభాగాల్లో వచ్చే రెండేళ్లలో రూ.1,000 కోట్లు పెట్టుబడి పెట్టాలన్నది కోరమాండల్ ప్రణాళిక. ఈ వ్యాపారాలు గణనీయమైన వృద్ధి అవకాశాలను అందిస్తాయని కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ తెలిపారు.

# కుబేరుల్లో ఒకే ఒక్కడు అంబానీ!

- హురున్ టాప్-10 సంపన్నుల్లో ఏకైక భారతీయుడు; 9వ ర్యాంకు
- 23వ స్థానానికి అదానీ



ముకేశ్ అంబానీ / గౌతమ్ అదానీ / సైరస్ పూనావాలా

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వ్యవహారంతో పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీ సంపద భారీగా కరిగిపోవడంతో.. అంతర్జాతీయంగా టాప్ 10 కుబేరుల్లో భారత్ నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ఒక్కరే చోటు దక్కించుకున్నారు. 82 బిలియన్ డాలర్ల సంపదతో ఆయన తొమ్మిదో స్థానంలో నిలవగా 53 బిలియన్ డాలర్ల సంపదతో అదానీ 23వ స్థానానికి పరిమితమయ్యారు. డాలర్ల మారకంలో సంపదను లెక్కిస్తూ రీసెర్చ్ సంస్థ హురున్, రియల్ ఎస్టేట్ గ్రూప్ ఎం3ఎం కలిసి రూపొందించిన '2023 గ్లోబల్ రిచ్ లిస్ట్' నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఆసియాలోనే అత్యంత సంపన్నుడిగా అంబానీ మూడోసారి టైటిల్ నిలబెట్టుకున్నారు. వ్యాపారవేత్తల దృష్టి కోణం నుంచి ప్రస్తుత ప్రపంచ ఎకానమీ పరిస్థితులను ఆవిష్కరించేలా ఈ జాబితా ఉందని హురున్ ఇండియా ఎండీ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు.

**క్షీణతలో బెజోస్ టాప్..**

ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్.. అత్యధికంగా సంపద పోగొట్టుకున్న వారి లిస్టులో టాప్‌లో నిల్చారు. ఆయన సంపద 70 బిలియన్ డాలర్లు పడిపోయి 118 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. అంబానీ, అదానీ కలిసి పోగొట్టుకున్న సంపద కన్నా ఇది ఎక్కువ కావడం గమనార్హం. హురున్ రిపోర్ట్ ప్రకారం ఇలా భారీగా పోగొట్టుకున్న వారి లిస్టులో బెజోస్ అగ్రస్థానంలో ఉండగా.. అదానీ 6, అంబానీ 7వ ర్యాంకుల్లో నిల్చారు. 2022-23లో అదానీ సంపద 35 శాతం పడిపోయింది. 28 బిలియన్ డాలర్ల మేర (రోజుకు రూ. 3,000 కోట్లు చొప్పున) క్షీణించి మార్చి మధ్య నాటికి 53 బిలియన్ డాలర్లకు తగ్గింది. అంబానీ సంపద కూడా క్షీణించినప్పటికీ తగ్గుదల 20 శాతానికే పరిమితమైంది. అదానీ గ్రూప్ సంస్థల ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అమెరికాకు చెందిన షార్ట్‌సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణల తదనంతర పరిణామాలతో గౌతమ్ అదానీ సంపద భారీగా కరిగిపోయిన సంగతి తెలిసిందే.

### టాప్ 100లో మనోళ్లు..

| పేరు | ర్యాంకు | సంపద (బి.డాలర్లలో) |
|---|---|---|
| ముకేశ్ అంబానీ | 9 | 82 |
| గౌతమ్ అదానీ కుటుంబం | 23 | 53 |
| సైరస్ పూనావాలా | 46 | 27 |
| శివ్ నాడార్ కుటుంబం | 50 | 26 |
| లక్ష్మీ ఎన్ మిట్టల్ | 76 | 20 |
| ఎస్‌పీహిందుజా కుటుంబం | 76 | 20 |
| దిలీప్ సంఘ్వీ కుటుంబం | 98 | 17 |

### మరిన్ని విశేషాలు..

- 2023 గ్లోబల్ రిచ్ లిస్ట్‌లో సంపన్నుల సంఖ్య 3,112కు తగ్గింది. గతేడాది ఇది 3,384గా ఉంది. వారి మొత్తం సంపద 10 శాతం తగ్గి 13.7 లక్షల కోట్ల డాలర్లకు పరిమితమైంది.
- గతేడాదితో పోలిస్తే భారత్‌లో బిలియనీర్ల సంఖ్య 28 తగ్గి 187కి చేరింది. ముంబైలో అత్యధికంగా 66 మంది ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులను పరిగణనలోకి తీసుకుంటే బిలియనీర్ల సంఖ్య 217గా ఉంది. మొత్తం కుబేరుల సంపదలో భారత్ వాటా 5 శాతంగా ఉంది. కాగా, అమెరికా వాటా అత్యధికంగా 32 శాతంగా ఉంది. భారత్‌తో పోలిస్తే చైనాలో బిలియనీర్ల సంఖ్య అయిదు రెట్లు అధికంగా ఉండటం గమనార్హం.
- భారత్‌లో 10 మంది మహిళా బిలియనీర్లు ఉన్నారు. సాఫ్ట్‌వేర్, సర్వీసుల విభాగంలో స్వయంకృషితో బిలియనీరుగా ఎదిగిన వారిలో 4 బిలియన్ డాలర్ల సంపదతో రాధా వెంబు రెండో స్థానంలో నిల్చారు. దివంగత ఇన్వెస్ట్‌మెంట్ గురు రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా సతీమణి రేఖా ఈసారి కుబేరుల లిస్టులో స్థానం దక్కించుకున్నారు.

## పద్మభూషణ్ స్వీకరించిన కుమార మంగళం బిర్లా



న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా బుధవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి పద్మభూషణ్ అవార్డును స్వీకరించారు. దీనితో బిర్లా కుటుంబంలో దేశ అత్యున్నత పౌర పురస్కారం అందుకున్న నాల్గవ వ్యక్తిగా నిలిచారు. ఆయన ముత్తాత జీడీ బిర్లా 1957లో పద్మవిభూషణ్ గ్రహీత. తల్లి రాజశ్రీ బిర్లా 2011లో పద్మభూషణ్ పురస్కారం పొందారు. కుమార మంగళం బిర్లా తాత బీకే బిర్లా బంధువు జీపీ బిర్లా 2006లో పద్మభూషణ్‌ను అందుకున్నారు. ఆయన 28 ఏళ్ల సుదీర్ఘ వాణిజ్య అనుభవంలో గ్రూప్ టర్నోవర్ 30 రెట్లు పెరిగి 60 బిలియన్ డాలర్లకు చేరింది. "ఉన్నత లక్ష్యానికి వ్యాపారం దోహదపడుతూ, జీవితాలను సుసంపన్నం చేయాలన్న ఆదిత్య బిర్లా గ్రూప్ సంకల్పానికి ఈ అవార్డు ఒక గుర్తింపు" అని కుమార మంగళం బిర్లా పేర్కొన్నారు. ఈ ఏడాది మరణానంతర పద్మశ్రీ అవార్డులు లభించిన వారిలో ప్రముఖ శీతల పానీయాల బ్రాండ్ రస్నా వ్యవస్థాపకుడు, దివంగత అరీజ్ ఖంబట్టా, దిగ్గజ ఇన్వెస్టర్ రాకేష్ ఝున్‌ఝున్‌వాలా ఉన్నారు.

| కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో) | |
|---|---|
| **23-3-2023** | |
| విశాఖ | 450-00 |
| చిత్తూరు | 473-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 438-00 |
| విజయవాడ | 438-00 |
| రిటైల్ ధర (డజను) | 66.00 |
| **22-3-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 425-00 |
| వరంగల్ | 427-00 |
| రిటైల్ ధర | 4.95 |

# ఫెడ్ 0.25 శాతం వడ్డీ పెంపు

4.75-5 శాతానికి ఫండ్స్ రేటు



న్యూయార్క్: అంచనాలకు అనుగుణంగా యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటును 0.25 శాతం పెంచింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేటు 4.75-5 శాతానికి చేరింది. నిజానికి కొద్ది నెలలుగా ద్రవ్యోల్బణ అదుపునకే అధిక ప్రాధాన్యత ఇస్తూ వస్తున్న ఫెడ్.. వడ్డీ రేట్లను వేగంగా పెంచుతూ వస్తోంది. దీంతో 2022 మార్చి నుంచి 2023 ఫిబ్రవరి 01 వరకూ దశలవారీగా 4.5 శాతం వడ్డీ రేటును పెంచింది. వెరసి 2022 ఫిబ్రవరిలో 0-0.25 శాతంగా ఉన్న ఫండ్స్ రేటు తాజాగా 5 శాతానికి ఎగసింది. ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ అంచనాలను మించి వడ్డీ రేట్లు పెరిగే వీలున్నట్లు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే కొద్ది రోజులుగా అమెరికా, యూరప్ బ్యాంకింగ్ రంగాలలో సంక్షోభ పరిస్థితులు తలెత్తడంతో ఫెడ్ పాలసీ సమీక్షకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. యూఎస్‌లో సిల్వర్‌గేట్ క్యాపిటల్, సిలికాన్ వ్యాలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్ ఇప్పటికే విఫలంకాగా.. ప్రస్తుతం ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకు సంక్షోభంలో ఉంది. మరోవైపు క్రెడిట్ స్వీస్ దివాలా స్థితికి చేరడంతో యూరప్ బ్యాంకింగ్ రంగంలోనూ ప్రకంపనలు పుడుతున్నాయి. స్విస్ కేంద్ర బ్యాంకు కల్పించుకుని యూబీఎస్‌ను రంగంలోకి దించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ఫెడరల్ రిజర్వ్ రేట్ల పెంపు వేగానికి బ్రేక్ పడనున్నట్లు పలువురు విశ్లేషకులు భావిస్తూ వచ్చారు.

## ట్యాక్స్‌పేయర్ల కోసం ఐటీ శాఖ యాప్

న్యూఢిల్లీ: పన్ను చెల్లింపుదారుల కోసం ఆదాయ పన్ను శాఖ తాజాగా ఏఐఎస్ ట్యాక్స్‌పేయర్ పేరిట మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇది వారి టీడీఎస్/టీసీఎస్, వడ్డీ, డివిడెండ్లు, షేర్ల లావాదేవీలు మొదలైన వాటి సమగ్ర సమాచారాన్ని ఒకే దగ్గర చూసుకునేందుకు, ఫీడ్‌బ్యాక్ ఇచ్చేందుకు ఉపయోగపడుతుంది. గూగుల్ ప్లే, యాప్ స్టోర్‌లో ఈ ఉచిత యాప్ అందుబాటులో ఉంటుందని కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఒక ప్రకటనలో తెలిపింది. తమ పాన్ నంబర్ ద్వారా ఈ యాప్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు.

# సూచీలకు స్వల్పలాభాలు

- ఫెడ్ ప్రకటనకు ముందు అప్రమత్తత
- సెన్సెక్స్ లాభం 140 పాయింట్లు



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో కదలాడిన స్టాక్ సూచీలు బుధవారం స్వల్పలాభాలతో గట్టెక్కాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన వైఖరి వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న దేశీయ సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 170 పాయింట్లు పెరిగి 58,245 వద్ద, నిఫ్టీ 71 పాయింట్లు లాభంతో 17,177 వద్ద ప్రారంభమయ్యాయి. తొలి దశలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్ 344 పాయింట్లు ఎగసి 58,418 వద్ద, నిఫ్టీ 100 పాయింట్లు బలపడి 17,207 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. అయితే దేశీయ మార్కెట్ నుంచి విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతుండటంతో సూచీలు ఆరంభ లాభాల్ని కోల్పోయాయి. ఫలితంగా సెన్సెక్స్ 140 పాయింట్ల స్వల్పలాభంతో 58,215 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 44 పాయింట్లు పెరిగి 17,152 వద్ద నిలిచింది. ఫార్మా, ఫైనాన్స్, బ్యాంకింగ్, ఐటీ కమోడిటీ షేర్లు రాణించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.50%, 0.18 శాతం చొప్పున లాభపడ్డాయి. మెటల్, మీడియా, రియల్టీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది.

## భవిత

ఆంధ్రప్రదేశ్ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, మోడల్‌పేపర్స్, ప్రీవియస్ పేపర్స్, టెక్స్ట్‌బుక్స్, గైడెన్స్ మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

పోటీ పరీక్షల ప్రత్యేకం తెలంగాణ ఉద్యమం కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

# విద్య, ఉద్యోగ సమాచారం

### ఏపీ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023

ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023(ఏపీ ఐసెట్) నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్షను అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్‌కేయూ) నిర్వహించనుంది. ఏపీ ఐసెట్‌లో ర్యాంకు ద్వారా 2023 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, అఫిలియేటెడ్ కళాశాలల్లో ఫుల్‌టైం ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

» **కోర్సులు:** మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ)/మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ).
» **అర్హత:** ఎంబీఏ కోర్సుకు బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీబీఎం, బీసీఏ, బీఈ, బీటెక్, బీఫార్మసీ; ఎంసీఏ కోర్సుకు బీసీఏ, డిగ్రీ( కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్), బీఎస్సీ, బీకాం, బీఏ(ఇంటర్/డిగ్రీ స్థాయిలో గణితం సబ్జెక్టు చదివి ఉండాలి) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** కనీస వయస్సు 19 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయసు పరిమితి లేదు.

**ముఖ్య సమాచారం**

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** మార్చి 20న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై ఏప్రిల్ 19తో ముగుస్తుంది.
» **పరీక్షల తేదీ:** మే 24, 25 తేదీల్లో పరీక్షలు జరుగుతాయి.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

### ఏపీ పీజీఈసెట్-2023

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏపీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023(ఏపీ పీజీఈసెట్) నోటిఫికేషన్‌ను విడుదలచేసింది.

» **కోర్సులు:** ఎంటెక్, ఎంఫార్మసీ, ఫార్మ్ డీ.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీటెక్/బీఫార్మసీ ఉత్తీర్ణత పొందిన/చివరి ఏడాది పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» గేట్/జీప్యాట్ అర్హత సాధించిన అభ్యర్థులకు విడిగా నోటిఫికేషన్ విడుదలచేస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

**ముఖ్యసమాచారం**

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.04.2023
» **పరీక్ష తేది:** 28.05.2023 నుంచి 30.05.2023
» **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

### సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ కర్ణాటకలో 50 టీచింగ్ పోస్టులు

కలబురగిలోని సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ కర్ణాటక.. వివిధ సబ్జెక్టుల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 50
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-18, అసోసియేట్ ప్రొఫెసర్-32.
» **సబ్జెక్టులు:** హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, సైకాలజీ, కామర్స్, సోషల్ వర్క్, జియాలజీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, ఎడ్యుకేషన్, లా తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు బోధన/పరిశోధన/పారిశ్రామిక రంగంలో పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** పరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**17.04.2023
» **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 25.04.2023.
» **వెబ్‌సైట్:** www.cuk.ac.in

### ఎస్వీనిట్, సూరత్‌లో 50 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

సూరత్(గుజరాత్)లోని సర్దార్ వల్లభాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్వీనిట్).. వివిధ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 50
» **విభాగాలు:** సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మ్యాథమేటిక్స్ అండ్ హ్యూమానిటీస్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు బోధన, పరిశోధన అనుభవం ఉండాలి. వయసు: 60 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.1,01,500 నుంచి రూ.1,67,400 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ప్రజంటేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**24.04.2023
» **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 04.05.2023
» **వెబ్‌సైట్:** www.svnit.ac.in

# న్యాయం చేసే 'లా'

**న్యాయం చేసే 'లా' కెరీర్‌ను ఎంచుకోవాలనుకునే విద్యార్థులకు గుడ్‌న్యూస్. న్యాయశాస్త్ర నైపుణ్యాలను అందించే కోర్సు ఎల్‌ఎల్‌బీ. ఇందులో ప్రవేశానికి నిర్వహించే లాసెట్‌కు.. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. పరీక్ష తేదీలను కూడా ప్రకటించింది. ఈ ఎంట్రన్స్ ద్వారా మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. టీఎస్ లాసెట్-2023 వివరాలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ గైడెన్స్..**

» టీఎస్ లాసెట్-2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీల్లో ప్రవేశం
» భవిష్యత్తు లీగల్ ప్రొఫెషనల్స్‌ను తీర్చిదిద్దే ఎల్‌ఎల్‌బీ కోర్సు
» పీజీ లా సెట్‌కు కూడా నోటిఫికేషన్ విడుదల



టీఎస్ లాసెట్ 2023

ఇటీవల కాలంలో న్యాయ శాస్త్రం కొత్త పుంతలు తొక్కుతోంది. లా గ్రాడ్యుయేట్‌లకు న్యాయవాద వృత్తి మాత్రమే కాకుండా.. కార్పొరేట్ రంగంలోనూ డిమాండ్ నెలకొంది. అందుకే ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగావకాశాలు, ఉపాధి మార్గాల విషయంలో ఎలాంటి ఢోకా లేదు అంటున్నారు నిపుణులు.

**'లా'సెట్ ద్వారా ప్రవేశాలు**

తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీ కళాశాలలు, అనుబంధ కాలేజీల్లో ఎల్‌ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి 'లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (లాసెట్)'ను నిర్వహిస్తుంది. ఇందులో పొందిన ర్యాంకు ఆధారంగా.. మూడేళ్లు, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

**అర్హతలు**

- మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సులో ప్రవేశానికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఓసీ, బీసీ కేటగిరీ అభ్యర్థులు 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఓబీసీ వర్గాల వారు 42 శాతంతో, ఎస్సీ/ఎస్టీ వర్గాల వారు 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ కోర్సుకు ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో 45 శాతం మార్కులతో(ఓసీ, బీసీ) ఉత్తీర్ణత సాధించాలి. ఓబీసీ విద్యార్థులు 42 శాతంతో, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు 40 శాతంతో ఉత్తీర్ణత పొందాలి.
- ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

**మూడు విభాగాలు.. 120 మార్కులు**

- టీఎస్ 'లా' సెట్ పరీక్షను మొత్తం మూడు విభాగాల్లో 120 మార్కులకు నిర్వహిస్తారు.
- జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ విభాగం నుంచి 30 ప్రశ్నలు, కరెంట్ అఫైర్స్ విభాగం నుంచి 30 ప్రశ్నలు, ఆప్టిట్యూడ్ ఫర్ స్టడీ ఆఫ్ లా విభాగం నుంచి 60 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.
- ఆప్టిట్యూడ్ ఫర్ స్టడీ ఆఫ్ లా విభాగంలోని 60 ప్రశ్నల్లో 10 ప్రశ్నలు కాంప్రహెన్షన్ విధానంలో ఉంటాయి. న్యాయ సంబంధ అంశాలతో కూడిన ప్యాసేజ్‌లు ఇచ్చి.. వాటి ఆధారంగా సమాధానాలు ఇవ్వాల్సిన విధంగా ప్రశ్నల అడుగుతారు.
- మూడేళ్లు, అయిదేళ్ల ఎల్‌ఎల్‌బీ.. ఈ రెండు కోర్సులకు ఎంట్రన్స్ ఒకే మాదిరిగా ఉంటుంది. కాని ప్రశ్నల క్లిష్టత మూడేళ్ల కోర్సుకు డిగ్రీ స్థాయిలో, అయిదేళ్ల కోర్సుకు ఇంటర్మీడియెట్ స్థాయిలో ఉంటుంది.
- ఎంట్రన్స్ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది. మూడేళ్ల లాసెట్‌ను రెండు సెషన్లలో నిర్వహిస్తారు.

**బెస్ట్ ర్యాంకు సాధించేలా**

మొత్తం మూడు విభాగాల్లో నిర్వహించే లాసెట్‌లో మంచి ర్యాంకు పొందాలంటే.. నిర్దిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి.

**జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ**

- ఈ విభాగంలో అభ్యర్థులు స్టాక్ జీకే అంశాలకు కొంత ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా చరిత్ర, వార్తల్లోని వ్యక్తులు, ముఖ్యమైన ప్రదేశాలు, సదస్సులు, చారిత్రక కట్టడాలు, స్వాతంత్ర్యం అనంతర కాలంలో జరిగిన ముఖ్యమైన సంఘటనల గురించి తెలుసుకోవాలి. కళలు, సంస్కృతి, జాతీయ ప్రాధాన్యత కలిగిన చారిత్రక అంశాలపై దృష్టి పెట్టాలి. ప్రధానంగా జాతీయోద్యమంలో కీలక ఘట్టాలపై దృష్టి పెట్టాలి. భారత రాజ్యాంగానికి సంబంధించి రాజ్యాంగ రూపకల్పన నుంచి తాజా సవరణల వరకు అన్నీ తెలుసుకోవాలి.
- అదే విధంగా మెంటల్ ఎబిలిటీలో వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. బ్లడ్ రిలేషన్స్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, కోడింగ్, డీ-కోడింగ్, గ్రాఫ్స్, ఫ్లోచార్ట్స్ విశ్లేషణ వంటి అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

**కరెంట్ అఫైర్స్**

కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ద్వైపాక్షిక ఒప్పందాలు, ముఖ్యమైన సంఘటనలు, సదస్సులు, జాతీయ పరిణామాలు, ప్రాంతీయ సమకాలీన అంశాలు, వార్తల్లో వ్యక్తులు, ముఖ్యమైన సంఘటనలు తదితరాల గురించి పూర్తి స్థాయి అవగాహన ఏర్పరచుకోవాలి. ప్రామాణిక జనరల్ నాలెడ్జ్ పుస్తకాలతోపాటు, ప్రతిరోజు దిన పత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలి.

**అప్టిట్యూడ్ ఫర్ స్టడీ ఆఫ్ లా**

ఈ విభాగంలో న్యాయ విద్య అభ్యసించడంపై అభ్యర్థులకున్న ఆసక్తిని పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. ఇందులో మంచి మార్కులు సాధించాలంటే..న్యాయపరమైన దృక్పథం, సహేతుక ఆలోచన ధోరణి, నిర్ణయ సామర్థ్యాలను పరిశీలించే నైపుణ్యాలు అవసరం. నిర్దిష్టంగా ఒక సంఘటన, వివాదాన్ని పరిష్కరించేందుకు అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనే నైపుణ్యం పొందాలి. ముఖ్యమైన చట్టాలు, న్యాయ శాఖకు సంబంధించి ఇటీవల కాలంలో చోటు చేసుకున్న తాజా పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా ఇటీవల కాలంలో వెలువడిన కీలక తీర్పులు, వాటి పరిణామాలు-ప్రభావం వంటి తాజా అంశాలపైనా దృష్టి పెట్టాలి.

**ఉపాధి అవకాశాలు**

ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేసుకుంటే.. ఉజ్వల కెరీర్స్ సొంతమవడం ఖాయం. న్యాయవాద వృత్తితోపాటు కార్పొరేట్ కొలువులు కూడా దక్కించుకోవచ్చు. ప్రస్తుతం ప్రతి సంస్థ కూడా తమకంటూ ఒక ప్రత్యేక న్యాయ విభాగం ఉండాలని, వాటి ద్వారా కార్పొరేట్ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా కార్యకలాపాలు నిర్వహించి, ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందుకు సాగాలని భావిస్తోంది. అందుకోసం లా కోర్సులు పూర్తి చేసిన వారిని నియమించుకుంటున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలు, ఆర్ అండ్ డీ సంస్థలు, బ్యాంకులు వీరికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ప్రతి ఏటా క్యాంపస్ నియామకాలు చేపడుతున్నాయి. పీజీ స్థాయిలో కార్పొరేట్ లా, సైబర్ లా, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా, ఇంటర్నేషనల్ లా వంటి స్పెషలైజేషన్స్ పూర్తి చేసుకుంటే.. బహుళ జాతి సంస్థల్లో సైతం అవకాశాలు అందుకోవచ్చు.

**అయిదు వేలకు పైగా సీట్లు**

టీఎస్ లాసెట్ ద్వారా భర్తీ చేసే ఎల్‌ఎల్‌బీ, ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీకి సంబంధించి గత ఏడాది కౌన్సెలింగ్ గణాంకాల ప్రకారం-మూడేళ్ల లా కోర్సులో 3,597, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా కోర్సులో 1,580 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎల్‌ఎల్‌ఎంకు సంబంధించి 620 సీట్లు ఉన్నాయి.

**పీజీ లాసెట్ ఇలా**

- ఎల్‌ఎల్‌బీ అర్హతగా.. ఎల్‌ఎల్‌ఎం కోర్సులో ప్రవేశానికి పీజీ లాసెట్ నిర్వహిస్తారు. -పీజీ లాసెట్ రెండు విభాగాలుగా 120 మార్కులకు ఉంటుంది.
- పార్ట్-ఎలో.. జ్యూరిస్ప్రుడెన్స్ నుంచి 20 ప్రశ్నలు, కాన్‌స్టిట్యూషనల్ లా నుంచి 20 ప్రశ్నలు ఉంటాయి.
- పార్ట్-బిలో.. పబ్లిక్ ఇంటర్నేషనల్ లా నుంచి 16 ప్రశ్నలు; మర్కంటైల్ లా నుంచి 16 ప్రశ్నలు; లేబర్ లా నుంచి 16 ప్రశ్నలు; క్రైమ్స్ అండ్ టార్ట్స్ నుంచి 16 ప్రశ్నలు; అదర్ 'లా'స్ నుంచి 16 ప్రశ్నలు అడుగుతారు.

**ముఖ్య సమాచారం**

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** మార్చి 2 - ఏప్రిల్ 6, 2023
- రూ.500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 12 వరకు; రూ.1000 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 19 వరకు, రూ.2,000 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 26 వరకు; రూ.4,000 ఆలస్య రుసుముతో మే 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం:** దమే 16 నుంచి
- **లాసెట్ పరీక్ష తేదీ:** మే 25, 2023
- **వివరాలకు వెబ్‌సైట్:** lawcet.tsche.ac.in

## క్లుప్తంగా...

### ఈ ప్యాక్ పాలిమర్స్ పరిశ్రమ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవయ్య

తడ(తిరుపతి జిల్లా): మాంబట్టు ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో నిర్మించే నూతన పరిశ్రమకు సూళ్లూరుపేట శాసన సభ్యుడు, టీటీడీ బోర్డు సభ్యుడు కిలివేటి సంజీవయ్య చేతుల మీదుగా బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఇండస్ట్రియల్ భవనాల నిర్మాణానికి ఉపయోగపడే రెడీమేడ్ ఐరన్ స్ట్రక్చర్ ఇంజినీరింగ్ ప్యానల్స్ ఉత్పత్తి చేసే 'ఈ ప్యాక్ పాలిమర్స్' పరిశ్రమ 21 ఎకరాల్లో నెలకొననుంది. రూ.160 కోట్ల నిధులతో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశ్రమ ద్వారా 200 మందికి ప్రత్యక్షంగా మరో 400 మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. ఈ పరిశ్రమ ఇప్పటికే గ్రేటర్ నోయిడా, డెహ్రాడూన్ ప్రాంతాల్లో తమ ఉత్పత్తులు అందిస్తూ ఉండగా శ్రీసిటీలో ఇంపాక్ట్ డ్యూరబుల్ ఏసీ అండ్ కాంపొనెంట్స్ తయారు చేస్తోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో పారిశ్రామికవేత్తలు ఉత్సాహంగా ముందుకు వచ్చి రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దీంతో యువతకు ఉపాధి, వ్యాపార, ఇతర వర్గాలకు ఆర్థిక ఆసరా లభిస్తోందన్నారు.

### కనీస వేతన గ్యారంటీ ఇవ్వండి
#### అఖిల భారత రేషన్ షాపు డీలర్ల డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: కనీస వేతనం గ్యారంటీ ఇవ్వాలని కోరుతూ అఖిల భారత రేషన్ షాపు డీలర్ల ఫెడరేషన్ జాతీయ స్థాయిలో నిరసన వ్యక్తం చేసింది. ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మునగ గిరిజారావు ఆధ్వర్యంలో బుధవారం జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించింది. కనీస నెలవారీ ఆదాయం రూ.50 వేలు గౌరవ వేతన రూపంలో ఇవ్వాలని డిమాండు చేస్తూ తెలుగు రాష్ట్రాల సహా పలు రాష్ట్రాలకు చెందిన డీలర్లు నినదించారు. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన(పీఎంజీకేఏవై) పథకం పాత పద్ధతి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన కేఎస్‌వీ రామారావు, ఎం.ఖాజా మొహిద్దీన్ పాల్గొన్నారు.

### 'కేజీబీవీలలో ప్రవేశం కోసం దరఖాస్తుల స్వీకరణ'

సాక్షి, అమరావతి: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో 6, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 352 కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గానూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నామన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ ( బడి మానేసిన వారు) పేద, ఎస్.సి, ఎస్.టి, బీసీ, మైనారిటీ, బి.పి.ఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తామని చెప్పారు. దరఖాస్తును 'హెచ్‌టీటీపీఎస్://ఏపీకేజీబీవీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్' సైట్ ద్వారా పొందవచ్చునన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు. సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చని, సందేహాలు ఉంటే 9494383617, 9441270099, 9441214607, 9490782111 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# ఆగ'మేఘాల' ఘుమ ఘుమలు




సాక్షి, హైదరాబాద్: ఆకర్షణీయమైన పరిసరాలు.. అద్భుతమైన ఆహ్వానం.. అభిరుచికి తగిన ఆహారం.. అతిథి దేవోభవ అనిపించే సేవలు.. భోజన ప్రియుల్ని ఆకర్షించేందుకు రెస్టారెంట్లు పడే తాపత్రయం అంతాఇంతా కాదు. గతంలో హోటల్‌కు వెళ్లి తినడాన్ని జనం అంతగా ఇష్టపడేవారు కాదు. కొందరు అదేదో లగ్జరీగా భావించేవారు. ఇప్పుడు వీకెండ్‌లో కుటుంబంతో సహా రెస్టారెంట్‌కు వెళ్లడం సాధారణంగా మారిపోయింది. ఆన్‌లైన్ డెలివరీలు పెరిగిన నేపథ్యంలో.. వారంలో రెండు మూడుసార్లన్నా బయట ఆర్డర్ చేసి తెప్పించుకోవడమూ పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో ఫుడ్ బిజినెస్ లాభదాయకమనే భావన ఉన్నప్పటికీ..ఆశించిన ఆదరణ లభించకపోతే భారీ నష్టాన్ని మూటగట్టుకోవడం మాత్రం ఖాయం. ఈ నేపథ్యంలోనే ఫుడ్ బిజినెస్‌కు సంబంధించి ఓ సరికొత్త ట్రెండ్ మొదలైంది. అదే క్లౌడ్ కిచెన్. దేశ, విదేశాల్లో ఎప్పట్నుంచో ఉన్న ఈ క్లౌడ్ కిచెన్‌లు ఇప్పుడు హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లోనూ ప్రారంభమవుతూ ఆదరణ పొందుతున్నాయి.

- ఓ వంటిల్లు.. వందలాది కస్టమర్లు
- క్లౌడ్ కిచెన్‌లకు పెరుగుతున్న ఆదరణ

**షార్ట్ టైమ్.. ఫుల్ పికప్..**

జొమాటో, స్విగ్గీ తదితర ఫుడ్ డెలివరీ యాప్స్ సృష్టించిన ఈ ట్రెండ్ కరోనా విజృంభణ సమయంలో పట్టును దక్కించుకుంది. ఇంటర్నెట్ విస్తృత వ్యాప్తి, వ్యాపారంలో సాంకేతికత, ప్రత్యేక యాప్‌ల పెరుగుదల ఇందుకు దోహదపడింది. పెరుగుతున్న యువ జనాభా ఆదాయం, మారుతున్న జీవనశైలి, సులభమైన.. సురక్షితమైన చెల్లింపు మార్గాలు, వంటింట్లో బిజీబిజీ పరిస్థితి నుంచి కాస్త ఉపశమనం ఇత్యాదివన్నీ కూడా వీటికి ఆదరణ పెరగడానికి కారణాలుగా పేర్కొనవచ్చు. ఇంట్లో వండినట్టుండే ఆహారం నుంచి స్పెషాలిటీ లగ్జరీ డిన్నర్‌ల వరకు ప్రతిదానిని అందించడం ద్వారా క్లౌడ్ కిచెన్‌లు ఈ రంగంలో కొత్త పుంతలు తొక్కుతున్నాయి. తక్కువ రేటుతో, నాణ్యమైన భోజనం, నిమిషాల్లో ఇంటి ముందు ప్రత్యక్షమవుతుండటంతో నానాటికీ వీటికి ఆదరణ పెరుగుతోంది. 2019లో దేశంలో 400 మిలియన్ల డాలర్లుగా ఉన్న క్లౌడ్ కిచెన్‌ల వ్యాపారం 2024 నాటికి 2 బిలియన్ల డాలర్లకు చేరుతుందని ఎఫ్ అండ్ బీ (ఫుడ్ అండ్ బివరేజెస్) పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తుండటం గమనార్హం.

**ఏమిటీ క్లౌడ్ కిచెన్..?**

ఒక వంటిల్లు.. వందలాది కస్టమర్లు అన్నట్టుగా క్లౌడ్ కిచెన్‌ల హవా సాగుతోంది. కరోనా సమయంలో ఇవి ఎక్కువగా పుంజుకున్నాయి. మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లో పాతిక మించి లేని క్లౌడ్ కిచెన్లు ఇప్పుడు వందల సంఖ్యకు చేరాయి. విలాసవంతమైన రెస్టారెంట్లు..లేదు లేదు అసలు రెస్టారెంట్ అన్న భావనకు ఇది పూర్తిగా భిన్నం. హంగూ ఆర్భాటాలు ఏమీ ఉండవు. రెస్టారెంట్ వ్యాపారాన్ని ప్రారంభించడానికి అవసరమైన పెట్టుబడిలో 1/3 వంతు సరిపోతుంది. తక్కువ పెట్టుబడి, తక్కువ సిబ్బంది, తక్కువ వ్యయప్రయాసలు..స్పష్టంగా చెప్పాలంటే ఒక్క వంటిల్లు మాత్రమే ఉంటుంది. నో డైన్ ఇన్..ఓన్లీ డెలివరీ. కూర్చుని తినడానికి వీలుండదు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే సప్లై చేస్తారు..అంతే. క్లిక్ అయితే ఎక్కువ లాభాలు. ఆదరణ లభించకపోయినా అంతంత మాత్రంగానే నష్టం..ఇదే క్లౌడ్ కిచెన్ మూల సూత్రం.

- పెట్టుబడి తక్కువ..లాభాలు ఎక్కువ
- రెస్టారెంట్ వ్యాపారానికి దీటుగా ఎదుగుదల

**రుచి, శుచికి పెద్దపీట..**

శాకాహార, ఆరోగ్యకరమైన వంటకాలు, ప్రాంతీయ రుచికరమైన వంటకాలు వంటివి అందించే ఆఫ్‌లైన్ రెస్టారెంట్‌ల సంఖ్య పెరగడాన్ని.. అలాగే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ క్లౌడ్ కిచెన్‌ల ఏర్పాటును ఈ ఏడాది చూడవచ్చునని నిపుణులు అంటున్నారు. స్విగ్గీ, జొమోటో వంటివి..క్లౌడ్ కిచెన్‌లకు ఆధారంగా ఉన్నప్పటికీ, భారీ కమీషన్ల ఫలితంగా, కొన్ని క్లౌడ్ కిచెన్‌లు తమ సొంత యాప్‌లు, సెల్ఫ్ డెలివరీ ప్రయోగాలు కూడా చేస్తున్నాయి. నాగచైతన్య వంటి సినిమా తారలను సైతం ఈ క్లౌడ్ కిచెన్స్ ఆకర్షిస్తున్నాయి.

# 78.94 లక్షల మంది మహిళలకు రూ.6,419 కోట్లు

- 25న మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ

- దెందులూరులో లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సవాలు
- ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో లబ్ధిదారులతో ముఖాముఖి సమావేశాలు
- ఇప్పటికే రెండు విడతల్లో చెల్లించిన మొత్తం రూ.12,758.28 కోట్లు



సాక్షి, అమరావతి: వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత కింద రాష్ట్రవ్యాప్తంగా 78.94 లక్షల మంది పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో రూ.6,419.89 కోట్ల మొత్తాన్ని సీఎం వైఎస్ జగన్ జమ చేయనున్నారు. ఈ నెల 25న ఏలూరు జిల్లా దెందులూరులో లాంఛనంగా ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. 2019 అసెంబ్లీ ఎన్నికల నాటికి పొదుపు సంఘాల పేరిట మహిళలకు బ్యాంకుల్లో ఉన్న అప్పు మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి మొత్తం డబ్బులను నాలుగు విడతల్లో లబ్ధిదారులకు నేరుగా చెల్లించే వైఎస్సార్ ఆసరా పథకానికి అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. గత అసెంబ్లీ ఎన్నికల నాటికి పొదుపు సంఘాల మహిళల పేరిట బ్యాంకుల్లో రూ.25,571 కోట్ల అప్పు ఉంది. ఇందులో ఇప్పటికే రెండు విడతల్లో రూ.12,758.28 కోట్లను మహిళల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. మూడో విడతగా ఇప్పుడు అందజేసే రూ.6,419.89 కోట్లతో కలిపి మొత్తం రూ.19,178.17 కోట్లను ప్రభుత్వం పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో జమ చేసినట్టు అవుతుంది. ఈ డబ్బులను ఎలాంటి ఆంక్షలు లేకుండా మహిళలు ఏ అవసరానికైనా ఉపయోగించుకోవచ్చని ప్రభుత్వం గతంలోనే స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

**పది రోజులపాటు ఉత్సవాలు**

కాగా వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ ఉత్సవాలను ప్రభుత్వం పది రోజుల పాటు పండగలా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 5 వరకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తారు. రోజుకు కొన్ని గ్రామ సమాఖ్యల పరిధిలో పంపిణీ జరిగే ప్రాంతంలో ఆ ప్రాంత ఎంపీ, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రణాళికలు సిద్ధం చేశాయి. ఆయా కార్యక్రమాలకు స్థానిక జెడ్పీటీసీ, ఎంపీటీసీలతోపాటు సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులను కూడా ప్రత్యేకంగా ఆహ్వానించారు. మంత్రులు కూడా రోజూ పాల్గొంటారు.

**ఇంటింటికీ వెళ్లి..**

మరోవైపు ఇప్పటికే మార్చి 14 నుంచి 17 వరకు గ్రామ, వార్డు వలంటీర్లు, గ్రామ సమాఖ్య సహాయకులు (వీవోఏ), పట్టణ రిసోర్స్ పర్సన్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మూడో విడతలో వారికి ఎంత మొత్తం ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. అలాగే మార్చి 18 నుంచి 20 వరకు సెర్ప్ కమ్యూనిటీ కోర్డినేటర్లు ఆయా పొదుపు సంఘాల సభ్యులందరితో సమావేశాలు నిర్వహించారు. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల వారీగా లబ్ధిదారుల సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 21న సచివాలయాల వారీగా సమావేశాలు ప్రారంభం కాగా, 23, 24 తేదీల్లో కూడా కొనసాగనున్నాయని సెర్ప్ అధికారులు వెల్లడించారు.

**చంద్రబాబు కాలంలో సంఘాలన్నీ కుదేలు**

2014లో డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని అప్పటి ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. తర్వాత ఆ హామీని అమలు చేయకుండా మోసం చేశారు. 2014 ఎన్నికల ముందు డ్వాక్రా రుణాలు ఎవరూ కట్టవద్దని చంద్రబాబు పిలుపునివ్వడంతో మహిళలు ఆ రుణాలు కట్టలేదు. దీంతో వాటి వడ్డీలు కూడా చెల్లించలేనంతగా పెరిగిపోయాయి. ఈ పరిస్థితిలో పొదుపు సంఘాలు పూర్తి చిన్నాభిన్నమై 'ఏ' కేటగిరీ సంఘాలు కూడా 'సీ', 'డీ' కేటగిరీల్లోకి వెళ్లిపోయాయి. పొదుపు సంఘాల రుణాలపై సున్నా వడ్డీ పథకానికి కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వడం నిలిపివేసింది. ఇలాంటి దుస్థితిలో రాష్ట్రంలో తిరిగి పొదుపు సంఘాల వ్యవస్థను గాడిలో పెట్టేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకానికి శ్రీకారం చుట్టింది. దీంతో పొదుపు సంఘాలు తిరిగి జీవం పోసుకున్నాయి. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడంలో మన రాష్ట్ర మహిళలు దేశంలోనే అత్యధికంగా ఉన్నారు. మన రాష్ట్రంలో 99.55 శాతం మంది రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారు. దీంతో మొత్తం పొదుపు సంఘాల్లో 91 శాతం ఏ, బీ గ్రేడ్‌ల్లో కొనసాగుతున్నాయి.

# విద్యా 'బుద్ధి' లేని వర్సిటీలు

- దేశంలో 695 యూనివర్సిటీలు నాసిరకం
- దేశవ్యాప్తంగా న్యాక్ గుర్తింపు లేని కాలేజీలు 34,734
- రాష్ట్రంలో న్యాక్ గుర్తింపు తప్పనిసరి చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం

సాక్షి, అమరావతి: దేశంలోని వర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థల్లో అధికశాతం నాసిరకమైనవేనని తేలింది. దేశంలో 1,113 విశ్వవిద్యాలయాలు ఉండగా, వీటిలో 695 వర్సిటీల్లో నాణ్యతా ప్రమాణాలు లేవంటూ వాటికి గుర్తింపునివ్వడానికి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ అక్రిడిటేషన్ అండ్ అసెస్‌మెంటు కౌన్సిల్ (న్యాక్) నిరాకరించింది. దేశంలోని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలు నిబంధనల మేరకు బోధన, బోధనేతర సిబ్బందిని, మౌలిక సదుపాయాలను కలిగి ఉండి, ఉన్నత ప్రమాణాలను పాటిస్తుంటే వాటికి న్యాక్ గుర్తింపు లభిస్తుంది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ వీటికి నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకులను కూడా ఇస్తుంది. ఈ విద్యా సంస్థలకు కేంద్రం ప్రోత్సాహకాలు, మంచి ర్యాంకులు పొందిన వాటికి యూజీసీ ద్వారా భారీగా నిధులు కూడా ఇస్తుంది. వర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థల ప్రమాణాలను అంచనా వేయడానికి ఏటా కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో సర్వే కూడా నిర్వహిస్తుంది. ఇందుకు ఆలిండియా సర్వే ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏఐఎస్‌హెచ్‌ఈ – ఐష్) పేరుతో ప్రత్యేక పోర్టల్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఈ పోర్టల్‌లో అన్ని ఉన్నత విద్యా సంస్థలు వాటి వివరాలను నమోదు చేయాలి. అలా చేయని సంస్థలకు కేంద్రం నిధులు ఇవ్వదు. అనుమతులు కూడా రద్దు చేస్తుంది. 2020–21 ఏఐఎస్‌హెచ్‌ఈ నివేదిక ప్రకారం దేశంలోని వర్సిటీల్లో 418కి మాత్రమే న్యాక్ గుర్తింపు ఉంది. అలాగే 43,796 కాలేజీల్లో 9,062 కళాశాలలకు మాత్రమే న్యాక్ అక్రిడిటేషన్ ఉన్నట్లు కేంద్రం పార్లమెంటులో వెల్లడించింది. అంటే 34,734 కాలేజీలు నాణ్యత లేనివని తేలింది.

**రాష్ట్రంలో న్యాక్ గుర్తింపు తప్పనిసరి**

రాష్ట్రంలో అన్ని ఉన్నత విద్యా సంస్థలు ఉత్తమ ప్రమాణాలు పాటించేలా రాష్ట్ర ప్రభుత్వం న్యాక్ ఏ ప్లస్ ప్లస్, ఏ ప్లస్, ఏ కేటగిరీల గుర్తింపు ఉండాలన్న నిబంధనను తప్పనిసరి చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ దిశగా మార్గనిర్దేశం చేశారు. విద్యా సంస్థలకు మూడేళ్ల గడువు ఇచ్చి ఆ మేరకు ప్రమాణాలు పాటించాలని నిర్దేశించారు. ప్రమాణాలు పెంపొందించుకోలేని వాటికి అనుమతులు, ప్రవేశాలు రద్దు చేయాలని నిబంధన విధించారు. ప్రమాణాలను అందుకొనేందుకు విద్యా సంస్థలకు ఉన్నత విద్యా మండలి తగిన సహకారాన్ని అందిస్తుంది.

# భూగర్భ జలాల సంరక్షణలో ఏపీ టాప్

- దేశంలో భూగర్భ జలాలపై కేంద్రం అధ్యయనం
- పంజాబ్, రాజస్తాన్, హరియాణా, ఢిల్లీ, తమిళనాడుల్లో ప్రమాదకరస్థాయికి చేరిన భూగర్భ జలమట్టం
- ఏపీలో కేవలం ఆరు మండలాల్లోనే పరిమితికి మించి వినియోగం
- దేశవ్యాప్తంగా సగటున 60 శాతం భూగర్భ జలాల వినియోగం– ఏపీలో 28 శాతమే వాడకం



సాక్షి, అమరావతి: భూగర్భ జలాలను పెంపొందించడం, పొదుపుగా వినియోగించడం, వాటిని సంరక్షించడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 7,089 మండలాలు, బ్లాక్‌లు, వ్యాలీలు, ఫిర్కాల పరిధిలో భూగర్భ జలమట్టంపై కేంద్ర జల్ శక్తి శాఖ అధ్యయనం చేసింది. భూగర్భ జలాలను పరిమితికి మించి తోడేస్తున్న మండలాలు, బ్లాక్‌లు 1,006 ఉంటే.. అందులో కేవలం 6 మాత్రమే ఏపీలో ఉన్నాయి. పరిమితికి మించి భూగర్భ జలాలను తోడేస్తున్న ప్రాంతం దేశంలో సగటున 14.19 శాతం ఉంటే.. ఇందులో రాష్ట్రంలో 0.98 శాతం ప్రాంతం మాత్రమే ఉంది. భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయికి చేరిన రాష్ట్రాల్లో పంజాబ్(76.47 శాతం వినియోగం) మొదటి స్థానంలో ఉండగా.. రాజస్తాన్(72.52 శాతం) రెండో స్థానంలో, హరియాణా(61.54 శాతం) మూడో స్థానంలో, ఢిల్లీ(44.12 శాతం) నాలుగో స్థానంలో, తమిళనాడు(30.87 శాతం) ఐదో స్థానంలో నిలిచాయి. దాద్రానగర్ హవేలి, దయ్యూ డామన్‌లో భూగర్భ జలాలను వంద శాతం తోడేయడం వల్ల వాటి పరిస్థితి ప్రమాదకర స్థాయిని దాటిపోయింది. దేశంలో భూగర్భ జలాల పరిస్థితిపై కేంద్ర భూగర్భ జలవనరుల మండలితో కలిసి 2020లో ఒకసారి.. 2022లో మరోసారి కేంద్ర జల్ శక్తి శాఖ అధ్యయనం చేసింది. ఇందులో వెల్లడైన ప్రధానాంశాలు..

**రాష్ట్రంలో 28 శాతమే వినియోగం..**

- దేశంలో గతేడాది కురిసిన వర్షాల వల్ల భూగర్భంలోకి 15,451.65 టీఎంసీల నీళ్లు ఇంకిపోయి భూగర్భ జలాలుగా మారాయి. ఇందులో 14,056.20 టీఎంసీలను వినియోగించుకోవచ్చు. అందులో 8,444.73 టీఎంసీలను(60 శాతం) ఇప్పటికే ఉపయోగించారు.
- ఏపీలోని 667 మండలాల పరిధిలో గతేడాది కురిసిన వర్షాల వల్ల 961.13 టీఎంసీలు భూగర్భ జలాలుగా మారాయి. ఇందులో 913.11 టీఎంసీలను ఉపయోగించుకోవచ్చు. కానీ.. 263.05 టీఎంసీలు(28 శాతం) మాత్రమే వినియోగించారు. పల్నాడు జిల్లాలోని వెల్దుర్తి, ప్రకాశం జిల్లాలోని పెద్దారవీడు, శ్రీసత్యసాయి జిల్లాలోని గాండ్లపెంట, హిందూపురం, రొళ్ల, తనకల్లులో మాత్రమే పరిమితికి మించి భూగర్భ జలాలను ఉపయోగించారు.
- రాష్ట్రంలో 667 మండలాల పరిధిలోని భౌగోళిక విస్తీర్ణం 1,40,719.5 చదరపు కిలోమీటర్లు కాగా, ఇందులో 1,380.65 చదరపు కిలోమీటర్ల భూభాగంలో మాత్రమే భూగర్భ జలాలను పరిమితికి మించి వాడారు.

**సమృద్ధిగా వర్షాలు.. పెరిగిన భూగర్భ జలాలు..**

రాష్ట్రంలో 2019 నుంచి ఏటా సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. వరద నీటిని ఒడిసిపట్టి.. ప్రాజెక్టులు, చెరువులు నింపుతున్న రాష్ట్ర ప్రభుత్వం.. అత్యధిక ఆయకట్టుకు ఏటా నీళ్లందిస్తోంది. భూగర్భ జలాల సంరక్షణ కట్టడాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. 2020లో 850.91 టీఎంసీలు భూగర్భ జలాల రూపంలోకి మారగా.. 2022లో 961.13 టీఎంసీలు రూపాంతరం చెందాయి. 2020లో ఉపయోగించుకోదగ్గ భూగర్భజలాలు 810.36 టీఎంసీలుగా ఉండగా.. 2022 నాటికి 913.11 టీఎంసీలకు పెరిగింది. గతేడాది భూగర్భ జలాలను 269.41 టీఎంసీలు వాడుకోగా.. 2022లో 263.05 టీఎంసీలు మాత్రమే ఉపయోగించారు. రాష్ట్రంలో భూగర్భ జలమట్టం సురక్షిత స్థాయిలో ఉన్న మండలాలు 2020లో 551 ఉండగా.. 2022లో వాటి సంఖ్య 598కి పెరిగింది. పరిమితికి మించి తోడేసిన మండలాలు 2020లో 23 ఉండగా.. 2022లో వాటి సంఖ్య 6కు తగ్గింది.

### రూ.7.48 కోట్ల బంగారం స్వాధీనం... నలుగురి అరెస్టు
#### కస్టమ్స్ అధికారుల విస్తృత దాడులు

సాక్షి, అమరావతి/పటమట (విజయవాడ తూర్పు): విజయవాడ కస్టమ్స్ విభాగం అధికారులు బుధవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న రూ.7.48కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు విజయవాడ రైల్వే స్టేషన్‌లో కస్టమ్స్ అధికారులు 5 కేజీల అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ నిందితులను విచారించి రాబట్టిన సమాచారం ఆధారంగా ఏపీ–తమిళనాడు సరిహద్దుల్లో 30 మంది అధికారుల బృందం విస్తృతంగా దాడులు చేసి కార్లు, స్కూటర్లలో అక్రమంగా తరలిస్తున్న మరో 7.79 కేజీల బంగారాన్ని పట్టుకున్నారు. మొత్తం మీద 15 ప్రాంతాల్లో మొత్తం రూ.7.48కోట్ల విలువైన 12.97 కేజీల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను న్యాయస్థానంలో హాజరు పరిచారు. కాగా, 2022–23లో విజయవాడ కస్టమ్స్ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించి రూ.19.75కోట్ల విలువైన అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ కమిషనర్ కె.ఇంజనీర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

# అడవికి ఆపద...

**ప్రపంచవ్యాప్తంగా అడవుల తగ్గుదల**

- రెండో స్థానంలో భారత్
- మొదటి స్థానంలో బ్రెజిల్.. మూడో స్థానంలో ఇండోనేషియా
- 18ఏళ్లలో 19.29 కోట్ల ఎకరాల అడవుల క్షీణత

సాక్షి, అమరావతి: దేశంలో అడవుల క్షీణత ప్రమాదఘంటికలు మోగిస్తుండగా.. ప్రపంచంలోనే అటవీప్రాంతం క్షీణతలో భారత్ రెండోస్థానంలో ఉండడం మరింత ఆందోళన కలిగిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తున్నది. 2015–2020 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా అటవీప్రాంతాల క్షీణతపై ఐక్య రాజ్య సమితికి అనుబంధంగా ఉండే యుటిలిటీ బిడ్డర్ అనే సంస్థ నివేదిక సమర్పించింది. ఇంధనం, యుటిలిటీ వ్యయాలు, అడవుల క్షీణత, అందులోనూ పర్వతప్రాంతాల అడవుల క్షీణతపై అధ్యయనం చేసింది. దీని ప్రకారం ప్రపంచంలోనే అటవీ విస్తీర్ణం తగ్గుదలలో భారత్ రెండో స్థానంలో ఉంది. 2015–2020 మధ్య భారత్‌లో 16.50లక్షల ఎకరాల అటవీప్రాంతం కనుమరుగయ్యింది. 41.88లక్షల ఎకరాల అటవీ ప్రాంతాన్ని కోల్పోయి బ్రెజిల్ మొదటిస్థానంలో ఉండగా 10.50 లక్షల ఎకరాల అటవీప్రాంతం క్షీణతతో ఇండోనేషియా మూడో స్థానంలో ఉంది.

**భారత్‌లో పరిస్థితి ఆందోళనకరం..**

ఇక గత 30ఏళ్లలో అటవీప్రాంతాల క్షీణతను పరిశీలిస్తే భారత్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని నివేదిక వెల్లడించింది. 1990–2000 అటవీప్రాంతాల క్షీణత రేటుతో పోలిస్తే 2015–2020లో దేశంలో అడవులు మరింత వేగంగా కనుమరుగవుతున్నాయి. 1990–2000 మధ్య అంటే పదేళ్లలో దేశంలో 9.48 లక్షల ఎకరాల అటవీప్రాంతం తగ్గింది. కానీ 2015–2020 ఐదేళ్లలోనే 16.50లక్షల ఎకరాల అటవీప్రాంతం తగ్గడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

**పర్వత ప్రాంతాల అడవులు తగ్గుదల..**


ప్రపంచ వ్యాప్తంగా పర్వత ప్రాంతాల్లో అడవులు వేగంగా తరిగిపోతున్నాయని నివేదిక వెల్లడించింది. 2000లో భూమి మీద పర్వతాలపై 271కోట్ల ఎకరాల అటవీప్రాంతం ఉండేది. కాగా 2018నాటికి 19.29కోట్ల ఎకరాల పర్వతప్రాంత అడవులు కనుమరుగైపోయాయి. పర్వతప్రాంతాల అడవుల క్షీణతకు పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలే ప్రధాన కారణం. దాంతోనే 42శాతం పర్వతప్రాంతాల అడవులు క్షీణిస్తున్నాయి. కాగా కార్చిచ్చులతో 29శాతం, వ్యవసాయ విస్తరణతో 15శాతం, పోడు వ్యవసాయంతో 10శాతం పర్వత ప్రాంతాల అడవులు తగ్గాయి.

**సగానికిపైగా ఆసియా ఖండంలోనే..**

పర్వత ప్రాంతాల అడవుల క్షీణతలో సగానికిపైగా ఆసియా ఖండంలోనే ఉండడం గమనార్హం. ఆసియా ఖండంలో 39.8 మిలియన్ హెక్టార్ల అటవీప్రాంతం తగ్గింది.

# కొల్లేరులో 'బుచ్చిగాళ్ల' కిలకిలలు

- ఆకట్టుకుంటున్న కింగ్‌ఫిషర్ అందాలు
- కొల్లేరులో మూడు రకాలు సంచారం
- పూర్తయిన అటవీశాఖ పక్షుల గణన



పెద్దముక్కు బుచ్చిగాడు (స్టార్క్ బిల్డ్ కింగ్‌ఫిషర్)



తెల్లగొంతు బుజ్జిగాడు (వైట్ థ్రోటెడ్ కింగ్‌ఫిషర్)



నీళ్ల బుచ్చిగాడు (పెయిడ్ కింగ్‌ఫిషర్)

కైకలూరు: కొల్లేరు ప్రాంతంలో కింగ్‌ఫిషర్ పక్షులను అటవీ శాఖ సిబ్బంది గుర్తించారు. ఈ పక్షులను తెలుగులో లకుముకి పిట్ట అని.. కొల్లేరు ప్రాంతంలో బుచ్చిగాళ్లుగా పిలుస్తారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల పక్షుల గణన చేపట్టగా వీటి ఉనికిని గుర్తించారు. పక్షి ప్రేమికుల స్వర్గధామంగా పేర్గాంచిన ఆటపాక పక్షుల కేంద్రం వద్ద ఈ పక్షులు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి.

**116 జాతులు**

కింగ్‌ఫిషర్ పక్షులు దాదాపు 116 జాతులున్నాయి. ఉష్ణ, శీతోష్ణస్థితి మండలాలు, నదులు, సరస్సుల ప్రాంతాల్లో నివసిస్తాయి. ఈ జాతిలో ఉప కుటుంబాలుగా ట్రీకింగ్ ఫిషర్స్ (హల్సియోనినే), రివర్ కింగ్‌ఫిషర్స్(ఆల్సెడినినే), వాటర్ కింగ్‌ఫిషర్స్ (సెరిలినే) ఉన్నాయి. వీటిలో అతిచిన్న పక్షి ఆఫ్రికన్ డ్వార్ఫ్ కింగ్‌ఫిషర్ 10 సెంటీమీటర్ల పొడవు, కేవలం 12 గ్రాముల బరువు, పెద్దదైన జాయింట్ కింగ్‌ఫిషర్ 46 సెంటీమీటర్ల పొడవు, 426 గ్రాముల బరువు ఉంటుంది. మూడు నుంచి 10 వరకు గుడ్లు పెడతాయి. చేపలు, చిన్న పాము పిల్లలు, కప్పలు, పురుగులు, సాలె పురుగులు, గొల్లభామలు, కీటకాలను ఆహారంగా తీసుకుంటాయి. చెట్లు, భూమి రంధ్రాలలో నివసిస్తాయి.

**కొల్లేరులో మూడు రకాలు**

కొల్లేరు అభయారణ్యంలో మూడు రకాల కింగ్‌ఫిషర్లు సంచరిస్తున్నాయి. వీటిలో నీళ్ల బుచ్చిగాడు (పెయిడ్ కింగ్‌ఫిషర్–31 సెంటీమీటర్లు), పెద్దముక్కు బుచ్చిగాడు (స్టార్క్ బిల్డ్ కింగ్‌ఫిషర్–38 సెంటీమీటర్లు), తెల్లగొంతు బుజ్జిగాడు (వైట్ థ్రోటెడ్ కింగ్‌ఫిషర్–28 సెంటీమీటర్లు)ను అటవీ సిబ్బంది గుర్తించారు. వీటి కూతలు వినసొంపుగా ఉంటాయి. ఇవి ఒంటరిగా సంచరిస్తాయి. కొల్లేరు చిత్తడి నేలల ప్రాంతం కావడంతో వీటి సంచారం మరింత పెరగవచ్చని అటవీ సిబ్బంది అంచనా వేస్తున్నారు.

**కింగ్‌ఫిషర్లకు నిలయంగా..**



కొల్లేరు అభయారణ్యం 181 రకాల పక్షిజాతులకు ఆవాసయోగ్యంగా ఉంది. బుచ్చిగాడు (కింగ్‌ఫిషర్)లను పక్షుల గణనలో గుర్తించాం. త్వరలో వీటి వివరాలను ప్రకటిస్తాం. కొల్లేరు సహజ సిద్ధ ప్రకృతి పరిసరాలు జీవరాశులకు అనుకూలంగా ఉండటంతో పక్షుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. ఇప్పటికే ఎక్కువగా విదేశీ పెలికాన్ పక్షులు విడిది చేసే ప్రాంతంగా కొల్లేరు సరస్సు గుర్తింపు పొందింది.

–జి.శ్రీనివాసరావు, ఫారెస్టు రేంజర్, కైకలూరు

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.